# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

జులై 2024

వెల: రూ. 25/-









# శ్రీవేంకటేశం

**ఆధ్యాత్మిక మాసపత్రిక**

**సంపుటి:** 17 **సంచిక:** 7


**సలహాదారులు, స్ఫూర్తిదాత,**
**కర్త, కర్మ, క్రియ మా ప్రభు**
**తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**


ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్:
**పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్: **సాయినాథ్, రమేష్**

**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| శుభప్రదం, దివ్యప్రదం అఖిలాండ బ్రహ్మాండ నాయకుని ఆణివర ఆస్థానం | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దశ... | 9 |
| గురు పౌర్ణమి | 19 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 22 |
| అన్నం పరబ్రహ్మ స్వరూపం | 28 |
| వ్యాస పూర్ణిమ | 33 |
| రామాయణ రత్నాకరం | 36 |
| శ్రీకృష్ణ తత్వం | 40 |
| ముకుందమాల | 42 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 45 |
| అష్టాదశ సిద్ధులు | 50 |
| తులసి | 52 |
| తిరుమల సర్వస్వం | 55 |
| మాధవదాసు కథ | 60 |
| మీ ప్రశ్న మా సమాధానం | 62 |
| తొలి ఏకాదశి | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |




# ధర్మో రక్షతి రక్షితః

మానవుని జీవన విధానము తన నడవడికి ప్రతిబింబము. సజ్జనుల జీవన విధానము బహు చక్కగా, ఎవరినీ నొప్పించక ఉంటుంది. ఇతరుల మనస్సుకు అగు గాయము వారి గాయము వలె చింతించుదురు. వీరితో సహవాసము చేయువారు ధన్యులు. వీరు కూడా కాలక్రమములో సజ్జనులుగా మారగలరు. కాని దుర్జనులని రెండవ తెగవారు ఉన్నారు. స్వప్రయోజనాల కొరకు ఇతరులను హింసించుటే వీరికి ఆనందం. వీరిని గమనించి దూరంగా ఉండుట సజ్జనుని లక్షణము. దుర్జనుల వలన లాభం పొందుట కూడా మంచిది కాదని ఇది కూడా అధర్మము చేసిన దాని క్రిందికి రాగలదని పెద్దలంటారు. పూర్వము మహాభారతంలో భీష్ముడు, ద్రోణాచార్యులు, అశ్వత్థామ అధర్మాన్ని వ్యతిరేకించే మంచి వ్యక్తులు. కాని కొన్ని సందర్భములలో అధర్మాన్ని వ్యతిరేకించక దుర్యోధనాదుల సహవాసము వలన చెడ్డపనులు చేసి చెడ్డవారుగా శిక్ష అనుభవించారు. వీరు లోకానికి ఆదర్శంతులైన మహా గొప్పవారు. కాబట్టి వీరి జీవితములోని ధర్మ సూక్ష్మములను తెలుసుకొనుట ఎంతో అవసరము. కురుసభలో ద్రౌపది అవమానాన్ని శక్తి ఉండి కూడా ఆపలేకపోవుట భీష్ముని తప్పు. ఒక వ్యక్తి శక్తి మేర అన్యాయాన్ని ఆపాలి కాని భీష్ముడు ఆ పని చేయక తరువాత కాలములో ఎంతో చింతించాడు. ఇక గురు ద్రోణాచార్యులు మహా గొప్పవారు. వీరు కూడా ద్రౌపది అవమానాన్ని చూస్తూ ఊరుకున్నారు. పైగా అధర్మం పక్షాన నిలబడ్డారు. ధర్మ నియమాలకంటే పుత్రప్రేమకే విలువనిచ్చేవాడు కావటం వలన శిక్షననుభవించాడు. ఇక అశ్వత్థామ మరో అడుగు ముందుకు వేసి అధర్మపరులైన దుర్యోధనాదుల రక్షణాకై బ్రహ్మాస్త్రాన్నే ప్రయోగించినవాడు. కాబట్టి అందరికంటే ఎక్కువ శిక్షననుభవిస్తున్నాడు.

ఈ సూక్ష్మధర్మాన్ని భావితరాలు గుర్తించి ధర్మమార్గంలో నడుచుకోవాలన్నదే మహాభారత ఉద్దేశ్యము. జీవితంలో మనిషి సుఖం కంటె నీతికి, ధర్మానికి ఎక్కువ విలువనీయమంటాయి మన పురాణాలు. అందుకే ధర్మో రక్షతి రక్షితః అంటారు. మనం ధర్మాన్ని కాపాడితే అది మనల్ని రక్షిస్తుందట. ఇది అబద్ధం కాదు. ప్రతి జీవి వారి వారి జీవితాలను పరిశీలించుకుంటే వారికే తెలుస్తుంది. ధర్మమార్గంలో పయనించేవారు తృప్తిగా జీవిస్తారు. పైగా భగవంతుడు వీరినే ఇష్టపడతాడు. భగవంతుణ్ణి తృప్తి పరచుటే మానవ ధర్మము. ప్రతి మనిషి పుట్టుకతో కొన్ని గుణాలు కలిగి ఉంటాడు. భగవంతుని స్మరణలో, సజ్జనుల సహవాసంతో భగవంతునికి మరింత దగ్గరకు వెళ్ళగలము. మన సుఖ సంతోషాలను ప్రక్కన పెట్టి భగవంతుని నియమాలను పాటించువాడు ఆయనకు మరింత ఇష్టుడు. మానవుల ఉద్ధరిణే లక్ష్యంగా రామాయణ, భారతాది ఎన్నో గ్రంథాలను అందించాడు. మన కోసమే ఎన్నో అవతారాలనెత్తాడు. కాబట్టి ప్రతి మనిషి తన సుఖము కంటె విధి నియమాలకు విలువనిస్తూ జీవించుట ఉత్తమము. సదా శ్రీవేంకటేశ్వరుని స్మరణతో ఎంతటి విపత్కర పరిస్థితినైనా సులభంగా దాటగలము. చక్కని నడవడి కలిగి సజ్జన మిత్రులతో జీవిద్దాం. సజ్జనులుగా మారుదాం. జీవితం చాలా చిన్నది, కన్ను మూసి తెరిచే లోగా అంతమైపోవచ్చు. కనుక బహు జాగ్రత్తగా మన శేష జీవితాన్ని భగవంతునికి అర్పిద్దాం. ఆయన నీడలో, ఆయన నామస్మరణలో, ఆయన వాడిగా జీవిద్దాం. తెలిసో, తెలియకనో ఎన్నో తప్పులు చేసి ఉండవచ్చు. వీటన్నింటిని క్షమించమని శరణు కోరుదాం. నీవే తప్ప మరేది ఎరుగనని దృఢచిత్తులమై శరణు కోరితే తప్పక రక్షిస్తాడు. స్వామివారు భక్తవత్సలుడు. నమో వేంకటేశాయ.

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354,** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:____________________
____________________
చిరునామా:____________________
____________________
____________________
____________________
____________________
పిన్‌కోడ్:____________________
చందా వివరాలు:____________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

**చందాదారులకు స్వామివారి పవిత్ర పాదాలు (10"x8") ఉచితం**



# శ్రీ వేంకటేశ్వర స్తుతి

శ్లో ॥ శ్రీ భూమినాయక దయాది గుణామృతాబ్ధే
దేవాధిదేవ జగదేక శరణ్యమూర్తే
శ్రీమన్ననంత గరుడాదిభి రర్చితాంఘ్రే
శ్రీవేంకటాచలపతే! తవ సుప్రభాతమ్ ॥

తాత్పర్యం : లక్ష్మీదేవికి, భూదేవికి భర్తయై దయాది గుణములకు నిలయుడవై, దేవతలకు అధిదేవతయై, లోకులకు ఏకైక శరణ్యమై నిత్యసూరులకు శేషుడు, గరుడుడు మొదలగు వారిచే పూజింపబడువాడవై, సకల సంపదలకు నిలయుడవై వేంకటాద్రిపై నివసించుచున్న వేంకటేశా! నీకు శుభోదయమగు గాక!

శ్లో ॥ శ్రీపద్మనాభ! పురుషోత్తమ! వాసుదేవ!
వైకుంఠ! మాధవ! జనార్దన! చక్రపాణే!
శ్రీవత్స చిహ్న! శరణాగత పారిజాత!
శ్రీవేంకటాచలపతే! తవ సుప్రభాతమ్ ॥

తాత్పర్యం : పద్మనాభుడవై, పురుషోత్తముడవై, ప్రపంచమంతటా లోపల, బయట వ్యాపించి యున్నవాడవై, వైకుంఠ నిలయుడవై, లక్ష్మీనాథుడవై, జనార్దనుడవై, చక్రపాణివై, శ్రీవత్సమను పేరుగల మచ్చ గలవాడవై, శరణు కోరిన వారికి కల్పవృక్షము వంటివాడవై ఉన్న వేంకటనాథుడా! నీకు సుప్రభాతము.

– డా॥ కె.వి. రాఘవాచార్యులు



# ముక్తిమార్గము



## ధన్యాసి

ఎంత విభవము గలిగె – నంతయును నాపదని
చింతించినది గదా – చెడని జీవనము ||పల్లవి||

1. చలముఁ గోపంబుఁ దనుఁ – జంపేటి పగతులని
తెలిసినది యదిగదా – తెలివి,
తలకొన్న పరనింద – తనపాలి మృత్యువని
తొలఁగినది యదిగదా – తందగన్న ఫలము ||ఎంత||

2. మెఱయు విషయములె తన – మెడనున్న యురులుగా
ఎఱిఁగినది యదిగదా – యెఱుక,
పఱివోని యాస దనుఁ – బట్టుకొను భూతమని
వెఱచినది యదిగదా – విజ్ఞానమహిమ ||ఎంత||

3. ఎనలేని తిరువేంక – టేశుఁడే దైవమని
విన గలిగినదిగదా – వినికి,
అనయంబు నతని సే – వానందపరులయి
మనఁ గలిగినది గదా – మనుజులకు మనికి ||ఎంత||




**భావము** – ఎంత ఐశ్వర్యము గలిగినను అది యంతయు ఆపదయే గాని సంపద గాదని భావించి గర్వగ్రస్తుడు గాని వాని బ్రతుకే చెడని బ్రదుకు.

మచ్చరము, కోపము అను తన దుర్గుణములే తన్ను జంపు శత్రువులని తెలిసి వాటిని దరికి రానీయకుండుటే నిజమైన తెలివి. పరదూషణము తనపాలి మృత్యువని తలచి దానిని వర్జించుటే శ్రేష్ఠాతి శ్రేష్ఠమైన ఫలము.

శబ్ద స్పర్శ రూపాదులైన విషయములే తన మెడకు దగులుకొన్న ఉరులుగా గ్రహించి వాటికి దూరమగుటే నిజమైన విజ్ఞత. బలవత్తరమైన ఆశయే తన్ను పట్టుకొన్న దయ్యమని యెంచి దానికి వెఱచి తొలగుటయే విశిష్టమైన తెలివి.

సాటిలేని శ్రీవేంకటేశ్వరుడే దైవమని పెద్దలవలన విన్నదియే నిజమైన వినికి. ఎల్లప్పుడూ ఆ దేవుని సేవించుచు ఆనందముతో బ్రదుకువారిదే నిజమైన బ్రదుకు.


**భావానువాదం:**
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**



# శుభప్రదం, దివ్యప్రదం

## అఖిలాండ బ్రహ్మాండనాయకుని ఆణివర ఆస్థానం

– చింతలపాటి శివశంకర శాస్త్రి



శ్లో ॥ "చతుర్భుజం చిదానందం మల్ల చాణూర మర్దనం
చరాచర గురం దేవం తం వందే చక్రపాణినం
శ్రియః కరం శ్రియోనాథం శ్రీధరం శ్రీ వరప్రదం
శ్రీవత్సల ధరం సౌమ్యం తం వందే శ్రీ సురేశ్వరం"

పద్మనేత్రుడు, పద్మనాభుడు, పద్మమాలాధరుడు, దేవదేవుడు, అనంత శక్తిస్వరూపుడు, అఖిలాండ బ్రహ్మాండ నాయకుడు, ఆపద్బాంధవుడు, అర్చామూర్తిగా ప్రసిద్ధి కెక్కిన తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి ఎన్నో ఉత్సవాలు వైఖానస ఆగమ శాస్త్ర పద్ధతిన శాస్త్రోక్తంగా ఆచరింపబడుతున్నాయి. సంసార సాగర తాపత్రయ సందోహ మానసులైన భక్తజనులను ఉద్ధరించుటకై అనేకములైన నిత్య నైమిత్తిక కామ్యోత్సవాలు జరుపబడుతున్నాయి. భారతదేశంలో మరెక్కడా జరుపబడని విధంగా పచ్చని తోరణాలతో కూడిన నిత్యకళ్యాణం సప్తగిరి వాసునకు అత్యంత వైభవంగా జరుపబడుతున్నాయి. సుప్రభాత సేవ మొదలు ఏకాంత సేవ వరకు జరుగు ఉత్సవాలు నిత్యోత్సవాలుగాను, వసంతోత్సవం, పద్మావతీ పరిణయం, జ్యేష్ఠాభిషేకం, తెప్పోత్సవం, పవిత్రోత్సవం, బ్రహ్మోత్సవం మొదలగు ఉత్సవాలు సాంవత్సరిక ఉత్సవాలుగాను నిర్ణయించవచ్చు.

"కట్టెదుర వైకుంఠం కాణాచయిన కొండ
తెట్టరాయ మహిమలే తిరుమలకొండ

వేదములే శిలలై వెలసి నదీకొండ
యే దెసఁ బుణ్య రాసులే యేరులైనదీ కొండ
గాదిలి బ్రహ్మాది లోకముల కొనల కొండ
శ్రీదేవుడుండేటి శేషాద్రి కొండ"

అని అన్నమయ్య వర్ణించిన భూలోక వైకుంఠం నిత్యకళ్యాణం... పచ్చతోరణంగా విరాజిల్లుతూ ఉన్న తిరుమల క్షేత్రంలో కొలువుదీరిన కలియుగ ప్రత్యక్ష దేవుడు ఆర్తితో పిలిస్తే పలికే దేవదేవుడు, ఆదుకునే ఆపద్బాంధవుడు, ఆపద మొక్కులవాడు, అనాథ రక్షకుడు, భక్తజనప్రియుడు, తెలుగువారి ఇలవేల్పు, కలల పందిరి అయిన వేంకటేశ్వరస్వామి సుప్రభాత సేవలో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. దేవదేవుడైన శ్రీనివాసునికి నిత్య, వార, సపక్షత్ర, మాస, సంవత్సరోత్సవాలు అనేకం వైభవంగా జరుగుతాయి.

"శ్రీ శ్రీనివాసః పరదైవతం నః
శ్రీ శ్రీనివాసః పరమం ధనం నః
శ్రీ శ్రీనివాసః కులదైవతం నః
శ్రీ శ్రీనివాసః పరమాగతిర్నః

నిరంతరం నిరంతరాయంగా రాత్రి బ్రహ్మాది దేవతల చేత, పగలు మానవుల చేత సేవింపబడుతూ, తన కడగంటి చూపులతో అందరినీ సంపూర్ణంగా అనుగ్రహిస్తున్న శ్రీనివాస ప్రభువునకు సాటి రాగల దేవుడు ఇంకొకడు లేడు. లేనే లేడు. ఆ దేవునికి సాటి ఆ దేవుడే. అలాంటి సర్వ సగత్ప్రభువైన తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి జరుగుతున్న వార్షిక ఉత్సవాల్లో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నది ఆణివరోత్సవం.

ఈ ఉత్సవం ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో అనగా కర్కాటక సంక్రాంతినాడు జరుపబడుతుంది. కర్కాటక సంక్రాంతి సర్వసాధారణమని జులై 16వ తేదీన వస్తుంది. సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం తొలిరోజున (జులై 16) జరుపబడే ఆస్థానం (కొలువు) కనుక "ఆణివర ఆస్థానం" అని పిలువబడుచున్నది.

ఈ ఆణివర ఆస్థానము జరిపేటప్పుడు ప్రతిరోజు ఉదయం సుప్రభాతం, విశ్వరూప దర్శనం, తోమాలసేవ అనంతరం స్నపనమండపంలో శ్రీవేంకటేశ్వరస్వామి (కొలువుమూర్తి) ఛత్ర చామర మర్యాదలతో, బంగారు సింహాసనంపై కొలువుదీరగా దేవస్థాన ఉద్యోగ భృత్య బృందం స్వామివారికి పంచాంగ శ్రవణం చేయిస్తారు. ఆనాటి తిథి, వార, నక్షత్ర విశేషాలతో పాటు ఉత్సవ విశేషాలు స్వామివారికి వినిపిస్తారు. అంతేకాక ముందునాటి ఆదాయాన్ని బంగారం, వెండినగలు, పాత్రలు మున్నగు సమస్త వస్తువుల విలువను లెక్కలు గట్టి మొత్తం నికరాదాయాన్ని పైసలవరకు కూడా శ్రీస్వామి వారికి అత్యంత భక్తి ప్రపత్తులతో చదివి వినిపిస్తారు. ముందునాడు దర్శనం చేసుకున్న భక్తుల సంఖ్యను కూడా తెలపడం జరుగుతుంది. ఈ విన్నపాలను కొలువుదీరి ఉన్న శ్రీస్వామివారు మహాదర్పంగా ఆలకించి ఆనందిస్తూ భక్తులను అనుగ్రహిస్తూ ఉంటారు. ఇది ప్రతినిత్యం జరిగే శ్రీవారి ఆస్థానం.

ప్రతినిత్యం జరిగే ఆస్థానం కంటే కూడా దక్షిణాయన పుణ్యకాలమైన జులై 16న జరిగే ఆణివర ఆస్థానం చాలా విశిష్టమైనది. తిరుమల ఆలయ చరిత్రలోనే అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

స్వామివారికి ప్రతిరోజూ మాదిరే దక్షిణాయన సంక్రమణం రోజున ఉదయం సుప్రభాతం, విశ్వరూప దర్శనం, తోమాల సేవ యథాప్రకారం జరుగుతాయి. అయితే రోజూ జరిగే కొలువు శ్రీనివాసమూర్తికి బంగారు సింహాసనముపై కొలువు జరుపబడదు. తోమాలసేవ అయిన వెంటనే శ్రీదేవీ భూదేవేరులతో కూడి ఉన్న శ్రీ మలయప్పకు (ఉత్సవమూర్తులు) శ్రీవిష్వక్సేనుల (సేనాధిపతి) వారికీ ఆలయంలోనే ఏకాంతంగా తిరుమంజనం (అభిషేకం) జరుపబడుతుంది. అనంతరం మొదటి సహస్ర నామార్చన, నైవేద్యం (మొదటి గంట) జరుపబడుతాయి.

పిదప బంగారు వాకిలి ముందుగల తిరుమహామణి (ఘంటా మండపం) మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని బంగారు వాకిలి ముందుగా గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేస్తారు. సర్వాభరణాదులతోను, సుగంధ పరిమళ భరితమైన పుష్పమాలికలతోను ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరిస్తారు.

శ్రీస్వామివారికి ప్రక్కగా చెరొక పీఠంపై దక్షిణాభిముఖంగా శ్రీ విష్వక్సేనుల వారిని కూడా వేంచేపు చేసి ఆభరణాదులతో, పుష్పమాలలతో అలంకరిస్తారు. శిరస్త్రాణాన్ని, ఖడ్గాన్ని ధరించి అత్యంత భయ భక్తులతో శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆజ్ఞలను అమలు పరచడానికి సిద్ధమై, సర్వసన్నద్ధమై ఉంటాడు సేనాధిపతి. అనంతరం ఆనందనిలయంలోని మూలవిరాట్టునకు బంగారు వాకిలి దగ్గర ఆస్థానంలో వేంచేపు చేసి ఉన్న శ్రీవారి ఉత్సవమూర్తులకు, సేనాధిపతికి విశేషమైన ప్రసాదాలు నివేదిస్తారు.

శ్రీమాన్ పెద్ద జియ్యంగార్లు, చిన్న జియ్యంగార్లు, ఏకాంగులు (వైష్ణవ సన్యాసులు), అర్చకులు, ఆచార్య పురుషులు, వేదపండితులు, దేవస్థానం కార్యనిర్వాహకులు, ఇతర అధికారులు, దేవాలయ సహాయ కార్యనిర్వహణాధికార్లు, పారుపత్యదార్లు ఛత్ర చామరాలతో, మంగళ వాయిద్య పురస్సరంగా, వేదపండితులు వేదపారాయణ చేస్తూ వెంటరాగా గమేకార్లు (వంటశాల నుండి ప్రసాదాన్ని నివేదనకు వండి తెచ్చి సమర్పించే వాళ్ళు) సిద్ధమై ఉన్న విశేషమైన వంటకాలను (పొంగలి, చక్కెరపొంగలి, పులిహోర, దధ్యోదనం, మళహోర,

లడ్డు, వడ, అప్పం, దోసె మున్నగువాటిని నివేదనకు తెస్తారు. విమాన ప్రదక్షిణంలో బంగారు బావి ప్రక్కన ఉన్న వంటశాల నుండి బయలుదేరి ఈ ప్రసాదాలను ఆనంద నిలయానికి ప్రదక్షిణం చేస్తూ వెండి వాకిలి ఎదురుగా బయట ఉన్న ధ్వజస్తంభానికి ప్రదక్షిణంగా వెళ్ళి లోనికి వచ్చి ఆలయ ప్రవేశం చేసి అటు మూలసన్నిధిలోను, ఇటు బంగారు వాకిలి దగ్గర ఆస్థానంలోను నివేదనకు ఉంచుతారు. రెండు చోట్ల గంటలు మ్రోగుతుండగా ఈ విశేష నైవేద్యం జరుగుతుంది.

ఈ నైవేద్యం అయిన తరువాత యోగ నరసింహ స్వామి ఆలయం ప్రక్కన ఉన్న పరిమళపు అర దగ్గర నుండి శ్రీమాన్ పెద్ద జియ్యంగార్లు పెద్ద వెండి తట్టలో మడతపెట్టి చుట్టగా చుట్టబడిన ఆరు పెద్ద వస్త్రాలను తలమీద పెట్టుకొని, ఛత్ర చామర మంగళ వాయిద్య పురస్సరంగా, ముందు పంచముఖ దివిటీలు వెలుగుతుండగా, సన్నడోలు, పలక, గంటలు మోగుతుండగా వేద పారాయణలు సాగుతుండగా, శ్రీమాన్ చిన జీయంగారు, ఏకాంగులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి, సహాయ కార్యనిర్వహణాధికారి మున్నగు ఆలయ అధికారులు వెంటరాగా, ఆలయం వెండి వాకిలి ముందున్న ధ్వజస్తంభానికి ప్రదక్షిణం వచ్చి, పిదప ఆనందనిలయ విమానానికి ప్రదక్షిణం చేస్తూ వచ్చి నేరుగా ఆనందనిలయంలోని శ్రీస్వామి వారి మూలమూర్తుల దగ్గర సమర్పిస్తారు. పెద్ద, చిన్న జీయంగార్లు, ఏకాంగులు మాత్రమే ఆనందనిలయ ప్రవేశం చేస్తారు. లోపల శ్రీ జియ్యంగారు సమర్పించిన ఆరు పట్టు వస్త్రాల్లో నాలుగింటిని అర్చకస్వాములు శ్రీవారి మూలమూర్తికి అలంకరిస్తారు. ఒకటి కిరీటానికి, రెండవ దానిని నందక ఖడ్గానికి, మూడవదాన్ని పంచెగా, నాలుగవదాన్ని అంగవస్త్రంగా అలంకరిస్తారు. స్వామివారి ముందున్న తెరను తొలగించిన తర్వాత అర్చకస్వామి స్వామివారి మూలమూర్తి శిరస్సుకు పరివట్టం (పట్టుబట్టను) కట్టి పూజ హారతులు చేస్తారు. హారతి అయిన తర్వాత ప్రధాన అర్చకులు తాము ముందుగా తీర్థము స్వీకరించి శఠారి మర్యాద స్వీకరిస్తారు. అందరికీ తీర్థం, చందనం, శఠారి, తాంబూల మర్యాదలు అయిన తర్వాత శ్రీ జియ్యంగారు మిగిలిన రెండు పట్టు వస్త్రాలను తలపై పెట్టుకుని బంగారు వాకిలి దగ్గర ఆస్థానంలో వేంచేసి ఉన్న ఉత్సవమూర్తులకు సమర్పిస్తారు. అర్చకులు ఒకదానిని శ్రీ మలయప్ప స్వామివారికి, రెండవదానిని విష్వక్సేనుల వారికి అలంకరిస్తారు. తర్వాత కుంకుమాక్షతలు చల్లుతారు.

అనంతరం అర్చకులు పెద్ద జియ్యంగారికి పరివట్టం కట్టి స్వామివారి పాదాల వద్ద ఉంచబడిన స్వంత మొహరును (సీలు) జియ్యంగారి చేతికిచ్చి దేవస్థానం వారి తాళంచెవుల గుత్తిని స్వామివారి చెంత అనగా పాదాల చెంత ఉంచుతారు. ఇదేవిధంగా ఏకాంగికి, జియ్యంగార్లకు తాళంచెవుల గుత్తిని



చేతికి తగిలించి చందన తాంబూలాది సత్కారాలను చేస్తారు. తరువాత అక్కడికి విచ్చేసిన భక్తులందరి తరపున ఒక్కొక్క రూపాయి వసూలు చేసి అందరివి కలిపి ''రూపాయి హారతి''ని ఇచ్చి అందరి సమక్షంలో ఖజానాకు జమ చేస్తారు.


అనంతరం స్వామివారికి నివేదింపబడిన ప్రసాదాలను వారి వారి హోదాను బట్టి వరుసగా ప్రసాద వితరణ పంచబడుతుంది. తర్వాత భక్తులకు కూడా పంచుతారు. స్వామివారు దేవేరులతో కూడి ఆ మండపంలోనే మధ్యాహ్నం నైవేద్యం అయ్యేంతవరకు ఉంటారు. ఆ తరువాత పురవీధుల గుండా పూలపల్లకీలో అత్యంత వైభవంగా ఊరేగింపబడతారు. ఇందుకోసం వివిధ వర్ణశోభితమైన పుష్పాలతో పల్లకిని తయారు చేస్తారు. ఇందులో స్వామిని కూర్చోబెట్టి అన్ని లాంఛనాలతో (ఏనుగులు, గుర్రాలు, రథం, ఛత్రం, చామరం) అధికార బృందం స్వామిని సేవిస్తుంటే నాలుగు మాడ వీధులలో ఊరేగిస్తారు. ఈ ఉత్సవాన్ని చూసి తరించేందుకు ఎంతోమంది భక్తులు హాజరవుతారు. దక్షిణాయన పుణ్యకాలంలో స్వామిని సేవించినవారికి కీర్తి, విజయం, ఇష్టకామ్యార్థ సిద్ధి, విష్ణులోక ప్రాప్తి కలుగుతాయి.

ఈ పుష్ప పల్లకీ వైభవం చూడవలసిందే కానీ వర్ణింప సాధ్యం కాదు. ఉత్సవానంతరం శ్రీస్వామివారు దేవేరులతో ఆలయ ప్రవేశం చేస్తారు. పూజ ముగిసిన అనంతరం అర్చకులు స్వస్తి వాచకాన్ని చదువుతారు. ఆపై స్వామికి వచ్చిన కానుకలను హుండీలో వేస్తారు. ఈ ఆణివర ఉత్సవం చూచువారలకు చూడముచ్చటట, పుణ్యపురుషులకు ముక్తిప్రదమట. మునులును సురలును చూడవత్తురు. మనమును చూసి తరిద్దాము. ధన్యులమవుదాము.



16వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు



**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**– గోవింద దాసు**
**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**

దిశ : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 16 వ భాగపు లీలల ప్రచురణ. (ఏప్రిల్ 2005)

## నమో వేంకటేశాయ రథమును స్వీకరించుటకు వివిధ రూపాలను చూపుట

ఈ లీల నా జీవితంలో అత్యంత ప్రధానమైనది. గతంలో పొందిన అన్ని అనుభూతులు కలిపినా ఈ అనుభూతితో సమానము కావు. ఈ లీలలో స్వామివారు మొత్తం మూడు రకాలుగా అనుగ్రహించారు. 1.నమో వేంకటేశాయ రథమును స్వీకరించానని తెలుపుటకు తన వివిధ రూపాలను చూపాడు. ఎంతగా పరవశించిపోయానంటే అర్జునుని తరువాత అంతటి అదృష్టవంతుణ్ణి నేనే అని కలలోనే అనుకున్నాను. 2.ఇది నా వ్యవహారానికి సంబంధించినదైనప్పటికీ పూర్వం ద్రౌపదిని ఏవిధంగా రక్షించాడో నన్ను ఆ విధంగా రక్షించాడు. ద్రౌపదిని రక్షించినట్లు రక్షించారని కలలోనే అనుకున్నాను. 3.ఈ మూడవది అత్యంత ప్రధానమైంది. స్వామి చూపే కలలు నిజమని నమ్మకం కలిగే విధంగా చేశాడు. స్వప్నంలో నన్ను స్పృశించాడు. ఆ స్పృశించిన భాగం మిగిలిన శరీర భాగాల కంటే భిన్నంగా ఉండునని చెప్పాడు. అది అలాగే జరిగింది.


అప్పుడు మేము విద్యానగర్ లోని దుర్గాబాయ్ దేశ్ ముఖ్ కాలనీలో వేంకటగిరి రెసిడెన్సీ అనే ఒక అపార్టుమెంటులో నివసిస్తున్నాము. మా డ్రైవర్ పేరు కలీమ్. ప్రతిరోజు ఉదయం 9.30 ప్రాంతమున ఇంటినుండి ఆఫీసుకి కారులో బయలుదేరేవాణ్ణి. నా జీవితంలో అత్యంత ప్రధానమైన ఈ లీల ఈ క్రింది విధంగా జరిగింది.

**25-04-2005 కల :** ఈరోజు ఉదయం 9.30 గంటలకు మా డ్రైవర్ మాకున్న 1726 నెంబర్ గల సాంట్రో జింగ్ అనే మా కారును నడుపుచుండగా మా అపార్టుమెంట్ గేటు నుండి బయటకు వచ్చాము. ఈ దృశ్యమును బయటి వ్యక్తి ఏవిధంగా చూస్తాడో, ఆ విధంగా మా కారును, దాని నెంబరును చూశాను.

నేను ఆ కారులో వెనక సీటులో కూర్చున్నాను. కారు అద్దాలను మూసివేసి, ఏ.సి పెట్టుకుని వెళ్ళుచున్నాము. ఆ కారు ఒక 30 నుండి 35 కి.మీ వేగంతో మా అపార్టుమెంట్ ముందున్న నల్లని తారు రోడ్డుపై పోవుచున్నది. ఇంతలో ఒక మాయాశక్తి మమ్ములను ఆవహించింది. సుడిగుండంలాగా గిర్రున తిరుగుచున్న గాలి మా కారును చుట్టుముట్టింది. ఆ మాయాశక్తి ప్రభావం వలన మా కారు అటు ఇటు కుదిపినట్లైంది. కారు వెనుక సీట్లో కూర్చున్న నేను ఈ కుదుపును గమనించి కారుకు ఏదో అయిందనే ఆత్రుతతో ప్రక్క విండో గుండా బయటకు చూచాను. ఇలా నా చూపు బయటి ప్రపంచముపై పడుచున్నంతలోపే, ఆ మాయాశక్తి మా కారును పైకి ఎగరేసుకుని ఆకాశమార్గాన తిరుమల కొండపైకి తీసుకెళ్ళింది. ఈవిధంగా మాకు తెలియకుండానే మా కారు, అందులో ఉన్న మేము తిరుమల కొండపైకి తేబడ్డాము. ఇదంతా ఒక్క క్షణంలో జరిగింది. ఈ పరిణామానికి ఆశ్చర్యపోయాను. నేను కారు అద్దాల గుండా బయటికి చూస్తున్నప్పుడు, మా కారు తిరుమల కొండపై ఒక నల్లటి తారు రోడ్డుపైన పరిగెత్తుచున్నది. నేను ఆ రోడ్డుకు ఇరువైపులగల పచ్చని చెట్లను, పచ్చిక బయళ్ళను, పూలతోటలను చూచాను. ఇలా కొండపై కొంతదూరము వెళ్ళిన కారును ఆ రోడ్డులో ఒక ప్రక్కన ఆపాము. ఆ తరువాత కారునుండి బయటకు దిగాను. డ్రైవర్ కలీమ్ మాత్రము కారులోనే ఉన్నాడు. ఈ కారును ఒక ప్రక్కగా పెట్టమని మా డ్రైవర్తో చెప్పాను. కారు నుండి బయటకు దిగిన నేను పరిసర ప్రాంతాలను చూడసాగాను. ఆ పరిసర ప్రాంతాలు ఎంతో మనోహరంగా ఉన్నాయి. పండువెన్నెల కాయుచున్నట్లు వాతావరణమున్నది. అప్పుడే వర్షము వచ్చి వెలసినట్లు పరిసర ప్రాంతాలు కనబడుచున్నవి. చెట్ల ఆకుల పైనుండి నీటిబిందువులు ఒక్కొక్కటి క్రింద పడుచున్నవి. ఆ ప్రాంతం ఎంత మనోహరంగా కనపడుతోందంటే రెండు మూడు పూర్ణచంద్రుల వెలుగు ఒకేసారి పడుచున్నట్లుంది. ఎక్కడ చూచినా పచ్చని చెట్లు, అందమైన పూలు, పచ్చికబయళ్ళు ఇలా కొండ మొత్తం పచ్చదనంతో నిండి ఉంది. ఆ కొండపై రకరకాల ఎత్తులతో పచ్చని చెట్లు, దట్టమైన అడవులు కనబడ్డవి. మేము కొండపై ఒక ఎత్తైన ప్రదేశంలో మా కారును ఆపాము. కాబట్టి నేను ఆ కొండపై ఉన్న చాలా పరిసర ప్రాంతాలను చూడగలిగాను. కొండ ఉపరితలము చిన్న చిన్న గుట్టల సమూహము లాగా ఎగుడు దిగుడుగా ఉన్నది. తిరుమల ఆలయం నుండి వేద మంత్రాల ఘోష మైకు ద్వారా ఇంపైన స్వరముచే వినబడుతోంది.

నిజానికి మేము శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థం కొండపైకి వచ్చామట. కాని మేము ఎలాంటి ముందస్తు ఏర్పాట్లు చేసుకోలేదు. శ్రీవేంకటేశ్వరుణ్ణి చూడాలనే ఆత్రుతతో, కనీసం మా ఇంట్లో కూడా చెప్పకుండా తిరుమల కొండకు వచ్చామట. అప్పుడు తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్నదట. అందుకని మాకు ఆ స్వామి దర్శనము చేసుకొనుట కష్టంగా మారింది. ఆ రోజుల్లో నేను తిరుమలకు స్వామివారి దర్శనార్థమై వెళ్ళునప్పుడు, ఎస్.వి.డైరీఫాం డైరెక్టర్ శ్రీమాన్ కొండారెడ్డి గారి వద్దనుండి రికమెండేషన్ లెటర్ తీసుకుని వెళ్ళేవాడిని. నాకు ఆయన తప్ప ఇతరులు తెలియదు. కాని ఈరోజు శ్రీమాన్ కొండారెడ్డి గారు దేవస్థానపు పనిమీద బయటి ఊరికి వెళ్ళారట. ఈ విషయం నాకు కలలోనే బోధపడింది. కాబట్టి మాకు శ్రీవేంకటేశ్వరుని దర్శనము చేసుకొనే అవకాశం లేకుండా పోయింది. ముందస్తు రిజర్వేషన్ లేదు, తెలిసినవారు లేరు, భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది కాబట్టి మాకు స్వామివారి దర్శనము చేసుకొను అవకాశము ఎంతమాత్రము లేదు. చాలా బాధపడ్డాము. హైదరాబాద్ నుండి తిరుమలకు కారులో ఇంతదూరం వచ్చాము, కాని స్వామి దర్శనం చేసుకోకుండానే తిరిగి ఇంటికి వెళ్ళిపోవలసి వస్తుందని బాధపడ్డాను. శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరిస్తున్నాను. ఎలాగైనా మీ దర్శన భాగ్యం ప్రసాదించమని వేడుకుంటున్నాను. చేసేదిలేక ఆ కొండపై అటు ఇటు చూస్తున్నాను. ఆ పరిసర ప్రాంతాలు ఎంతో తృప్తినిస్తున్నాయి కాబట్టి ఆ కొండ అందాలను చూచి ఆనందిస్తున్నాను.

శ్రీవేంకటాచల మాహాత్మ్యములో వర్ణించినట్లు, లేక వెనుకటి తిరుమల కొండలాగా చెట్లు, చేమలు, సెలయేళ్ళతో ఆ ప్రాంతం అలరారుతోంది. నేను ప్రయాణించే రోడ్డు మాత్రమే ఈ మధ్యనే వేసినట్లు తారు రోడ్డుతో కొత్తగా ఉంది. ఇది తప్ప ఎలాంటి కొత్త భవనాలు కనపడలేదు. మొత్తం వెనుకటి తిరుమల లాగా ఎలాంటి కాంక్రీట్ బిల్డింగులు లేకుండా పచ్చని పరిసరాలతో, రకరకాల పూలచెట్లతో, సెలయేళ్ళతో అందంగా అలరారుతోంది. ఈ కొండ సౌందర్యమును నేను సరిగా వర్ణించలేకపోతున్నాను. సరైన పదం దొరకడంలేదు. ఒక కవిని కానందుకు విచారించాను. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ సౌందర్యాన్ని చూసిన ప్రతి వ్యక్తీ జీవితాంతం అక్కడే ఉండాలనుకుంటాడు. ఆ ప్రాంతం అంతటి సంతోషాన్నిచ్చింది. చల్లని వెన్నెలలో పిల్లగాలులు నా శరీరాన్ని తాకుతుండగా శ్రీవేంకటేశ్వరుని ఆలయం నుండి వేదమంత్రాల ఘోష చెవులకు ఇంపుగా వినబడుతున్నది. ఇలా కొంతసేపు ఆనందిస్తూ నలువైపులా చూశాను. ఇంతలో శ్రీవేంకటేశ్వరుని దర్శనం ఎలాగైనా చేసుకోవాలనిపించింది. కాని ఏమీ చేయలేని నిర్భాగ్యుణ్ణి. నాకు ఆ స్వామిని చూసే భాగ్యం లేదని భావించాను. చివరికి కొండపైన ఏదో ఒక గుడికి వెళ్ళి, ఏదో ఒక దేవుణ్ణి దర్శించుకొని ఇంటికి వెళదామని నిర్ణయించుకున్నాను. నేను ఆ కొండపైన ఒక ఎత్తైన ప్రదేశంలో నిలబడ్డాను. కాబట్టి ఆ ప్రదేశాన్నంతటినీ కనుచూపు మేర కలియచూచాను. నేనున్న ప్రదేశానికి క్రిందిభాగంలో కొంచెం దూరంలో మరో చిన్న గుట్ట వద్ద ఒక దేవాలయం కనబడింది. ఈ ఆలయాన్ని చూచి సంతోషించాను. మా డ్రైవర్ ను అక్కడే ఉండమని చెప్పి,




నేనొక్కడినే ఈ దేవాలయమునకు నడుచుకుంటూ వెళ్ళాను. అది శ్రీ దత్తాత్రేయుని ఆలయం. ఆ సమయంలో ఆ ఆలయంలో నేను తప్ప మరే భక్తుడూ లేరు. పూజారి మాత్రం ఉన్నాడు. ఈ ఆలయం కొండపై ఇటీవలే నిర్మించినట్లుంది. ఈ ఆలయ ద్వారం నుండి లోనికి వెళ్ళగానే ఒక పెద్ద హాలు ఉన్నది. ఈ హాలు 30 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవు కల్గి ఉన్నది. ఈ హాలు ఒక చివర మధ్యభాగంలో ఒక గద్దె లాంటి ఎత్తైన ప్రదేశం ఉన్నది. ఈ గద్దె దాదాపు 15 అడుగుల పొడవు 10 అడుగుల వెడల్పు కలిగి రెండడుగుల ఎత్తుతో ఉన్నది. ఈ గద్దె మధ్యలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వర రూపములు తలలుగ కలిగిన శ్రీ దత్తాత్రేయుని దాదాపు 3 అడుగుల విగ్రహము ఉన్నది. ఈ విగ్రహము ప్రక్కన ఆలయ పూజారి నిలబడి ఉన్నాడు. ఈ గద్దె ప్రక్కన ఈ ఆలయానికి మరో చిన్న ద్వారము ఉన్నది. పూజారులు ఈ ద్వారము నుండే రాకపోకలు జరుపుతారు.


ఇంతలో ఈ ఆలయ పూజారి ఈ చిన్న ద్వారము నుండి బయటకి వెళ్ళిపోయాడు. నేనొక్కడినే ఆలయంలో ఉన్నాను. అందుకని శ్రీ దత్తాత్రేయుని మనసారా ప్రార్థించుకుందామనుకున్నాను. ఈ దత్తాత్రేయుడు ఉన్న గద్దె ముందు ఒక పది పన్నెండు అడుగుల దూరములో స్వామివారిని చూసుకుంటూ వజ్రాసనములో కూర్చున్నాను. తరువాత నా రెండు చేతులతో దండంపెట్టి ఆయననే చూస్తూ ఇలా ప్రార్థించాను. "స్వామీ! మీరైనా నాకు దర్శనమిచ్చారు, చాలా సంతోషము. నేను నా స్వామిని దర్శనం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ కొండకు వచ్చాను. కాని ఆయన దర్శన భాగ్యం లభించలేదు" అని ప్రార్థించాను. ఇంతలో ఒక చిత్రం జరిగింది. దాన్ని చూచి ఆశ్చర్యపోయాను. నిజానికి నేను ప్రార్థిస్తున్న శ్రీ దత్తాత్రేయుని విగ్రహం దాదాపు 3 అడుగుల ఎత్తుతో, 3 తలలతో ఉన్నది. కాని నేను చూస్తున్నప్పుడు ఆ విగ్రహం ఎత్తు దాదాపు ఆరున్నర అడుగుల ఎత్తు వరకు పెరిగింది. మూడు తలలు కలిగిన ఈ విగ్రహం ఒక తలగా మారింది. ఇప్పుడు మొత్తం ఈ విగ్రహం ఆరున్నర అడుగుల ఎత్తులో గంభీరంగా కనపడుతోంది. ఈ పరిణామాన్ని చూచిన నేను ఆశ్చర్యపోయాను. ఇలా ఆశ్చర్యం నుండి తేరుకోకముందే ఇదే విగ్రహం శ్రీరామునిగా రూపాంతరం చెందింది. ఎప్పుడైతే ఈ విగ్రహం శ్రీరామునిగా రూపాంతరం చెందిందో అప్పుడు అది విగ్రహం లాగా కాకుండా చలనమున్న మనిషిలాగా మారిపోయింది. నాకు శ్రీరాముడు దర్శనమిచ్చాడు. నా ప్రభు శ్రీవేంకటేశ్వరుని త్రేతాయుగంలోని రూపము శ్రీరామచంద్రుడు దర్శనమిచ్చాడు. ఒక చేతిలో విల్లు మరొక చేతిలో బాణము పట్టుకుని దర్శనమిచ్చాడు. "నమో వేంకటేశాయ" రథములో త్రేతాయుగంలో శ్రీవేంకటేశ్వరుడు, శ్రీరామునిగా ఎలా ఉన్నాడని చూపించానో అదేవిధంగా నాకు దర్శనమిచ్చాడు. ఆయన గోధుమరంగు పట్టు వస్త్రమును ధోవతిగా ధరించాడు (దీనిని పీతాంబరమంటారు). ఆ ధోవతిని చాలా అందంగా కట్టుకున్నాడు. ఆ ధోవతి అంచులు అందముగా కనబడుతున్నవి. శ్రీరాముడు ఒక అంగవస్త్రమును కూడా తన మెడపై వేసుకున్నాడు. ఇది కూడా గోధుమ రంగు కల పట్టు వస్త్రము. ధోవతి, అంగవస్త్రము చూచుటకు ఒకేలాగా అందంగా కనపడ్డాయి. నిజజీవితంలో ఇంతటి అందమైన బట్టలను నేనెప్పుడూ చూడలేదు. శ్రీరాముడు ధగధగా మెరిసే బంగారు కిరీటమును ధరించాడు. ఆ కిరీటములోని మణులు ప్రకాశవంతంగా మెరుస్తున్నాయి. శ్రీరాముడు విగ్రహం లాగా కాకుండా చలనమున్న మనిషిలాగా కనబడ్డాడు.

పూజారి వెళ్ళిన ద్వారం నుండి గాలి లోనికి వీస్తోంది. ఆ గాలికి శ్రీరాముని ధోవతి అంచులు అటు ఇటు కదులుతున్నాయి. శ్రీరామునికి తగిలిన గాలి నావైపు వస్తోంది. ఈ వింత ఆశ్చర్యకర సంఘటనను చూసి బిత్తరపోయాను. అసలు ఏం జరుగుతోందో నాకు తెలియలేదు. శ్రీరాముడు మాత్రం నన్నే చూస్తున్నాడు. ఆయన నుదుటిపై తిరునామం సన్నగా ఉండి స్పష్టంగా కనబడుతోంది. ఆయన నీలమేఘ వర్ణంలో కాకుండా బంగారు ఛాయలో ధగధగా మెరిసిపోతున్నాడు. నన్ను తదేక దృష్టితో చూస్తున్నాడు. నన్ను చూచి పకపకా నవ్వుతున్నాడు. నేను మాత్రం ఈ వింతను చూచి ఆశ్చర్యపోయాను. నమో వేంకటేశాయ రథమును స్వీకరించుటకు శ్రీవేంకటేశ్వరుడు తన రూపమును ఇలా చూపిస్తాడని గ్రహించలేదు. ఈ మధ్య నా మనస్సు ఆస్తి గొడవలపై కేంద్రీకృతమై ఉన్నది. కావున ప్రభూ! నేను బాధలో

ఉన్నాను. నన్ను దుండగులు హింసిస్తున్నారు, నా ఆస్తిని లాక్కుంటున్నారు, నేను మీ శరణు వేడాను కాని మీరు నన్ను చూసి నవ్వుతున్నారా? అనే భావం కలలోనే నా మనస్సుకు వచ్చింది. దీనిని గమనించనట్లే శ్రీరాముడు నన్ను చూసి అలాగే పకపక నవ్వుతున్నాడు. ఆ మధురమైన నవ్వు స్పష్టంగా వినబడింది. మందారపువ్వు లాంటి ముఖం, బంగారు వన్నె కలిగిన ఛాయతో పకపక నవ్వుతున్నాడు. శ్రీరాముని యొక్క చర్మం బంగారు కాంతులతో ధగ ధగా మెరుస్తోంది. ఆయన చర్మ సౌందర్యమును వర్ణించలేకపోతున్నాను. పూర్తి మానవచర్మం కాదు పూర్తిగా ముద్ద బంగారం కాదు. ఒక తెల్లని రంగు గల వ్యక్తి చర్మమును మరియు బంగారమును సమపాళ్ళతో తయారు చేసిన మిశ్రమముతో ప్రత్యేకంగా తయారు చేసిన చర్మం లాగా ఉన్నది. ఆ చర్మం పైన ఉన్న రోమాలు కూడా అదే రంగులో ఉన్నాయి. ఆరున్నర అడుగుల ఎత్తు కలిగిన రూపం మహా అద్భుతంగా ఉన్నది. చూసిన ప్రతివారూ సమ్మోహితులు కావలసిందే. ఆయన శరీరం లోని ప్రతి అణువు నుండి బంగారు కాంతులు బయటికి వెదజల్లుతున్నాయి. ఆ కాంతులతో దేవాలయ హాలు మొత్తం ధగధగమనే బంగారు కాంతితో నిండిపోయింది. నేను మాత్రం శ్రీరాముని ముందు వజ్రాసనంలో కూర్చుని నమస్కరిస్తూ ప్రభూ! ప్రభూ! అని ఆయనను వేడుకుంటున్నాను. ఈ రూపం మళ్ళీ కనిపించదు, కనుక ఆయనను తనివితీరా, రెప్పార్పకుండా అతి తీక్షణంగా చూస్తున్నాను. ఈ రూపం త్వరలో మాయమయిపోతుందేమో అని తలచి ప్రభూ! ప్రభూ! అని ఆత్రుతతో ప్రార్థిస్తున్నాను. కాని శ్రీరాముడు మాత్రం అలాగే నిలబడి నాకు ఆయనను తనివితీరా చూసే అవకాశమును ప్రసాదించాడు. శ్రీరాముడు తన ఎడమచేతితో ధనుస్సును నిలువుగా పట్టుకున్నాడు. ఈ ధనుస్సు శ్రీరాముని కంటె కొంచెం ఎత్తు ఉంది. ఆ ధనుస్సు ఒక చివర నేలపై ఆన్చి, రెండవ చివర ఎడమచేతితో పట్టుకున్నాడు. తన కుడిచేత్తో బాణమును పట్టుకున్నాడు. ఆ బాణము కొంచెం ఏటవాలుగా, దాని మొన నావైపు చూస్తున్నట్లుగా ఉంది (పటం). ఈ ధనుస్సు, బాణం రెండూ బంగారు వన్నెతో ఉన్నాయి. వీపుకు బంగారు వన్నె కలిగిన అమ్ములపొదిని ధరించాడు. ఆయన బంగారు జంధ్యమును ధరించాడు. శ్రీరాముడు నన్ను చూస్తూ పకపకా నవ్వుతున్నాడు. నేను శ్రీరాముని పాదాల నుండి తలవరకు అణువణువును పరీక్షించి చూశాను. స్వామి శరీరంపై గల రోమములను సహితం చూశాను.

ఇలా శ్రీరాముణ్ణి తనివితీరా చాలాసేపు చూసిన తరువాత మరో వింతైన చిత్రం జరిగింది. ఉన్నట్లుండి శ్రీరాముడు శ్రీకృష్ణునిగా మారిపోయాడు. చేతిలోని ధనుస్సు, బాణము మాయమైపోయాయి. ఇప్పుడు రెండు చేతులతో పిల్లనగ్రోవి పట్టుకున్నాడు. శ్రీవేంకటేశ్వరుడు 'నమో వేంకటేశాయ' రథముపై ద్వాపరయుగములో శ్రీకృష్ణునిగా చూపినట్లుగానే ఉన్నాడు. ఇంతకుముందు శ్రీరాముని ముఖంలాగానే ఈయన ముఖం ఉన్నది. ఈ రెండు రూపాలలోని ముఖములలో ఎలాంటి భేదం లేదు. ఈయన కూడా బంగారు ఛాయతో మెరిసిపోతున్నాడు. ఈయన నుండి కూడా వెలువడిన బంగారు కిరణాలు హాలు మొత్తాన్ని బంగారు మయం చేశాయి. తన రెండు చేతులతో పిల్లనగ్రోవిని ఊదుటకు సిద్ధం అన్నట్లు పట్టుకున్నాడు. ఈ పిల్లనగ్రోవి కూడా బంగారు వన్నెతో మెరిసిపోతోంది. ముఖముపై తిరునామం సన్నగా శ్రీకృష్ణునికి ఉండే తిరునామం లాగానే ఉంది. శ్రీరాముడు శ్రీకృష్ణునిగా రూపాంతరం చెందినప్పుడు తన కుడికాలును ఎడమకాలుపై పెట్టుకొని 'నమో వేంకటేశాయ' రథంపై శ్రీకృష్ణుని చూపినట్లు నిలబడ్డాడు. మరియు కిరీటముపై నెమలి పింఛమును ధరించాడు. దాదాపు ఆరున్నర అడుగుల ఎత్తుతో, ఎత్తుకు తగిన శరీర సౌష్ఠవము కలిగి, బంగారు వన్నెతో అత్యంత సుందరంగా కనపడ్డాడు. శ్రీరాముడు శ్రీకృష్ణునిగా రూపాంతరం చెందినప్పుడు, ముఖం, శరీరం, కాళ్ళు చేతులు, కిరీటం, వస్త్రాలు మారలేదు. కాని కాళ్ళ అమరిక మారింది. చేతులలో బాణం బదులు పిల్లనగ్రోవిని ఊదుతున్నట్లు పట్టుకున్నాడు. కిరీటంపై నెమలి పింఛం ప్రత్యక్షమైంది. ఒకరకంగా ఒకటే శక్తి రూపాంతరం చెందినట్లు చూపెట్టాడు. అత్యంత సౌందర్యవంతమైన రూపం. ఆ రూపం చూసిన ఎంతటి వారైనా మోహితులవుతారు, మైమరచిపోతారు. జీవితంలో మరొకటి కోరరు. అంతటి సౌందర్యవంతమైన రూపమది. బహుశా ఏ వ్యక్తీ ఈ రూపమును వర్ణించజాలడు. అంతటి సౌందర్యవంతుడు, ఈయన కూడా నన్ను చూసి పకపకా నవ్వాడు. ఇప్పుడు కూడా ఆ నవ్వును స్పష్టంగా విన్నాను. నేను మళ్ళీ నమస్కరించాను. ఆశ్చర్యపోయాను. అసలు ఏం జరుగుతోందో నాకు అంతుపట్టలేదు. శ్రీకృష్ణుని ముందు వజ్రాసనంలో కూర్చుని రెండు చేతులతో నమస్కరిస్తూ ప్రభూ! ప్రభూ! అని అరుస్తున్నాను. ఆయనను రెప్పార్పకుండా తదేక దృష్టితో చూస్తున్నాను. నా ఆనందానికి హద్దులు లేవు. నా శరీరం రోమాంచితమై ఆనందంతో నిండిపోయింది. నోటినుండి మాట రావడం లేదు. నేను పూర్తిగా తృప్తి చెందాను. నాకు ఇక చాలు అనే భావం మనస్సులో అనిపించింది. నాకిక ఏమీ వద్దు. నేనేమీ కోరను, పూర్తి సంతృప్తి చెందాను ప్రభూ! అని నా మనస్సులో అనుకున్నాను.


నేనేమిటి, నా ప్రభు ఇన్ని రూపాలను చూపడం ఏమిటని అనుకున్నాను. ఈ స్వల్ప భక్తుణ్ణి సంతోషపెట్టడానికి, ఇంత కష్టపడాలా ప్రభూ! ఇన్ని రూపాలు చూపాలా శ్రీవేంకటేశ్వరా! ఇక చాలు నేను పూర్తిగా సంతోషించాను అనే భావం నా మనస్సులోకి వచ్చింది. భక్తవత్సలుడైన శ్రీవేంకటేశ్వరుడు నేను తృప్తి చెందే విధంగా మరిన్ని తన రూపాలను చూపబోతున్నాడనే భావన కలిగింది. ఆ భగవంతుణ్ణి మరిన్ని రూపాలు చూపడాన్ని




వద్దు వద్దు అని వారించాను. ఈ రూపాలు చూపడంలో ఆయన కష్టపడిపోతున్నాడని భ్రమపడి, నా వలన మీరు కష్టపడకూడదు, ఆ కష్టాలన్నీ నేనే భరించాలి, మీరు సుఖంగా ఉండాలి అనే ఆలోచన నా మనస్సులో కలిగింది. కాని ఆ భక్తవత్సలుడైన శ్రీవేంకటేశ్వరుడు మాత్రం నాకు తన ఇతర రూపాలను ఇంకా కొన్నింటిని చూపాలనే సంకల్పంతో ఉన్నట్లు అనిపించింది. ''ఇన్ని రోజులు నాకై ప్రార్థించావు, నా దర్శనాన్ని కోరుకున్నావు, నీవు కోరినప్పుడు నేను దర్శనాన్ని అనుగ్రహించలేదు, అందుకని ఎన్నోసార్లు నాపై అలిగావు, ఏడ్చావు, చివరికి నాపై విశ్వాసమును సడలిస్తున్నావు. నా భక్తుడు ఈ విధంగా ఉంటే నేను సహించలేను. కాబట్టి నీ కోరికను నెరవేరుస్తున్నాను, నీకిష్టమొచ్చినన్ని రూపాలను దర్శించుకో. నీకు చూపే ప్రతిరూపము నీలాంటి ఎందరో భక్తులను తరింపచేసింది. నా భక్తుడు నాకై తపించిపోవడాన్ని నేను సహించలేను. అందుకే చూసుకో, నీవు తృప్తి చెందేవరకు చూసుకో. ఒక రూపము చూసి సంతోషించిన తరువాత మరో రూపమును చూపెదను. దాన్ని చూసి సంతోషించిన తరువాత మరో రూపమును చూపెదను. నా వద్ద రూపములకు కొదవ లేదు. చూసుకో, సంతృప్తి చెందు'' అని నా ప్రభు అనుకుంటున్నట్లు కలలోనే భావన ఏర్పడింది. ఆయన ఒక రూపు నుండి మరొక రూపానికి నవ్వుతూనే మారుతున్నాడు. కాని నాకు మాత్రము ఆయన నా వలన కష్టపడుతున్నాడని, ఒక రూపము నుండి మరొక రూపమునకు మారుటలో శ్రమను ఎదుర్కొంటున్నాడని, నా కోసం నా ప్రభుకు ఏమాత్రం కష్టం కలగరాదని, దానిని నేను భరించలేనని భావించాను. ''ఇంతకుముందు మీ దర్శనం కోసం తపించిపోయిన మాట వాస్తవమే. నమో వేంకటేశాయ రథమును స్వీకరించుమని, స్వీకరించుటకు మీ దర్శనాన్ని ప్రసాదించమని కోరిన మాట వాస్తవమే గాని నేను ఒకే రూపును కోరాను ప్రభూ! ఇన్ని రూపాలను కోరలేదు. ఇక చాలు మీరు ఇంకా వివిధ రూపాలను చూపించవలసిన అవసరం లేదు. నేను పూర్తిగా సంతృప్తి చెందాను'' అనే దృఢమైన నిర్ణయానికి వచ్చాను. ఈ లీలలో నేను, శ్రీవేంకటేశ్వరుడు ఒకరికొకరం డైరెక్టుగా మాట్లాడుకోలేదు, కాని మా హృదయాంతర భావాల ఎక్స్ఛేంజి జరిగింది.

ఆ వెంటనే నేను ఆ శ్రీకృష్ణుని రెండు పాదాలను మాత్రమే చూస్తూ ఉండిపోయాను. మీ మొత్తం రూపం అవసరం లేదు. మీ పాదాలు మాత్రమే కావాలి అనే తీరులో కేవలం ఆయన రెండు పాదాలపైననే దృష్టి పెట్టి, రెండు చేతులతో నమస్కరిస్తూ వజ్రాసనములో కూర్చున్నాను. భగవద్గీతలో శ్రీకృష్ణుడు విశ్వరూప దర్శనాన్ని చూపినప్పుడు, ఏవిధంగా అర్జునుడు శ్రీకృష్ణుడి ముందర కొద్ది దూరంలో వజ్రాసనంలో కూర్చున్నట్లే నేను కూడా శ్రీకృష్ణుని ముందు ఇదేవిధంగా కూర్చుండి మ్రొక్కుతున్నాను. నేను శ్రీకృష్ణుని పాదాలనే చూస్తూ ఇతర భాగాలను పట్టించుకోలేదు. ఇలా శ్రీకృష్ణుని పూర్తి భాగాలను చూడనట్లైతే స్వామివారు ఇతర రూపాలను చూపరని భావించాను. కాని దూరము నుండి చూస్తున్నాను. కావున నా చూపు ఒక కోణంలో ప్రసరించుట వలన ఆయన పాదాలతో పాటు నడుము వరకు చూడగలుగుతున్నాను. అంటే ఆయన పాదాలు దానిపై ధోవతితో పాటు నడుము వరకు చూడగలుగుతున్నాను. అలా చూస్తూ చాలాసేపు ఉండిపోయాను.

నేను స్వామివారిని తన ఇతర రూపాలను చూపించవద్దని నాకు ఇక చాలని అన్నాను. కాని ఆ శ్రీవేంకటేశ్వరుడు భక్తవత్సలుడు, గోరంత సేవకు కొండంత వరాన్నిచ్చే దేవదేవుడు. కాబట్టి వద్దు చాలించు అనే నా మాటను ప్రక్కన పెట్టాడు. నాకు ఇంకా వివిధ రూపాలను చూపటానికి నిర్ణయించుకున్నాడు. ఒక తల్లి తన బిడ్డకు తినిపించునప్పుడు ఇక చాలు కడుపు నిండిందని బిడ్డ ఎంత చెప్పినా వినక ఇంకొక్క ముద్ద తినమని బ్రతిమలాడినట్లు, నేను ఇక చాలు సంతోషించాను అని అన్నా కూడా శ్రీవేంకటేశ్వరుడు వినక ఇంకొక్క రూపమును చూడుమని బ్రతిమలాడినట్లుంది. నేను వద్దని ఎంత ప్రార్థించినా వినలేదు. ఇంకొక్క రూపమును చూపుటకు నిర్ణయించినట్లు వెంటనే ఆ కృష్ణుడు మత్స్యావతారంలోనికి మారాడు. ఈవిధంగా మారునప్పుడు తన పాదాలను తిరిగి ఒక దాని ప్రక్కన ఇంకొకటి పెట్టాడు. నాకు ఏమి జరుగుతోందో తెలియలేదు. నేను ఆయన పాదాలను మాత్రమే చూస్తూ కూర్చున్నాను. నేను కేవలం పాదాలనే చూస్తున్నప్పటికీ నా చూపు కోణంగా ప్రసారమవుతుంది కాబట్టి శ్రీవేంకటేశ్వరుడు చూపే ఇతర రూపాలను కూడా కొంతవరకు చూడగలుగుతున్నాను. క్రింద పాదాలను చూస్తున్నప్పుడు ఆ పాదాలు మార్పుచెందుట లేదు. కాని పైభాగము వివిధ రూపాలుగా మార్పు చెందుటను చూచాను. ఇప్పుడు పాదాలను చూసే సమయాన ఆ పాదాల ప్రక్కన, క్రింద ఆయన రూపాల ఛాయ నీడలాగా కనబడుచున్నది. ఎండలో ఒక వ్యక్తి నిలబడినప్పుడు ఆ వ్యక్తి




యొక్క ఆకారాపు నీడ భూమిపై కనపడినట్లు, స్వామివారు చూపు అవతారాల నీడ నాకు స్పష్టంగా కనిపిస్తోంది. నేను ఆయన మొత్తం రూపం అవసరము లేదని భావించి పైభాగమును చూడలేదు. కావున నీడలోనైనా నా పైభాగమును చూడుమన్నట్లు తన నీడను నాకు కనపడే విధంగా చూపిస్తున్నాడు. ఆ నీడ మార్పులు చెందుతున్నది. ఆయన మత్స్యావతారము నుండి కూర్మావతార రూపమునకు మారాడు. నేను ఆయన పాదాలనే చూస్తూ చాలు ప్రభూ! ఇక చాలు అని అరుస్తున్నాను. చివరికి నేను చాలు చాలు అని అరుస్తూ అలిసిపోయాను. ఇలా శ్రీవేంకటేశ్వరుడు శ్రీకృష్ణుని తరువాత రెండు మూడవతారాలను చూపాడు. చివరికి నన్ను సంతోషపెట్టడానికి మరిన్ని రూపాలను చూపడానికి కష్టపడకూడదని భావించి, చాలు ప్రభూ, చాలు అంటూ నా తలను పూర్తిగా నేలపై వంచి నమస్కరించాను. ఇక ఆ పాదాలను కూడా చూడటం మానేశాను. చాలు ప్రభూ చాలు అంటూ తలను నేలకు వంచాను. నేను ఇలా నా చూపును క్రిందకు వంచి ఆయనను పూర్తిగా చూడనిచో స్వామివారు తన ఇతర రూపాలను చూపరని భావించి అలా చేశాను. ఈ సందర్భమున ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! అర్జునుని తరువాత అంతటి అదృష్టవంతుణ్ణి నేనే అని కలలోనే భావించుకున్నాను. ఆ తరువాత కొంతసేపటికి క్రిందకి వంచిన తలను మెల్లగా పైకి లేపాను. మళ్ళీ ఒకే తల కలిగిన ఆరున్నర అడుగుల ఎత్తు గల శ్రీ దత్తాత్రేయుడు దర్శనమిచ్చాడు. ఆ తరువాత వెంటనే మూడు అడుగుల ఎత్తుతో మూడు తలలు కలిగిన శ్రీ దత్తాత్రేయుడుగా తిరిగి పూర్వపు విగ్రహము లాగా మారిపోయాడు. వెంటనే ఆ పూజారి ఆ ద్వారము నుండి లోనికి వచ్చాడు. చూస్తూ ఉంటే ఈ పూజారి కావాలని బయటకు వెళ్ళినట్లు ఊహించాను. నేను వజ్రాసనము నుండి లేచి నిలబడి ఆ పూజారికి నమస్కరించాను. తరువాత ఆ మూడడుగుల శ్రీ దత్తాత్రేయునికి మరోమారు నమస్కరించి ఆలయం నుండి బయటకు వచ్చాను. ఇది కలలోని మొదటి భాగం.

## రెండవ భాగం – ద్రౌపది లాగా రక్షించుట మరియు నన్ను స్పృశించుట

శ్రీవేంకటేశ్వరుడు ఈ భాగములో ఒక్క దెబ్బకు రెండు పిట్టలలాగా, ఒకప్రక్క పూర్వము ద్రౌపది లాగా రక్షిస్తూ, మరోప్రక్క తాను ప్రసాదించు కలలు నిజమని, సంశయించకుండా చేశారు. ఈ రెండవ భాగము నా వ్యవహారమునకు సంబంధించింది. ఇందులో పూర్వం ద్రౌపదిని ఏవిధంగా రక్షించాడో నన్ను అదేవిధంగా రక్షించాడు. మరియు స్వామివారు చూపే లీలలు నిజమని చెప్పుటకు నన్ను కలలో స్పృశించాడు. ఈ స్పృశించిన భాగం వచ్చే రెండు రోజులు మిగిలిన శరీర భాగాల కంటే భిన్నంగా ఉండునని చెప్పాడు. అది అలాగే జరిగింది. ఈ లీల ఈవిధంగా ఉంది.

ఇలా దాదాపు ఉదయం 11 గంటల ప్రాంతమున తిరుమల కొండపై ఉన్న శ్రీ దత్తాత్రేయుని ఆలయం లోనికి వెళ్ళి సుమారు ఐదు గంటల కాలము ఆ దేవదేవుని వివిధ రూపాలను దర్శించుకున్నాను. ఆ తరువాత నేరుగా మా కారు వద్దకు వెళ్ళాను. అక్కడ మా డ్రైవర్ కలీమ్ నా గురించి వేచి చూస్తున్నాడు. సాయంత్రమైంది, ఇంతవరకు సార్ రాలేదని బాధపడుతున్నాడు. హైదరాబాద్ నుండి తిరుపతికి వచ్చాము, స్వామివారిని దర్శించుకోకుండా తిరిగి హైదరాబాద్ వెళ్ళుట కలీంకు ఇష్టం లేదు. నేను ఇంతవరకు కలీంను దర్శనానికి పంపనందుకు, ఏర్పాట్లు చేయనందుకు నిరాశతో పాటు కలీంకు నాపై కోపమేర్పడింది. యజమానిని కాబట్టి తన కోపాన్ని తెలియపరచలేదు. కాని తన ముఖ కవళికలు తన మనసులోని భావాన్ని తెలియజేశాయి. దీన్ని గమనించి నాక్కూడా బాధ కలిగింది. కాని ఏమీ చేయలేని పరిస్థితి. కలీంతో పాటు నాకు కూడా శ్రీవేంకటేశ్వరుని చూడాలనే కోరిక కలిగింది. ఇంతకుముందు స్వామివారి ఎన్నో రూపాలను చూశాను. కాని నా ప్రభు శ్రీవేంకటేశ్వరుణ్ణి మాత్రం చూడలేదు. అసలు కొండకు వచ్చిందే శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థం. అలాంటిది స్వామివారిని చూడకుండా వెనుదిరగడం బాధ కలిగింది. తృప్తి చెందలేకపోయాను. స్వామిని చూడాలనే కోరిక క్షణక్షణము పెరుగుతోంది. ఒక భక్తునికి తాను ఆరాధించే రూపమును చూస్తేనే తృప్తి కలుగుతుంది, ఇతర రూపాలలో తృప్తి చెందలేడు.

నేను కారు వద్దకు వచ్చినప్పుడు చల్లని పిల్లగాలులు వీస్తున్నాయి. అప్పుడే వర్షం వచ్చి వెలిసింది కావున చెట్లపై నుండి నీటి బిందువులు క్రింద పడుతున్నాయి. పూల వాసనల ఘుమ ఘుమలు మనస్సుకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. పిచ్చుకల కిచకిచలు, సెలయేళ్ళ చప్పుడు నన్ను మైమరపించే విధంగా చేశాయి. ఎంత చూచినా తనివి తీరటం లేదు. ఆ ప్రాంతమంతా చల్లని వెన్నెలతో నిండి ఉన్నట్లు చల్లగా ఉంది. కాబట్టి కొంతసేపు

అక్కడ అటు ఇటు చూశాను. నా కనుచూపుమేర ఆ ప్రాంతాన్ని తనివితీరా చూశాను. చివరికి ఎక్కడికో పోవుటకు కారులో ఎక్కి వెనుక సీటులో కూర్చున్నాను. పిల్లగాలులు తగలాలని, కొండ అందాలను చూడాలనే ఉద్దేశ్యంతో విండో గ్లాసులను తెరచి కారులో వెళుతున్నాము. మా డ్రైవర్ కారు నడుపుతున్నాడు. నేను కొండ అందాలను చూస్తూ, ఆలయం నుండి వస్తున్న వేదమంత్రాల ఘోషను వింటూ మైమరచి కూర్చున్నాను. అప్పుడు సాయంత్రం కావస్తోంది. ఎలాగైనా స్వామి దర్శనం చేసుకోవాలని, అవసరమైతే రెండు రోజులు కొండపై ఉండి స్వామివారిని ధర్మ దర్శనం చేసుకోవాలని కలీం దృఢంగా నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని నాతో చెప్పలేక సతమతమైపోతున్నాడు. ఇంతలో మేము ఒక కూడలి లాంటి ప్రదేశానికి వచ్చాము. శ్రీవేంకటేశ్వరుని దర్శనానికి వెళ్ళే భక్తులు ఇక్కడే బస్సు దిగుతారట. అది ఒక పెద్ద మైదానం. భక్తుల రాకపోకలు ఉంటాయి కనుక ఒక పోలీసు కూడా రక్షకుడుగా అక్కడ నిలబడ్డాడు. కాకీ నిక్కరు, తెల్లరంగు చొక్కా ధరించి, చేతిలో ఒక కర్ర పట్టుకుని నిలబడ్డాడు. ఈ పోలీసుకు కొద్ది దూరంలో మరో వ్యక్తి నిలబడ్డాడు. ఇతను చూచుటకు దారి దోపిడీయే జీవనోపాధిగా జీవిస్తున్న దొంగ లాగా ఉన్నాడు. మా కలీం మా కారును ఆ మైదానము వద్ద రోడ్డుకు ఒక ప్రక్కన ఆపాడు. అతను కారును ఎందుకు ఆపాడో నాకు తెలియదు. నేను ఇంతకుముందే నావి కొన్ని డబ్బులు తన దగ్గర పెట్టుకోమని మా కలీంకు ఇచ్చానట. ఇప్పుడు కలీం తన జేబులోనుండి రూపాయల కట్టను తీసి తిరిగి నాకు ఇచ్చాడు. ఆ రూపాయల కట్టలో పైన మాత్రం ఒక వంద రూపాయల నోటు, దాని క్రింద ఒక యాభై నోటు, దానిక్రింద 60-70 పది రూపాయల నోట్లు ఉన్నాయి. వాటి విలువ తక్కువే కాని బయటనుండి చూసేవారికి మొత్తం పెద్ద వందరూపాయల కట్టను ఇచ్చినట్లు లావుగా కనబడింది. కలీం అందరూ చూస్తుండగానే ''ఇదిగో సార్ మీ డబ్బులు తీసుకోండి, నేను దర్శనము చేసుకుని వస్తాను'' అని చెప్పి ఆ రూపాయల కట్టను నాకు ఇచ్చి కారు దిగి పరిగెత్తుకుంటూ దర్శనానికై వెళ్ళాడు. తనకోసం చూడకుండా నన్ను ఇంటికి వెళ్ళిపొమ్మని దానర్థం. కారు అద్దాలు తెరిచి ఉన్నాయి కాబట్టి లోపల జరిగిన ఈ డబ్బు మార్పిడి విషయం అక్కడి పోలీసు మరియు దొంగ స్పష్టంగా చూశారు. పైగా పైన ఒక వంద రూపాయల నోటు కలిగిన పెద్ద కట్ట కాబట్టి నావద్ద చాలా రూపాయలు ఉన్నాయని భావించారు. అప్పుడే చీకటి పడుతోంది. నేను ఈ డబ్బును జేబులో పెట్టుకుని కారు దిగాను. కారు రోడ్డుకు ఒక ప్రక్కన ఆపి ఉంది. అక్కడ ఆ సమయంలో నేను, పోలీస్, ఈ దొంగ తప్ప మరెవరూ లేరు. సాయంత్రం చీకటిపడింది కాబట్టి ప్రయాణీకులందరూ వెళ్ళిపోయారు.


ఆ ప్రాంగణపు రెండవ చివర ఒక పెద్ద గాలి గోపురం కనబడింది. గాలి గోపురం మధ్యలో శ్రీవారి దర్శనానికై వెళ్ళే మహాద్వారం ఉన్నది. ఈ గాలి గోపురమునకు ఇరుప్రక్కలా ఉన్న గోడలకు ఆలయానికి వేయునట్లు తెల్లని సున్నం మరియు జాజుతో జానెడు వెడల్పుతో నిలువు గీతలు వేయబడ్డాయి. చూచుటకు ఎరుపు తెలుపు నిలువు గీతలతో అలకరించి ఉన్నట్లు కనబడుతోంది. ఇంతలో నాకు కూడా నా స్వామి శ్రీవేంకటేశ్వరుని దర్శించుకోవాలనే బుద్ధి పుట్టింది. అందుకని ఆ కారును అక్కడే వదిలేసి, కారుకు తాళం వేశాను. తరువాత దర్శనార్థం ఆ మహాద్వారం నుండి నడుచుకుంటూ బయలుదేరాను. దీనినంతటినీ ఆ దొంగ బహు చక్కగా గమనించాడు. దొంగ మరియు పోలీసు ఒక్కసారి ఒకరి ముఖమును మరొకరు చూసుకున్నారు. ముసిముసిగా నవ్వుకున్నారు. వారి నవ్వులోని అర్థాన్ని నేను స్పష్టంగా గ్రహించాను. చీకటి కావస్తోంది. ఆ ప్రాంతంలో నేను తప్ప మరెవ్వరూ లేరు. నా వద్ద పెద్ద మొత్తంలో డబ్బు ఉంది కాబట్టి దానిని సులభంగా లాక్కోవచ్చునని ఆ దొంగ భావించాడు. పోలీసు కూడా దొంగకు సహకరిస్తున్నాడు. దోచుకున్న దానిలో కొంత భాగం పోలీసుకు ఇచ్చేలా మాట్లాడుకున్నట్లుగా ఉంది. అందుకని ఒకరినొకరు చూసుకుని పెద్ద మొత్తం దొరికిందని తెగ మురిసిపోతున్నారు. దీనినంతటినీ చూసి వారి ఆంతర్యమును గ్రహించాను. కాని ఏమీ చేయలేని పరిస్థితి. అక్కడ నేను ఒంటరిగా ఉన్నాను. కనుచూపుమేర ఎవ్వరూ లేరు. పైగా రాత్రి అవుతోంది. ఆ సమయంలో ఏ భక్తులూ రారు. నేను ఏకాకిని. చివరికి ధైర్యం తెచ్చుకున్నాను. శ్రీవేంకటేశ్వరుణ్ణి మనసులో గాఢంగా స్మరించుకున్నాను. జరిగేది జరుగుతుందని భావించాను. స్వామి దర్శనానికై మహాద్వారము నుండి లోనికి వెళ్ళాను.

అలా మహాద్వారము లోనికి ప్రవేశించగానే అక్కడ దాదాపు పదడుగుల వెడల్పుతో రాతితో నిర్మించిన దిగుడు మెట్లున్నవి. ఈ మెట్లకు ఇరువైపులా ఒక 20 అడుగుల ఎత్తైన రాతిగోడ ఉంది. ఈ రాతిగోడ ప్రస్తుతపు తిరుమల ఆలయ బయటి ప్రాకారం మాదిరిగా ఉంది. తిరుమల ఆలయం లోనికి వెళ్ళుటకు ముందు మహాద్వారము వద్ద ఒక గాలిగోపురము, దాని మధ్యన ద్వారము, ఆ ద్వారానికి రెండు పెద్ద పెద్ద తలుపులు ఉన్నట్లు, అదేవిధంగా ఈ గాలిగోపురం, దానిక్రింద ద్వారము, ఆ ద్వారానికి రెండు పెద్ద పెద్ద తలుపులు బిగించబడి ఉన్నాయి. తిరుమలలో ఈ గాలిగోపురానికి రెండు ప్రక్కలా 20 అడుగుల ఎత్తైన రాతిగోడ ఉంటుంది. ఈ కలలో కూడా ఇదేవిధమైన రాతిగోడ, గోపురమునకు ఇరువైపులా కాకుండా, గోపురము వెనకాల, దిగుడు మెట్లకు ఇరుప్రక్కలా నిర్మించబడి ఉంది. ఒకరకంగా స్వామివారి భక్తులకు అడవి జంతువుల నుండి రక్షణార్థం దారికి ఇరువైపులా గోడలు నిర్మించినట్లు ఉన్నది. శ్రీవారి ఆలయం ఈ మెట్లు దిగిన తరువాత కొంతదూరాన ఉన్నదట. అందుకని ఈ మెట్ల ద్వారా కొంతదూరం వెళ్ళవలసి ఉంది. ఒక వ్యక్తి ఈ మెట్లు

దిగునప్పుడు, ముందుకు కాని లేదా వెనుకకు కాని వెళ్ళవలసిందే తప్ప ప్రక్కలకు వెళ్ళటానికి వీలుపడదు. ఎందుకంటే ఒక 20 అడుగుల రాతిగోడ మెట్లకు ఇరువైపులా నిర్మించబడి ఉంది. నేను ఈ మహాద్వారములోకి ప్రవేశించి స్వామివారి దర్శనార్థం ఒంటరిగా మెట్లు దిగుతున్నాను. ఈ మెట్ల ఎత్తు కూడా పురాతనమైన కట్టడం లాగా ఎక్కువగా ఉంది. నేను ఒక్కొక్క మెట్టు దిగుతూ, ఇలా 20-25 మెట్లు దిగాను. ఇంతలో నానుండి ఒక వంద మెట్ల ముందర ఇలాంటిదే మరో గాలి గోపురం కనబడింది. ఈ దిగుడు మెట్లు ఈ రెండవ గాలి గోపురం నుండి పోవుచున్నవి. దీనికి కూడా ఒక మహాద్వారము, రెండు బలమైన తలుపులు ఉన్నాయి. దీనికి కూడా మొదటి గోపురం లాగానే సున్నం వేయబడి జాజుతో ఎర్రని నిలువు గీతలు వేయబడి ఉన్నాయి.

ఇంతలో బయట నన్ను చూసిన దారి దోపిడి దొంగ ఎలాగైనా నా వద్ద ఉన్న డబ్బును లాక్కోవాలని నిర్ణయించుకున్నాడు. మరికొంతమంది తన సహచరులను సమకూర్చుకున్నాడు. వీరందరి సహాయంతో నన్ను దోచుకోవటానికి నిర్ణయించుకున్నాడు. నేను ఒంటరిగా ఉన్నాను, వారు చాలామంది ఉన్నారు. కాబట్టి నావద్ద ఉన్న సొమ్మును సులభంగా లాక్కోగలమని భావించి, వికటహాసం చేశారు. ఆ.. హ్హా... హ్హా... అంటూ గట్టిగా అహంకారపూరితంగా నవ్వారు. ఈ నవ్వును మెట్లు దిగుతున్న నేను స్పష్టంగా విన్నాను. ఒక్కసారి నా గుండె ఝల్లుమంది. ఇంతమంది నాపై పడి దోచుకుంటారేమో అని భయం కలిగింది. వెనక ద్వారము నుండి ఈ నవ్వు వినబడింది. అందుకని ముందు ద్వారం నుండి వెళ్ళుటకు త్వరత్వరగా మెట్లు దిగసాగాను. ఇంతలో ఒక ఐదారు మంది దొంగల పరివారం ముందు ద్వారం నుండి వచ్చి, ఆ ముందు ద్వారానికి ఉన్న తలుపులను మూసివేశారు. అవి చాలా బలమైన తలుపులు, కాబట్టి బయటికి ఎట్టి పరిస్థితిలోను వెళ్ళలేను. దీన్ని చూచి ఒక్క క్షణం అక్కడే నిలబడిపోయాను. ఆ వెంటనే వెనుదిరిగి మొదటి ద్వారము నుండి బయటికి పోవుటకు ప్రయత్నించాను. కాని ఈ దుండగులు వికటాట్టహాసం చేస్తూ మొదటి ద్వారాన్ని కూడా మూసివేశారు. ఇలా నన్ను రెండు ద్వారాల మధ్య బంధించి వేశారు. ఈ రెండు ద్వారాల బయట నాకోసం కాపలా కాస్తూ, ఆ... హ్హా... హ్హా.. అంటూ నవ్వుతున్నారు. నన్ను బోనులో చిక్కిన ఎలకలాగా భావించి, తప్పక నన్ను దోచుకోవాలని భావించారు. నేను తప్పించుకోలేనని దృఢంగా నమ్మారు. నా వద్ద ఉన్న సొమ్ము దొరికిందని, అందులో సందేహం లేదని భావించి అహంకారపూరితంగా భయంకరంగా నవ్వుతున్నారు. దీన్ని మొత్తాన్ని గమనించిన నేను బిత్తరపోయాను. ఏం చేయాలో తోచలేదు. నా అన్ని మార్గాలు మూసివేయబడ్డాయి. ప్రక్కలకు, ముందూ వెనకా ఎక్కడికీ వెళ్ళలేను, కాబట్టి వారి మధ్యలో చిక్కిపోయాను. నన్ను వారు దోచుకోవడం తథ్యమని భావించాను. చేసేది లేక ఒక్కసారి శ్రీవేంకటేశ్వరుణ్ణి మనస్సులో ధ్యానించుకున్నాను. ఎలాగైనా ఈ దొంగలు నిలువు దోపిడి చేస్తారని భావించాను. కనీసం ఒకపూట భోజనానికి సరిపడే డబ్బులు మిగుల్చుకోవాలని వాటిని దాచిపెట్టుటకు మొదటి ద్వారం వద్దకు పరిగెత్తుకు వెళ్ళాను. ఆ తలుపు ప్రక్కన నా వద్ద ఉన్న ఒక 50 రూపాయల నోటును పెట్టి దానిపైన ఒక రాయిని గాలికి ఎగిరిపోకుండా మరియు ఈ దుండగులు ఆ డబ్బును చూడకుండా పెట్టాలనుకున్నాను. కాని ఎందుకో అలా చేయకుండా వెంటనే తిరిగి మొదటి స్థానానికి వచ్చి నిలబడ్డాను. ఆ తరువాత మొదటి ద్వారము వైపు ముఖం చేసి ఆ మెట్ల మధ్యలో నిలబడ్డాను. మొదటి ద్వారం బయట దుండగులు వికటాట్టహాసం చేస్తున్నారు. ఆ నవ్వును వింటున్న నాకు భయమేసింది. కాని తరువాత కొంతసేపటికి తెగించాను. శ్రీవేంకటేశ్వరుణ్ణి మనస్ఫూర్తిగా స్మరించాను. నీవు తప్ప దిక్కెవ్వరూ లేరని పరి పరి విధాల ప్రార్థించాను. ప్రభూ! శ్రీవేంకటేశ్వరా! కాపాడు స్వామి అంటూ దీనంగా ప్రార్థించాను. ఆ సమయాన నాకు కలలో ద్రౌపది గుర్తుకు వచ్చింది. ఒకప్పుడు ద్రౌపది కూడా నావలెనే నిస్సహాయురాలు. ఆమె ఇదేవిధంగా శ్రీకృష్ణుణ్ణి ప్రార్థించిందని కలలోనే అనుకున్నాను. శ్రీవేంకటేశ్వరుణ్ణి పూర్తిగా శరణు వేడాను. నేను సంపూర్ణ శక్తిహీనుణ్ణి, రక్షించేవారు లేరు, శరణు, శరణు అని శ్రీవేంకటేశ్వరుణ్ణి ప్రార్థించసాగాను. ఆ శరణాగత స్థితి చాలా మధురంగా అనిపించింది. ఆ మధురత్వమును వర్ణించుటకు మాటలు రావటం లేదు. పదములు దొరుకుట లేదు. నా శరీరంలోని రోమ రోమము శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరించింది. మహా ఆనందమును అనుభవించాను. ఆనాడు ద్రౌపది ఇదే విధమైన అనుభూతిని పొందిందని, అంతటి గొప్ప ఆనందమును తిరిగి ఇప్పుడు నేను పొందుచున్నానని కలలోనే భావించుకున్నాను. ఇలా నేను కళ్ళు మూసుకుని శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరిస్తూ, నిర్భయంగా నిలబడి ఉన్నాను. ఆ సమయాన నా మనస్సులో ఎంతమాత్రం భయం లేదు. మహా ఆనందంగా ఉన్నాను. ఈ దుండగులను దోచుకోమని సహకరించుటకు సిద్ధంగా ఉన్నాను. ప్రతిఘటించకూడదనుకున్నాను. శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరిస్తూ తన్మయత్వంలో ఉన్నాను. ఇంతలో దుండగులు భయంకరంగా నవ్వుతూ మహాద్వారపు తలుపులు తెరిచి వెంటనే నాపైకి దూకారు. ఆ సమయమున నేను మహాద్వారము నుండి ఒక ఏడు ఎనిమిది మెట్ల దూరములో ఉన్నాను. అవి దిగుడు మెట్లు కావడం వలన నేను వారి కంటే క్రింద ఉన్నాను.

ఏ సమయాన దుండగులు వికటంగా నవ్వుచూ నాపై దూకారో, నేను ఆ దుండగుల వైపు ముఖము పెట్టి, కళ్ళు మూసుకుని శ్రీవేంకటేశ్వరుణ్ణి స్మరిస్తున్నాను. నన్ను దోచుకోండి, నేను ప్రతిఘటించను అంటూ అంతా నా ప్రభు చూసుకుంటాడు




అనే భావనతో నిలబడ్డాను. ఏ సమయాన దుండగులు నాపై దూకారో, వారు గాలిలో ఉన్నప్పుడు, నా వెనుక ఒక అదృశ్యవ్యక్తి ప్రత్యక్షమయ్యాడు. తన చేతిని నా భుజముపై వేసి గట్టిగా పట్టుకున్నాడు. తన చేతిలోని బొటనవ్రేలును నా వీపుభాగాన, మిగిలిన నాలుగు వ్రేళ్ళను ముందు భాగాన ఉండునట్లు నా భుజంపై తన అరచేతిని వేసి గట్టిగా పట్టుకున్నాడు. మెట్టుపై అభిముఖంగా నిలబడ్డ నన్ను వెనుకకు వంచాడు. దుండగులు నాపై దూకినప్పుడు నా భుజాన్ని తన చేతితో పట్టుకుని నేను పూర్తిగా వెల్లకిలా పడుకున్నట్లు వెనక్కి వంచాడు. నేను వెనుకకు వంగినది గమనించిన దుండగులు మరింత ఉత్సాహంతో, మరింత వేగంగా, మరింత ముందుకు దూకారు. దీన్ని గమనించిన ఆ అదృశ్యవ్యక్తి నా భుజాన్ని పట్టి నన్ను మరింత వెనుకకు లాగాడు. ఆ సమయాన నా కాళ్ళ మడమల చివరలు ఒక మెట్టు చిట్టచివర ఆని ఉన్నాయి. నా వీపుభాగం ఆ అదృశ్యవ్యక్తి బొటనవ్రేలిపై నిలిచి ఉన్నది. నా జబ్బ ఎముక ఆ వ్రేలిపై ఆని ఉన్నది. నా పూర్తి భారం ఆ వ్రేలు భరించింది. ఆ వ్రేలు చాలా గట్టిగా, నున్నగా నా శరీరానికి తాకింది. ఆ వ్రేలు ఒక రాయి లేదా ఇనుము లాగా గట్టిగా ఉన్నట్లు అనుభూతి చెందాను. ఆ వేలు నా శరీరానికి ఒత్తుకుపోయింది కాబట్టి నొప్పి రాసాగింది. మరియు ఆ అదృశ్యవ్యక్తి నన్ను వెనుకకు లాగడం వలన ఆ దుండగులు క్రింద పడిపోయారు. నన్ను పట్టుకోలేకపోయారు. ఈవిధంగా స్వామివారు నన్ను ఆ దుండగుల నుండి కాపాడారు.

ఏ చేయి నన్ను గట్టిగా పట్టుకుని వెనుకకు లాగిందో ఆ చెయ్యి మహాబలశాలిది. నన్ను వెనకకు లాగడంలో ఆయన బలమును కొంతలో కొంత గ్రహించాను. ఈ చెయ్యి మహా బలశాలిదని కలలోనే అనుకున్నాను. ఈవిధంగా నా శరీరంపై ఒక అదృశ్యపు చేయి పడి నన్ను ఆ దుండగుల నుండి రక్షించుటను నేను ఊహించలేదు. ఈ కల పొందిన వెంటనే ఇది నిజం కావాలంటే పరీక్షించుకో! ''ఏ భాగాన ఆ బొటనవ్రేలు శరీరాన్ని తాకిందో అక్కడ రాబోయే రెండు రోజుల వరకు నొప్పి కలుగుతుంది'' అనే భావన కలలోనే వచ్చింది. వెంటనే కల చెదిరింది. కాని ఈ భావం మాత్రం నా మనస్సులో మాటి మాటికీ రాసాగింది. ''ఇది నిజం. ఆ చేయి తాకినచోట నొప్పి కలుగుతుంది'' అని మాటిమాటికీ వస్తోంది. తెల్లవారి ఈ కలను విశ్లేషించాను. నొప్పి మాత్రం కలుగుతోంది. భరించలేని, డాక్టర్ వద్దకు వెళ్ళేంత నొప్పి కలిగింది. దీనిని చూసి నవ్వుకున్నాను. నా ప్రభు తిరుమల శ్రీవేంకటేశ్వరునికి శతకోటి నమస్కారాలను సమర్పించాను. ఈ అల్పునిపై ఇంత ప్రేమ కురిపించినందులకు భోరున ఏడ్చాను. ఆయన దివ్య దర్శనాలను మరియు స్పర్శను కలగజేసినందుకు మరొక్కసారి ప్రణమిల్లాను. ఆయనను ప్రార్థించుటకు మాట రాలేదు, మూగవాడినైపోయాను. నేను పొందిన ఆనందమునకు ఆకాశమే హద్దు. దీనిని నా ప్రభు శ్రీవేంకటేశ్వరుడు తప్ప ఇతరులు తెలుసుకోలేరు. ఈ నొప్పి మూడు రోజుల తరువాత తగ్గింది.

ఈవిధంగా తేది 25-04-2005 నాటి రాత్రి కలలోని మొదటి భాగంలో 'నమో వేంకటేశాయ' రథమును స్వీకరించాడు. రెండవ భాగంలో నన్ను దుండగుల నుండి కాపాడాడు. మరియు నా శరీరాన్ని స్పృశించాడు. స్వామివారు చూపే కలలు నిజమని సందేహించవద్దనే దృఢ అభిప్రాయాన్ని కల్గించారు. అప్పటి నుండి స్వామివారి కలలను సందేహించలేదు.

స్వామివారి పట్ల, మనము చెందే తపనకు అనుగుణంగా స్వామి అనుగ్రహం ఉంటుందని భావించాను. మరియు భవిష్యత్తులో ఇంతకంటె ఎక్కువ తపించే పరిస్థితులు రాగలవని, వాటికి బెదరక సాధన చేస్తే ఇంతకంటె ఎక్కువ స్వామి అనుగ్రహం తప్పక లభించగలదనే ఒక హృదయాంతర భావం వెనువెంటనే ఏర్పడింది.

**నా దశ:** నమో వేంకటేశాయ రథమును స్వీకరించుటకు స్వామివారు వివిధ రూపాలను చూపారు. అర్జునుని తరువాత అంతటి భాగ్యశాలిని నేనే అనే అభిప్రాయం ఏర్పడింది. ఆ తరువాత ద్రౌపదిని రక్షించినట్లు రక్షించారు. నన్ను స్పృశించి, స్వామి లీలలను సందేహించకుండా చేశారు.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**గోవిందదాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)**
ఇ.నెం.1-1-53, వీధి నెం.1. హబ్సీగూడ,
హైదరాబాద్. ఫోన్: 040-27175050



## తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశా నిర్దేశం – స్వామివారి దివ్యలీలలు

# మొదటి సంపుటం పుస్తకావిష్కరణ

తేది 02-06-2024 ఏకాదశి, ఆదివారం సాయంత్రం హైదరాబాద్ లో రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామివారి మం గళాశాసనములతో తిరుమల శ్రీవేంకటేశ్వరుని దిశా నిర్దేశం – మొదటి సంపుటం పుస్తకావిష్కరణ జరిగింది. దీనిని పూర్వపు టిటిడి ఈఓ శ్రీమాన్ కె.వి.రమణాచారి గారు ఆవిష్కరించారు. శ్రీవేంకటేశం మాసపత్రిక గౌరవ సంపాదకులు శ్రీమాన్ టి.గౌరీశంకర్ గారు సభాధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యే శ్రీమాన్ ప్రభాకర్ గారు, శ్రీమాన్ మరింగంటి లక్ష్మణాచార్యులు గారు, డాక్టర్ పులిగడ్డ లలితవాణితో పాటు రచయిత శ్రీమాన్ పుల్లగూర్ల సాయిరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీమాన్ కె.వి.రమణాచారి మాట్లాడుతూ భగవంతుని గురించి భక్తుడు చెందే తపనలను, అనుభూతులను పుస్తకరూపంలో తీసుకురావడం అభినందనీయమని, భక్తులకు మార్గదర్శకమన్నారు. ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను ప్రేరేపించేందుకు ఈ పుస్తకాన్ని అన్ని భాషల్లోకి అనువదించాలని కోరారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారు భక్తులను ఎలా కరుణిస్తాడో తెలుసుకోడానికి 700 దివ్యలీలల ఈ పుస్తకమెంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. స్వామివారి అనుభూతుల ప్రభావముతో తిరుపతిలో స్థూపనిర్మాణం, శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం స్థాపించి ప్రతి సంవత్సరం 7 కోట్ల జప సమర్పణ, నమో వేంకటేశాయ రథ నిర్మాణం మరియు నిర్వహణ, శ్రీవేంకటేశం మాసపత్రికతో పాటు స్వామివారికి మొత్తం 111 ఉచిత కళ్యాణాల సంకల్పం చేయుట చాలా గొప్ప విషయమని అన్నారు. మరియు స్వామివారి ఆశీస్సులతో తప్పక యోగ్యత సాధించి, చిన్నగుండవెల్లిలో హరినామ క్షేత్రం ఏర్పాటు చేయగలరనే విశ్వాసాన్ని వక్తలందరూ వ్యక్తపరిచారు.

మరియు ఈ పుస్తకం కేవలం మొదటి సంపుటం మాత్రమేనని ఇలాంటివి ఇంకా నాలుగయిదు రావచ్చునని పుస్తక రచయిత శ్రీమాన్ గోవిందదాసు అన్నారు. ప్రతి ఉగాది నుండి శ్రీరామనవమి మధ్యకాలంలో ఒక నూతన సంపుటమును ఆవిష్కరిస్తామని అన్నారు. శ్రీవేంకటేశం మాసపత్రికలో ఏప్రిల్ 2023 నుండి మార్చి 2024 వరకు ప్రచురించిన 12 భాగాలు కలిపి మొదటి సంపుటముగా ప్రచురించామని ఇలా ప్రతి ఏప్రిల్ నుండి వచ్చే మార్చి వరకు శ్రీవేంకటేశం మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురించిన 12 భాగాలను ఒక సంపుటముగా ప్రచురించుదుమని పుస్తక రచయిత శ్రీమాన్ గోవిందదాసు అన్నారు. ఇవి స్వామివారి అద్భుతమైన లీలలని, స్వామివారు ఇష్టంతో ఈ లీలలను ప్రసాదిస్తున్నారని, చదివిన ప్రతి భక్తునికి స్వామి అనుగ్రహం తప్పక లభించగలదని అన్నారు.

అంతకుముందు శ్రీమతి రమాప్రభ బృందం భజగోవిందం ఆలపించారు. పిదప ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.

## స్వామివారికి 22వ జప సమర్పణకై పూర్తి చేసిన జప పుస్తకములను పంప మనవి

శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం తరపున తిరుమల శ్రీవేంకటేశ్వరునికి 22వ పర్యాయం 7 కోట్ల జప సమర్పణ కొరకు జపములను వ్రాసే భక్తులకు మనవి. వారు వారి జప పుస్తకములను తేది 30-07-2024 వరకు పీఠమునకు చేరునట్లు పంపవలసిందిగా మనవి. ఆలస్యమైతే వారి పుస్తకములు ఈ సంవత్సరం స్వామివారికి సమర్పించబడవు. కాబట్టి పూర్తి చేసిన జప పుస్తకములను తేది 30-07-2024 లోపల మాకు చేరునట్లు పంపగలరు.

**శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం, 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500 007. ఫోన్ : 040-27175050**



# గురు పౌర్ణిమ

- డా. దేవులపల్లి పద్మజ

**గురుబ్రహ్మా గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః**
**గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః**
**సదాశివ సమారంభాం శంకరాచార్య మాధ్యమాం!**
**అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరాం !!**
**తల్లి జన్మనిచ్చి చల్లగా పెంచును**
**తండ్రి వెంట నిలచి దన్ను నిచ్చు**
**గురువు విద్యనేర్పి గుణములు గరపును**
**ప్రకృతి పలుకునిచ్చు ప్రజ్ఞ మనకు !!**

ఒక శిష్యుడు తన గురువుగారిని వెదుకుతూ చివరికి ఆయనను కలుసుకుంటాడు. కొంత కాలం తరువాత శిష్యుడు సెలవు తీసుకుంటూ తిరిగి ఎప్పుడు దర్శనమిస్తారు అని గురువుగారిని అడుగుతాడు. అప్పుడు గురువుగారు యిలా చెబుతారు –

**శృణు విప్ర తపేచ్ఛా చేత్ దర్శనార్థం తదా త్వయా!**
**పూజనీయో విశేషేణ, కథంవాచయితా స్వయం !!**

మానవ జీవిత చరితార్థానికి, భగవద్దర్శనానికి బాటలు వేసేవారు గురువులు. గురుపూర్ణిమ, ఆషాఢ పూర్ణిమ, వ్యాసపూర్ణిమ ఏదైనా పవిత్రమైనదే. ఈ రోజు వ్యాసభగవానుని జన్మదినము. అష్టాదశ పురాణాలను మనకు అందించిన మహనీయుని జన్మదినం కారణంగా గురుస్థానములో ఆ వ్యాసభగవానుని స్మరిస్తూ చేసుకునే పవిత్రమైన రోజు. ఆషాఢ పూర్ణిమను గురు పూజతో ఉత్సవం చేయటం మన భారతీయ సంస్కృతిలో భాగమైనది. గురువుని త్రిమూర్తిస్వరూపంగా భావిస్తాము. మానవ చరిత్రలోనే అపూర్వమైన ఆధ్యాత్మిక పర్వదినంగా నిలచినది వ్యాస జన్మతిథి. ముందుగా ఈ తిథికి సంబంధించిన ఒక చక్కని కథను తెలుసుకుందాము.


బ్రాహ్మణోత్తమా! నీవు నన్ను దర్శించాలని కుతూహలంగా ఉన్నావు

గనుక విను. ఎవరైనా పురాణగాథలను, వేదగాథలను వ్యాఖ్యానం చేస్తూ వాటి రహస్యాలను ఉపదేశిస్తుంటారో వారే నా నిజ స్వరూపం అని తెలుసుకుని, అతనిని సాక్షాత్తు వ్యాసమూర్తిగా భావించి పూజింపవలసినది. నేను ఎల్లప్పుడూ ఇటువంటి పౌరాణికులందరిలోనూ ఉంటాను అని అంటారు.

అందువలన పౌరాణికులు, కథకులు, బోధకులు గురువులుగా పిలవబడతారు. పురాణాలలో నిగూఢంగా నిహితం చేయబడిన విషయాలను మానవజాతి జ్ఞానం సంపాదించాలంటే వ్యాస మహర్షి అనుగ్రహం అవసరము. అందుచేత మనం వ్యాస పూర్ణిమ నాడు పౌరాణికులను, మన గురువులను ధూపదీప నైవేద్యాలతో పూజించి తగిన విధంగా సత్కరించాలి. గురువులకు గురువుగా ఖ్యాతి గడించిన మహనీయుడు వ్యాసమహర్షి. అందువలన లోకంలో అందరూ శ్రీ వ్యాసమహర్షిని పూజించి, గౌరవించాలి. హిందూమతంలో భగవంతుని తెలుసుకోవటానికి ముఖ్యమైన ఆలంబనగా గురువును భావిస్తారు. తమ జీవితాలకు సరైన మార్గ నిర్దేశనం చేయటానికి కావలసిన సాధన సంపత్తి గురువు ద్వారా లభిస్తుందని అందరి విశ్వాసం. గురువులుగా ప్రసిద్ధిగాంచిన ఆదిశంకరులు, దత్తాత్రేయుడు, శ్రీ షిరిడీ సాయినాథుడు మొదలైనవారిని ఈరోజు కొలుస్తారు. ఈ గురుపూర్ణిమ ఉత్సవాన్ని శ్రీ ఆదిశంకరులే ప్రారంభించారని కూడా చెబుతారు. అజ్ఞానమనే చీకటిని తొలగించి, జ్ఞానమనే జ్యోతిని వెలిగించేవారు గురువు. మనం జన్మించిన తరువాత మన కన్నతల్లిదండ్రులు ప్రథమ గురువులు కాగా, మిగిలిన జీవితం మొత్తం మార్గనిర్దేశనం చేసేవారు గురువు.

గురుపూర్ణిమ నాడు ఉదయమే మేల్కాంచి, శుచియై తమ ఇంటిలోని పూజామందిరాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇంటి ముఖద్వారానికి చక్కటి మామిడి తోరణాలను అలంకరించాలి. ఒక కొత్త వస్త్రాన్ని పరచి అందులో బియ్యం పోసి, మధ్యలో తమలపాకు నుంచి, వాటి మధ్యలో గురు ప్రతిమనుంచాలి. ఉత్తరం వైపుగా కంచు దీపం వెలిగించి, తులసిమాల ధరించి పూజ నిర్వహించాలి. షోడశోపచారములతో పూజలు నిర్వహించి, తీర్థప్రసాదములను స్వీకరించాలి. ఈ విధంగా నిర్వహించటం వలన సకల ఈతి బాధలు తొలగిపోతాయని నమ్మకం.

ఈ రోజు దేవాలయాలలో కూడా విశేష పూజలు నిర్వహిస్తారు. ఉదయం పాలాభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. రోజంతా గురుప్రార్థనలు చేస్తారు. సాయంకాలం చక్కటి ఆధ్యాత్మిక ప్రసంగాలు ఏర్పాటు చేస్తారు. భక్తులందరూ ఎంతో భక్తిశ్రద్ధలతో పాల్గొని ఆనంద పరవశులౌతారు. శ్రీ గురుచరిత్ర, సాయిచరిత్ర వంటి పుస్తకాలను, ఉడకబెట్టిన శెనగలను అందరికీ పంచిపెడతారు.



పూర్వకాలంలో గురుకులాలుండేవి. శిష్యులందరూ ఈ రోజు అమితమైన భక్తిశ్రద్ధలతో గురువును పూజించి వారి ఆశీర్వాదాన్ని స్వీకరించేవారు. గురువులు కూడా శిష్యులను తమ కన్న పిల్లలవలె చూసుకునేవారు. అందుకే ఆనాటి గురు శిష్య పరంపర, సంబంధ బాంధవ్యాలు అవిచ్ఛిన్నంగా కొనసాగేవి. కాని నేటి తరంలో అటువంటి స్థితిగతులు కానరావటం లేదు. సాక్షాత్తు దేవదేవుడైన శ్రీరాముడు విశ్వామిత్రుని వద్ద విద్యను అభ్యసిస్తారు. శ్రీకృష్ణుడు కూడా తన చిన్నతనంలో గురు ఆశ్రమంలో విద్యనభ్యసించి, గురువుకు గురుదక్షిణ చెల్లిస్తాడు. ఆయనకు అసాధ్యమైనది ఏదీ లేకపోయినప్పటికి, సర్వం ఆయన సృష్టి అయినప్పటికి, ఆచారాలను పాటించాలని, అందరకూ మార్గనిర్దేశనం చేయటానికి ఆవిధంగా చేస్తాడు.

**కామధేనువు మరి కల్పవృక్షము కూడ**
**గురువు మనసునందు కొలువుయుండు**
**గురువునకు సరియగు గురుదేవులే సుమా**
**ప్రకృతి పలుకునిచ్చు ప్రజ్ఞ మనకు !!**

సమస్త ప్రకృతిలో నిండి నిబిఢీకృతుడై జ్ఞానానందాన్ని, ప్రేమను పంచటానికి గురువు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆ మహత్తర జ్ఞానాన్ని అందుకోవటానికి శిష్యులకు చిత్తశుద్ధి అవసరం. మనిషిలో గుప్తంగా దాగియున్న జ్ఞానాన్ని, విశేష శక్తియుక్తులను వెలికితీసి మార్గనిర్దేశనం కలిగించేవారు గురువు. "గురువు లేనివాడు బరువగు నేలకు".

**తల్లి దండ్రి గురువు ధరణిలో పూజ్యులు**
**మరువకున్న దైవ కరుణ కలుగు**
**మరచిపోవువారు పరమ హీనులు సుమా**
**ప్రకృతి పలుకునిచ్చు ప్రజ్ఞమనకు !!**


మనమందరమూ గురువుకు తగిన గౌరవమర్యాదలు కలిగిస్తూ, వారి అడుగుజాడలలో పయనిద్దాం. విశ్వమానవ సౌభ్రాతృత్వానికి బాటలు వేద్దాం. గురువులు కూడా సత్ప్రవర్తన కలిగి, ఉన్నత ఆశయాలతో, నిష్కల్మష ప్రేమనందిస్తూ శిష్యులద్వారా లోకోన్నతికి కృషి చేయాలి. అందరం కలసి ఈ శుభదినాన ప్రతిన చేద్దాం, విశ్వమానవ శాంతికి బంగారు బాటలు వేద్దాం.

**ఓం శ్రీ గురుభ్యోనమః**

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

## 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

**సంకల్పం**

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1,
హబ్సీగూడ, హైదరాబాద్ – 500007.
ఫోన్: 040– 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

గత సంచిక తరువాయి

## మరుత్తుడు

సూతమహర్షి రాకతో శౌనకాది మునులందరూ లేచి నమస్కరించి తిరిగి ఆసీనులైనారు. వారినందరినీ ఆశీర్వదించి ఆనాటి విషయాన్ని చెప్పడం ప్రారంభించాడు సూతుడు.

‘‘నాయనలారా! ఈరోజు మరుత్తుడనే మహానుభావుడైన చక్రవర్తి గురించి చెబుతాను.సావధానులై వినండి.కృతయుగంలో దండనీతిని శాస్త్రోక్తంగా ప్రవర్తింపచేసిన మనుచక్రవర్తి కుమారుడు ‘ప్రజాని’. ప్రజాని మనుమడైన ఇక్ష్వాకుడు రాజ్యపాలనలో, ప్రజారక్షణలో అఖండ కీర్తిని సంపాదించి అందరి మన్ననలు పొందాడు. ఆ ఇక్ష్వాకు వంశంలోనివాడే కరంధముడు. రాజ్యాన్ని కోల్పోయిన కరంధముడు అడవికి వెళ్ళి నియమ నిష్ఠలతో మహా తపస్సు చేసి, గొప్పశక్తిని ఆర్జించాడు. ఆతడు తన చేతిని దండం లాగా (కర్ర లాగ) అమర్చి, తపశ్శక్తితో శరీరాన్ని దమింపచేసి (అణచివేసి) ఒక అద్భుతాన్ని సృష్టించాడు. ఆతని దండనీతి ప్రయోగంతో అక్కడికక్కడ చతురంగ బలాలు, అపారమైన ధనం దర్శనమిచ్చాయి. ఆ బలగంతో శత్రురాజులను జయించి తిరిగి తన రాజ్యాన్ని కైవసం చేసుకొన్నాడు కరంధముడు. శమదమాలు, సత్యశౌచాలను కలిగిన కరంధముడు యజ్ఞయాగాలలో శ్రద్ధ చూపుతూ అంగిరస మహర్షిని ఉపద్రష్టగా స్వీకరించి అనేక అశ్వమేధ యాగాలు చేసి త్రిలోకవాసుల చేత కీర్తింపబడినాడు. మహా మహిమోపేతుడైన కరంధముని – మనుమడే – మరుత్తుడు.

“అతని మనుమడు మరుత్తుం
దతుల యశుడు విష్ణు సదృశుఁ డనదగు నాగా
యుత బలుడు ధర్మతత్త్వ
స్థితి విదుడు సమిద్ధ బహుళ తేజుండధిపా!”

**-ప.28 – ప్రథమాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

మునులారా! ఈరోజు మనం చెప్పుకుంటున్న మరుత్తుడు ఎంత గొప్పవాడో చూడండి. కరంధముని మనుమడు అయిన మరుత్తుడు తాతకు తగ్గ సకల సద్గుణాలను కలిగినవాడు. సాటిలేని యశస్సుతో విరాజిల్లినవాడు. సాక్షాత్తు విష్ణుమూర్తితో సమానమైన మహత్తుతో ప్రకాశించినవాడు. దశ సహస్ర

గజ బలాన్వితుడు. ధర్మతత్త్వ పారంగతుడు. అద్భుతమైన తేజస్సుతో వెలుగులీనేవాడు. ఆ సార్వభౌముడు తన వైభవం ప్రకాశమానమయ్యేటట్లు అశ్వమేధ యాగం చేశాడు. ఆ సందర్భంలో యజ్ఞనిర్వహణకు సంరక్షించవలసిన పాత్రలను సువర్ణమయంగా చేయించేవాడు. ఆ పాత్రలు కుండలంత పెద్దవిగా, రకరకాల ఆకారాలతో కళ్ళకు విందు గొల్పేటట్లు ఉండడంతో ప్రజలందరూ ఆశ్చర్య చకితులై వాటిని చూస్తూ అలా నిలబడిపోయేవారు.

ఇంకా మరుత్తుని వైభవం గురించి చెప్పాలంటే మాటలే చాలవనిపిస్తుంది. ఆ సార్వభౌముడు యజ్ఞాలెక్కడ చేశాడంటే – హిమవత్పర్వతం సానువులలో శాస్త్రయుక్తంగా, అత్యంత వైభవంగా, దానధర్మాలకు లోటు రానివ్వకుండా, మహర్షుల మాటలకెదురు చెప్పకుండా, యజ్ఞమంటే ఇలా చెయ్యాలి సుమా అని అందరూ అనుకునేటట్లు చేశాడు. ఇంకో విషయం. యజ్ఞం చివర వేదవిదులైన బ్రాహ్మణోత్తములకు సంతృప్తికరంగా, భక్తితో బంగారాన్ని కుప్పలు కుప్పలుగా దక్షిణగా ఇచ్చేవాడు. అంతేకాదు విప్రవరులందరికీ గృహంలో వాడుకునేటందుకు బంగారు పాత్రలను చెంబు, గ్లాసు, పళ్ళెం వంటి వాటినెన్నిటినో దానంగా ఇచ్చి తృప్తి చెందేవాడు. ఆయన ధర్మగుణానికి, దాతృత్వానికి అవధులు లేవు. మరుత్తును చూసి అందరూ నేర్చుకోవలసిందే గాని ఆయన ఎవరినుంచీ నేర్చుకోవలసిన అవసరం ఆయనకు లేదు. అంత గొప్పవాడు మరుత్తుడు. యజ్ఞఫలం ఆయనకు దక్కడంలో ఆయన చేసిన దానధర్మాలే కారణాలు'' అని చెప్పటం ఒక్కక్షణం ఆపాడు సూతమహర్షి.

వెంటనే ఒక ముని లేచి ''మహాత్మా! అంత ధనం మరుత్తుకు ఎలా లభించింది? అన్ని యజ్ఞాలు ఎలా చేయగలిగాడు? ఎవరు చేయించారు? అశ్వమేధాది యజ్ఞాలను ఏ పద్ధతిలో ఆచరించాడు? వినాలని కుతూహలంగా ఉంది. వివరంగా చెప్పండి'' అని అడిగాడు. ''అలాగే నాయనా! ఇంతకుముందు చెప్పాను గదా! కరంధముని తపోమహిమ గురించి. అంగిరస మహర్షి ఉపద్రష్టగా కరంధమునిచేత అనేక అశ్వమేధ యాగాలు చేయించడం చేత లభించిన మాహాత్మ్యం వల్ల రాజులందరూ కొలుస్తుండగా ఆ మహారాజు సకల సుఖాలూ అనుభవించి, జన్మాంతంలో స్వర్గలోకానికి వెళ్ళి అచటి సౌఖ్యాలు పొందగలిగాడు. ఆయన పుత్రుడు, మరుత్తుని తండ్రి అయిన 'అవిక్షిత్తు' కూడా తండ్రి లాగానే రాజ్యపాలన చేసి, కీర్తిమంతుడై స్వర్గస్థితిని పొందాడు. 'అవిక్షిత్తు' కుమారుడే – మనం చెప్పుకుంటున్న మరుత్తుడు.

**"అతని సుతుండు సూవె మనుజాధిప సత్తమ! యమ్మహాత్ముఁడా
పతి తన తండ్రి పిమ్మట కృపారతు దార్యుఁడు దండనీతివి
శ్రుతమతి దానశీలుఁడన రూఢికి నెక్కి తదీయ రాజ్య సు
స్థితి వెలుఁగొందె వాసవుని చీరికిఁ జేకొనఁడీసు పెంపునన్"**



**-ప.33–ప్రథమాశ్వాసము–అశ్వమేధ పర్వము – మహాభారతము**

మహాత్ముడయిన మరుత్తు మహారాజు తన తండ్రి అయిన అవిక్షిత్తు, దివంగతుడైన పిమ్మట రాజ్యపాలన అవిచ్ఛిన్నంగా కొనసాగించాడు. మరుత్తుడు చెప్పుకోదగ్గ దయాశీలిగా, మాన్యుడిగా, దండనీతి నిపుణుడిగా, దానపరుడిగా, విశేష విఖ్యాతిని పొందాడు. ఆతని రాజ్యపాలనలో ప్రజలందరూ సుఖజీవితాన్ని పొందటంతో – దేవేంద్రుడంతటివానినే మరుత్తు లెక్కపెట్టలేదు. ధర్మపాలనే తన లక్ష్యంగా పెట్టుకొని ఆ మహీపాలుడు ప్రవర్తిస్తుండడంతో దేవేంద్రుడు కూడా అతనిని సహించలేక మరుత్తుడు తనను అన్నిటా మించిపోతాడేమోనని ఈర్ష్యతో కుమిలిపోయాడు. మరుత్తుడు ఎట్టి పరిస్థితులలోను కీర్తిలో తనను మించరాదనే ఉద్దేశ్యంతో స్వర్గాధిపతి తన గురువైన బృహస్పతి గృహానికి వెళ్ళి తన గోడును అతనికి వెల్లడించాడు. ''గురుదేవా! నాదొక విన్నపం. మరుత్తుడనే భూనాథుడు తాను చేయబోతున్న యజ్ఞానికి నిన్ను ఉపద్రష్టగా రమ్మని ప్రార్థించటానికి రాబోతున్నాడు. మహాత్మా! దేవతలకు ప్రభువును, స్వర్గలోకాధిపతిని అయిన నేను చేసే యజ్ఞానికి ఉపద్రష్టగా వర్తించే మీరు ఒక మానవుడు చేసే యజ్ఞానికి ఉపద్రష్టగా ప్రవర్తిల్లడం మీ ఘనతకు హాని కలిగించేది గదా! నన్ను కాదని, అతని చెంతకు వెళ్ళి అతని యజ్ఞ విధులనైనా నడపండి. లేదా నా మాట మన్నించి, నాకాప్తుడవై నా వద్ద ఉండి దేవగురువుగా మా యజ్ఞ కార్యాలు నిర్వహిస్తూ ప్రకాశించండి. మీరు సర్వజ్ఞులు. మీకు నేనింక చెప్పవలసిన మాటలు ఏవీ లేవు. మీ ఇష్ట ప్రకారం చేయండి'' అన్న దేవేంద్రుని మాటలకు బృహస్పతి నవ్వి 'మహాత్ముడవైన దేవేంద్రా! నేను, నిన్ను ఎఱుగుదును గదా! నీ గురించి ఇంతగా నీవు నాకు చెప్పాలా? సమస్త లోకాలకు అధీశుడవైన నీకు; దేవతలకు, ఋషులకు

గురువునైన నేను మరొకడికి, అందునా ఒక మానవుడికి ఉపద్రష్టగా (యజ్ఞం చేయించేవాడిగా, ఒక ఋత్విక్కుగా) ఉండగలనని ఎందుకనుకున్నావు? అలా ఎన్నటికీ చేయను. నేను నీ గురువునే సుమా!

**"అగ్ని చల్లనైన, నబ్జమిత్రుఁడు మైల**
**పడ్డ, నుర్వివారలఁబడిన, మేరు**
**నగము సంచలించినను బొంకు వారయునే?**
**నాదు పలుకు నెమ్మనమున నమ్ము!"**

**-ప.38 – ప్రథమాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

"ఇంద్రా! అగ్ని చల్లబడినా, సూర్యదేవుడు మసిబారిపోయినా, భూమి తలక్రిందులైనా, మేరు పర్వతం సంచలించినా (కంపించిపోయినా) నా మాట బొంకవుతుందా? కాదు. నన్ను, నా మాటను నమ్మవయ్యా! నీ గురువు నీ పక్షం నిలవక వేరొకరిని ఎందుకాశ్రయిస్తాడనుకొన్నావు?" అని అనగా బృహస్పతి మాటలు ఇంద్రునికి సంతోషాన్ని, శాంతిని సమకూర్చాయి. దేవతలందరూ ఆనందంతో దేవేంద్రుని కొలిచి రాగా ఇంద్రుడు సంబరంతో తన మందిరానికి వెళ్ళాడు.

బృహస్పతితో ఇంద్రుడు సంభాషించిన విషయమంతా తెలుసుకొన్న మరుత్తుడు దేవగురువు దగ్గరకు వెళ్ళి తాను చేయబోతున్న యజ్ఞానికి ఉపద్రష్టగా రమ్మని కోరాడు. 'ఆచార్యవర్యా! నా మనవి ఆలకించండి. ముందుగా మీకు తెలియజెప్పి, మీ అనుమతితో యజ్ఞానికి కావలసిన సామగ్రినంతా సమకూర్చి యజ్ఞం చేయటానికి సిద్ధంగా ఉన్నాను. దయచేసి, నా మాట మన్నించి, యజ్ఞాచరణకు మీరు ఉపద్రష్టగా రావలసినదిగా వేడుకొంటున్నాను' అని వినయంతో నమస్కరించిన మరుత్తుని చూశాడు బృహస్పతి. "మహారాజా! దేవేంద్రుడు తాను చేయబోతున్న యజ్ఞ నిర్వహణకు ఉపద్రష్టగా నీకన్న ముందుగా నన్నాహ్వానించాడు. వస్తానని మాట ఇచ్చాను, ఇచ్చిన మాట తప్పి నీ యజ్ఞానికి ఎలా వస్తాను?" అని బృహస్పతి చెప్పగా మరుత్తుడు తన కోరికకు గల కారణాన్ని మరింత దృఢపరిచాడు.

"మహాత్మా! ఒక్కమాట వినండి. మా తాత కరంధముడు మీ తండ్రి గారయిన అంగిరస మహర్షి ఉపద్రష్టగా యజ్ఞాలు చేశాడు గదా! అదేవిధంగా మీరు నా మీది కృపతో ఉపద్రష్టగా వ్యవహరించాల్సిందిగా ప్రార్థిస్తున్నాను. మీరంగీకరిస్తే నా యజ్ఞం నిర్విఘ్నంగా సమాప్తమవుతుంది. మీ అండదండలతో నేను యశస్వినవుతాను" అని ఎంతగానో అర్థిస్తున్న మరుత్తునికి బృహస్పతి తన అసమ్మతిని తెలియజేశాడు.

"రాజా! ఇంతకాలం పుణ్యాత్ములయిన దేవతలు ఆనందపడే విధంగా యజ్ఞ విధులను నిర్వహించిన ఖ్యాతి నాది. అటువంటిది ఒక మానవుడు చేసే యజ్ఞానికి ఉపద్రష్టగా, నీకు గురువుగా రాలేను. నేను రానన్నది నిజం. ఇక నన్ను ప్రార్థించకుండా వెళ్ళు. మరొకనిని వెదికి ఉపద్రష్టగా స్వీకరించు" అని బృహస్పతి నిష్కర్షగా చెప్పడంతో మరుత్తు సిగ్గుతో తన నివాసానికి తిరిగి వస్తుండగా, నారద మహర్షి ఎదురు రాగా వినయంతో నమస్కరించాడు.

"మహారాజా! నీ ముఖం దిగులుతో కనిపిస్తున్నది. ఎక్కడకు పోయి వస్తున్నావు? నీ విషయమేమిటో చెప్పు. ఎటువంటి కష్టమైనా, తప్పక తీరుస్తాను" అని నారదుడు చెప్పగానే మరుత్తుడాతనికి మరల నమస్కరించి "మహాత్మా! మీరు దేవర్షులు. మీకు తెలియని విషయమంటూ ఏదీ ఉండదు. అయినా మాన్యులు, మీరడిగారు కనుక నా బాధను తెలియజేస్తున్నాను. నేను చేయదలచిన యజ్ఞానికి అంగిరస పుత్రుడయిన బృహస్పతిని ఉపాధ్యాయునిగా ఆహ్వానించాను. మహనీయుడైన దేవగురువు (బృహస్పతి) నన్ను దూషించి పరిత్యజించాడు. ఇంత అవమానం జరిగాక, నేను బ్రతికి ఏమి లాభం మహర్షీ!" అని తన విషాదాన్ని వ్యక్తం చేశాడు.

అప్పుడు నారదుడు మరుత్తుని చూసి "ఇంతమాత్రానికే నీవు దిగులు చెందాలా? రాజా! నీ యజ్ఞానికి ఉపద్రష్టగా బృహస్పతి రాకపోతే ఏమాయె? అంగిరసుని చిన్నకుమారుడు సంవర్తుడు. సంవర్తుడు బృహస్పతి చేత తిరస్కరింపబడి సమస్తాన్ని త్యజించి, వైరాగ్యంతో, దిగంబరుడుగా తిరుగుతున్నాడు. ఆతని వద్దకు వెళ్ళి నీ యజ్ఞానికి ఉపద్రష్టగా రమ్మని వినయంతో వేడుకో. ఆ మహాత్ముడు తప్పక నీ యజ్ఞాన్ని సఫలీకృతం చేస్తాడు" అని చెప్పగా మరుత్తుడు మహదానంద భరితుడైనాడు. నారదుని చూసి –

**"మునివర! బ్రదికితి సంవ**
**ర్తుని నెచ్చటఁ గాంతు! నెప్పరు సునం దగ నా**
**డిన నతఁడు ద్రోపునీయక**
**నను(గైకొను? నెఱుఁగఁజెప్పు నాకుం గరుణన్"**

**-ప.43 – ప్రథమాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

అని అడిగాడు.

"మహర్షిసత్తమా! నీ మాటలతో బ్రతికాను. మహాత్మా! నీవు చెప్పిన అంగిరస పుత్రుడైన సంవర్తుని ఎక్కడ చూడగలను? ఆయనతో ఏవిధంగా మాట్లాడాలి? ఎలా విన్నవిస్తే నన్నూ, నా మాటలను త్రోసిపుచ్చకుండా నన్నాదరిస్తాడు? నేను ఎలా ప్రవర్తిస్తే సంవర్తుడు నాకు ఉపద్రష్టగా వచ్చి నా యజ్ఞాన్ని నిర్వర్తిస్తాడు? ఈ వివరాలనన్నిటినీ నాకు దయచేసి తెలుపవలసిందిగా మిమ్మల్ని అర్థిస్తున్నారు" అని మరుత్తుడు వేడుకోగానే నారదమహర్షి కృప వహించినవాడై –

"రాజా! సంవర్తుడు ఎప్పుడూ కాశీనగరాన్ని వదలి మరెక్కడా ఉండడు. మరొక ముఖ్య విషయం. అతడు ఎవరికీ



తెలియకుండా పిచ్చివాడిలాగా ప్రవర్తిస్తుంటాడు. ఆయనను ఎలా గుర్తించాలని అడుగుతావేమో! చెబుతాను. జాగ్రత్తగా విను. కాశీనగరం ముఖద్వారం వద్ద ఒక శవం ఉంచి, దాని దగ్గరే నువ్వుండు. అక్కడకు వచ్చి, ఆ శవాన్ని చూసి వెనక్కి తిరిగి వెంటనే వెళ్ళిపోయేవాడిని సంవర్తుడిగా గుర్తించు. ఆ విధంగా వెనుకకు తిరిగి వెళ్ళిపోతున్న వ్యక్తి వెనుక అత్యంత భక్తితో వెళ్ళు. ఆ విధంగా ఆయన వెంట పోతుండగా మధ్యలో ఎక్కడైనా నీకు ఆయన ఒంటరిగా దొరికితే ఆయన పాదాలకు నమస్కరించి, శరణు వేడు. నీ వినయ విధేయతలను, భక్తి ప్రపత్తులను చూసి, ''నా గురుతు నీకెవరు చెప్పారని సంవర్తుడు నిన్నడుగుతాడు. నీ గుర్తును నారద మహర్షి చెప్పాడని చెప్పు. నిన్ను చేరటానికి ఆ నారద మహర్షి ఈ వివరాలన్నీ చెప్పి నన్ను నీ వద్దకు పంపాడు. నిన్ను శరణు కోరుతున్నాను మహాత్మా! శరణు ప్రసాదించమని ప్రార్థించు. అయితే నారదుడు ఇప్పుడెక్కడ ఉన్నాడు చెప్పమని అడిగితే – నీ గురించి వివరాలు చెప్పి నారద మహర్షి అగ్ని ప్రవేశం చేశాడని నిస్సంకోచంగా చెప్పవయ్యా మరుత్తూ! ఏమీ బాధపడవలసిన అవసరం లేదు'' అని చెప్పి మరుత్తుని దీవించి నారదుడు అంతర్థాతుడైనాడు. నారదుడు చెప్పిన మాటలన్నీ మరుత్తుకు నచ్చాయి. 'అంగిరస మహర్షి పుత్రుడు తాను చేయబోయే యజ్ఞానికి ఉపద్రష్ట అయితే తనకు ఎంత గొప్ప! ఎంత ప్రతిష్ఠ! పైగా సంవర్తుడు తనను అవమానించిన బృహస్పతి తమ్ముడు. సంవర్తుడు తనను అంగీకరించాలి' అని అనుకుంటూ కాశీనగరాన్ని చేరుకున్నాడు మరుత్తుడు.

భటుల చేత ఒక దిక్కుమాలిన శవాన్ని పట్టించి తెప్పించాడు ఆ మహారాజు. కాశీపట్టణ ముఖద్వారం దగ్గర దానినుంచ చేసి, దానికి దగ్గరలో తానుంటూ సంవర్తుడు ఎప్పుడు వస్తాడా అని ఎదురు చూడసాగాడు. కొంతసేపటికి ఒక వెట్టివాడు అటుగా వచ్చాడు. వచ్చినవాడు వచ్చినట్లుండక ఆ శవాన్ని చూడగానే దెబ్బతిన్న జంతువులాగా భయపడి వెనక్కు తిరిగి పారిపోయాడు. ఆ వెట్టివాడే సంవర్తుడని గ్రహించిన మరుత్తుడు అతని వెంట వెళ్ళగా, వెళ్ళగా కొంతసేపటికి ఆ ఉన్మాది వెనక్కు తిరిగి మరుత్తునిపైన దుమ్ము చల్లాడు. అయినా మరుత్తుడు ఈ పిచ్చివానితో మనకేం పని అనుకొని వెనక్కు తిరిగి వెళ్ళిపోలేదు. పిచ్చివాడంతటితో ఊరుకోలేదు. ఆ మహారాజు పైన ఉమ్మి వేసి ఇతడు నిజమైన పిచ్చివాడే అని నమ్మేటట్లు చేశాడు ఉన్మాదిగా ఉన్న సంవర్తుడు. కాని, మరుత్తుడాతనిని పిచ్చివాడని నమ్మలేదు. నారదుడు చెప్పిన మాటలు గుర్తు చేసుకున్నాడు.

"వినయముతో కేల్ మొగుచుచు
నను గమనంబుడుగ కరుగ నాతండును ని
ర్జనమగు ప్రదేశమునకుం
జని యొక వట విటపి నీడఁజ దికిలఁ బడియెన్"

**-48ప–ప్రథమాశ్వాసము–అశ్వమేధపర్వము- మహాభారతము**

ఆ పిచ్చివాడు ఎంత అసభ్యంగా ప్రవర్తించినా మరుత్తుడు కోపగించుకోలేదు. పైపెచ్చు అతని వెంటనంటే నడుస్తున్నాడు. వినయంతో మాటి మాటికీ రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ ఆతని వెంటబడి వెళ్ళడం మానక వస్తుండటాన్ని చూసిన ఆ ఉన్మాది నిర్జన ప్రదేశానికి వెళ్ళి ఒక మర్రిచెట్టు నీడలో కూర్చుండిపోయాడు. నడిచి, నడిచి దాహంతో కొట్టుకుపోతున్న వాడివలె బాధపడుతూ కూర్చున్నాడు. ఉన్మాదిలాగా కనిపిస్తున్న సంవర్తుని వద్దకు వెళ్ళి మరుత్తుడు సాష్టాంగ నమస్కారం చేసి పక్కనే నిలబడ్డాడు.

''రాజా! నా గురించి నీకు చెప్పి నా వద్దకు నిన్ను పంపిన వాని పేరు చెప్పు. నీవు గనుక నిజం చెబితే నీ కోరిక సిద్ధిస్తుంది. అబద్ధం చెప్పావనుకో. నీ తల ఏడు ముక్కలై క్రిందపడుతుంది'' అని సంవర్తుడు చెప్పడంతో ''మహాత్మా! మీ గురించి నాకు నారద మహర్షి తెలియచెప్పాడు. నేను చెప్పింది నిజం'' అని మరుత్తుడు పలికాడు. అంతటితో సంవర్తుడు ఊరుకోక ''నారదుడు అప్పుడు, ఎక్కడ, ఏవిధంగా ఉన్నాడో చెప్పు'' అని సంవర్తుడడగటంతో ''నన్నాయన మీ వద్దకు పంపిస్తూ అగ్ని ప్రవేశం చేశాడు'' అని మరుత్తుడు నారదమహర్షి తనకు చెప్పిన విధంగానే చెప్పాడు. మరుత్తుని సమాధానం విన్న సంవర్తుడు ఆ రాజును చూస్తూ –

"ననుఁ గానఁగ నీ వచ్చిన
పనియెయ్యది?" యనినా నపతి "నా యజ్ఞం

**బునకుఁ గృపమీర లుపద**
**ర్శనముం జేయంగ వలయు సంయమినాథా!"**

**-52 ప – ప్రథమాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

''నన్ను చూడటానికి నీవెందుకు వచ్చావు? నా వల్ల నీకు కాగల పని ఏమిటి?'' అని సంవర్తుడడిగాడు. దానికి సమాధానంగా మరుత్తుడాయనకు నమస్కారం చేసి – ''మహర్షి సత్తమా! నేను చేయబోతున్న యజ్ఞానికి తమరు దయతో ఉపద్రష్టగా వ్యవహరించి నన్ను కృతార్థుని చేయవలసిందిగా కోరుతున్నాను'' అని వినయ వంతుడైనాడు.

''స్వామీ! నా పేరు మరుత్తుడు. మీ తండ్రి అయిన అంగిరస మహర్షి మా తాత అయిన కరంధముని యజ్ఞాలకు ఉపద్రష్టగా పనిచేసి మమ్మల్ని ఉద్ధరించారు'' అన్న మరుత్తుని మాటలకు సంతోషించిన సంవర్తుడు ''మహారాజా! నా సంగతి కూడా చెబుతాను విను. బృహస్పతి మా అన్న అని నీకు తెలుసు గదా. ఒకానొక సందర్భంలో ఆయన తన తపోబలంతో నన్నవమానించాడు. ఆ కారణంతో నేను నా గృహాన్ని, ధనం మొదలైన వస్తువులనన్నిటినీ విడిచిపెట్టి ఈవిధంగా తిరుగుతున్నాను. నన్ను చూశావు గదా! నావంటి పేదవాడు ఉపద్రష్టగా నీ యజ్ఞాన్ని నిర్వహిస్తే నీకు కలిగే లాభం ఏమిటి? వైభవం ఏమిటి? మహాత్ముడైన బృహస్పతిని ఉపద్రష్టగా చేసుకొని యజ్ఞం చేయి. నేనే ఉపద్రష్టగా నీవు యజ్ఞాన్ని చేయాలని తలపోస్తే ఒక మాట చెబుతాను విను.

**"అన్న నాకు మానుఁడాతండు పనుపంగ**
**నాచరింతు నీదు యాగమునకు**
**నొజ్జతనము వేగ ముర్వీశ! యగ్గురుఁ**
**గని యనుజ్ఞ వడయుఁ మనిన విభుడు"**

**-54 ప – ప్రథమాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

''రాజా! బృహస్పతి నాకు అన్న. నాకన్న జ్యేష్ఠుడు కదా! కనుక ఆయన అనుమతి ఇచ్చి నన్ను నీ వద్దకు పంపితే ఉపద్రష్టగా యజ్ఞాన్ని నిర్వహిస్తాను. అందుచేత మరుత్తూ! బృహస్పతి వద్దకు వెళ్ళి ఆయన అనుమతి పొంది నావద్దకు రా! అప్పుడు నీతో వస్తాను'' అన్న సంవర్తుని చూసి – ''మహాత్మా! ఇంతకు పూర్వమే నేను మీ అన్నగారి వద్దకు వెళ్ళి యాగానికి ఉపద్రష్టగా రమ్మనమని వేడుకొన్నాను. నా పట్ల ఈర్ష్య వహించిన దేవేంద్రుడు మీ అన్నగారి చెంతకు వెళ్ళి నాకు ఉపద్రష్టగా ఉండవద్దని ప్రార్థించిన కారణంగా బృహస్పతి నన్ను తిరస్కరించి, నా ప్రార్థనను లెక్కపెట్టక 'దేవతల యజ్ఞాలను చేయించే నేను మానవుల యజ్ఞాలను గురువుగా చేయిస్తానాఁ?' అంటూ ఆ మహానుభావుడు నన్ను ధిక్కరించాడు. ఇటువంటి పరిస్థితిలో మళ్ళీ నేనాయన వద్దకు ఏవిధంగా పోగలను? ఏమని వేడుకోను? సంయమి (మహర్షి) వరేణ్యా! మీ



తపశ్శక్తితో ఆ దేవేంద్రుని మీరతిక్రమించ గలరన్నది నా నమ్మకం. నామీది కరుణతో ఉపద్రష్టగా నా యజ్ఞాన్ని నిర్వహింప చేయాలని వేడుకొంటున్నాను'' అని మరుత్తుడు పలుకగా ఆ మహారాజు వినయానికి ఆనందించిన సంవర్తుడు ''నీవు చెప్పిన విధంగానే జరుగుతుందిలే. అయినా, నీకు మరొక్క విషయం చెబుతాను. ఆకళింపు చేసుకో. ఏ కారణం చేతనైనా సరే, నీవు యజ్ఞదీక్ష నుండి ఎప్పుడు కదులుతావో అప్పుడు నేను నీకు శాపమిస్తాను. దానివల్ల నీకు అపకారం కలుగుతుంది. ఇదంతా ఆలోచించి యజ్ఞదీక్షలో నీవు తగు జాగ్రత్తగా మెలగాలి. ఎవరు ఏ విధంగా నీకు కీడు కలుగజేసినా, దానికి సంచలించకుండా దృఢ చిత్తంతో యజ్ఞం చేస్తూనే ఉండాలి. మధ్యలో యజ్ఞాన్ని విరమించకూడదు. నేను నీ యజ్ఞానికి ఉపద్రష్టగా ఉన్నానన్న విషయం తెలుసుకున్న దేవేంద్రుడు, బృహస్పతి ద్వేషం కలిగినవారై, క్రోధంతో నీవు మధ్యలో యజ్ఞాన్ని ఆపివేయాలనే ఉద్దేశంతో ఎన్నో అడ్డంకులు పుట్టిస్తారు. వాటికి భయపడి నీవు యజ్ఞం చేయటం ఆపివేస్తే కోపగించిన నేను నిన్ను శపిస్తాను. నా శాపం వెంటనే నీకు కీడు కలుగజేస్తుంది. ఇదంతా తెలుసుకొని స్థిరచిత్తంతో యజ్ఞం చేయటానికి ఉపక్రమించాలి. కదలకుండా, బెదరకుండా యజ్ఞం చేయగలననే నమ్మకం ఉంటేనే – జాగ్రత్తగా ఆలోచించుకుని మొదలుపెట్టు. అవిశ్వాసంతో ఆరంభించకు'' అని సంవర్తుడు తగు జాగ్రత్తలు చెప్పగా విన్న మరుత్తుడు తన దృఢాభిప్రాయాన్ని కూలంకషంగా వివరిస్తాడు.

''మహానుభావా! మునిశ్రేష్ఠా! నాకు నీ కృప లభించింది.

అంతకన్న నాకింకేమి కావాలి? ఇంద్రుడు గాని, బృహస్పతి గాని నన్నేమి చేయగలరు? శంకరుడే కోపగించుకుని వచ్చి నా యజ్ఞాన్ని అడ్డగించినా బెదిరిపోతానా? సంచలిస్తానా? దయతో కూడిన మీ సఖ్యం, గురుత్వం పోగొట్టుకుంటే సూర్య చంద్ర తారక కులపర్వతాలు ఉన్నంతకాలం నాకు పుణ్యగతులుండవు'' అంటూ మరుత్తుడు నిష్కల్మషమైన మనస్సుతో శపథం చేసి సంవర్తుని మెప్పించాడు.

''రాజా! నీవు నిష్కల్మషుడవై యజ్ఞం చేయాలేగాని, దేవేంద్రుని కన్న నిన్ను మిక్కిలి ధనవంతునిగా చేసి యజ్ఞం నడుపుతాను. ఏవిధంగా నేను ఇంద్రుడి కన్నా గొప్ప ధనవంతుడిని కాగలనని నన్నడుగుతావేమో! చెబుతాను విను. హిమవత్పర్వతం ఉత్తరభాగంలో 'ముంజవంతము' అనే పేరు గల పర్వతం ఉంది. ఆ పర్వతం మీద దేవతలు, సిద్ధులు, గరుడులు, గంధర్వులు మొదలైన భక్తులందరి చేతను సేవింపబడుతూ శివపార్వతులు విహరిస్తుంటారు. ఆ కొండలో ఏ దిక్కువైపు చూసినా, మరణం గాని, వృద్ధాప్యం గాని, వ్యాధులు గాని ఎక్కడా కనిపించవు. అంతేకాదు, అన్నికాలాలలోను పొదలయందు, తీగలపైన, మొక్కలలోను పూలు, పండ్లు విరివిగా కనిపిస్తాయి. ఇక్కడ నీవు గమనించవలసిన మరో ముఖ్యవిషయం కూడా ఉంది. ఆ కొండ ప్రక్కల సూర్యకిరణాల లాగా ధగధగాయ మానంగా మెరిసిపోతుండే బంగారు రాళ్ళు, బంగారు ఇసుక సమృద్ధిగా ఉండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

''మహారాజా! ఇప్పుడు మనమిద్దరం ఆ ముంజవంతపర్వతం వద్దకు వెళ్దాం. అక్కడ ఉమాదేవితో కూడి దర్శనమిస్తున్న శంకరుని, శ్రీకంఠుని, రుద్రుని, హరుని, అంతకాంతకుని, త్రిలోచనుని, శాంతమూర్తిని, ఆదిదేవుని, భవుని, సహస్రనామున్ని, అభయప్రదాతను, శివుని కనులార వీక్షించి, భక్తి ప్రపత్తులతో ఆ దేవదేవుని స్తుతించి, ప్రణమిల్లి, ఆ పరమాత్మ కరుణను పొందుదాము. ఈశ్వరుని అనుజ్ఞతో బంగారాన్ని త్రవ్వించి పెద్ద పెద్ద మూటలుగా కట్టిద్దాం. బంగారు మూటలను మోసి తెచ్చేవారిని కోకొల్లలుగా తీసుకురా. ఇద్దరం పార్వతీ ప్రాణవల్లభుని పాదసన్నిధికి పోయి తరిద్దాం. శంభుడు కృపాసముద్రుడు. మనల్ని తప్పక ఆదరిస్తాడు'' అన్న సంవర్తుని మాటలకు పరమానంద భరితుడైన మరుత్తుడు ముంజవంత పర్వతం వద్ద నుంచి, యజ్ఞవేదిక వద్దకు బంగారు మూటలను మోసుకొని తెచ్చే భారవహూలనెందరినో రప్పించాడు.

''అని పలికి యమ్మహాత్ముఁడు
గొనిపోవఁగఁబోయి శివునకుంఠిత కరుణన్
గనక మసంఖ్యము మోపులు
గొనివచ్చె నతండు మంచుకొండ యివుల్లకున్''

**-64 ప – ప్రథమాశ్వాసము – అశ్వమేధ పర్వము – మహాభారతము**

ఆవిధంగా చెప్పి సంవర్తుడు మరుత్తుని తన వెంట హిమవత్పర్వతం ఉత్తరభాగానికి తీసుకొని పోయాడు. పరమశివుని చూసిన ఆ ఇద్దరూ భక్తిపూర్వకంగా ఆ ఆదిదంపతులను స్తుతించి, అపారమైన శివుని కృపను పొందరు. అక్కడ వెలసిన బంగారాన్ని రాశులు రాశులుగా మూటలు కట్టించి, భటుల చేత మోయించుకుంటూ, ఆ హిమవత్పర్వతాన్ని దాటినవారై మరుత్తుని రాజధానీ నగరాన్ని చేరుకున్నారు. ఈవిధంగా సంవర్తుని తపశ్శక్తి వల్ల, పరమశివుని దయావిశేషం వల్ల మరుత్తుడు అశ్వమేధ యజ్ఞం చేయటానికి కావలసినంత బంగారాన్ని మోపులుగా కట్టించి తీసుకు రాగలిగాడు ఆ మహారాజు'' అని చెప్పటం ఆపాడు సూతమహర్షి.

వెంటనే శౌనకముని లేచి – ''మహాత్మా! అయితే మరుత్తుడు సంవర్తుని దయ చేత ఇంద్రుని ధనం కన్న మిక్కుటమైన ధనాన్ని బంగారు రూపంలో ఆర్జించాడన్నమాట! ఆయన యజ్ఞం ఇంక నిర్విఘ్నంగా జరిగినట్లే గదా!'' అని అడిగాడు. సూతుడు దానికి సమాధానంగా ''నాయనలారా! యజ్ఞ వివరమంతా రేపు సాకల్యంగా చెబుతాను. మీ సందేహాలనప్పుడు తీర్చుకొందురు గాని'' అని అంటూ ఆసనం నుంచి లేచాడు. ఆయనతో పాటు, మునులందరూ ఆశ్రమాల వైపు నడిచారు.

**(సశేషం)**

తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
దిశానిర్దేశము




స్వామివారి 700 దివ్యలీలలు
మొదటి సంపుటము
తెలుగు మరియు ఇంగ్లీష్ భాషలలో లభించును.
12 భాగాలు కల
పుస్తకము ధర : 250/-

ప్రచురణ: శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం
గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ - 500 007.
ఫోన్: 040-27175050 (10.00 am to 6.30pm)
website: srivenkatesham.org, mail: srivenkatesham@gmil.com

పై అడ్రస్ నుండి పుస్తకమును పొందవచ్చును. లేదా... పోస్టు / కొరియర్ ద్వారా పొందగోరువారు పుస్తకము ధరతో పాటు రూ. 150/- రిజిస్టర్ పోస్టు / కొరియర్ కొరకు కలిపి మొత్తం రూ. 400/- ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం ద్వారా 93482 12354 నంబర్‌కు పంపగలరు. మరియు మీ అడ్రస్‌ను ఇదే నంబర్‌కు వాట్సప్ / మెసేజ్ ద్వారా పంపి పొందవచ్చును.

శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం, హైదరాబాద్



# అన్నం పరబ్రహ్మ స్వరూపం

– చిల్లర సీతారామారావు

సర్వశక్తిమంతుడైన బ్రహ్మ సృష్టిని ప్రారంభించాడు. మొదట ఆకాశము, ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి నీరు, నీటినుండి భూమి, భూమి నుండి మొక్కలు, మొక్కల నుండి అన్నము, అన్నము నుండి ప్రాణులు ఉత్పన్నమైనాయి. భగవంతుడిచే సృష్టింపబడిన ధాన్యమే అన్నముగా ఏర్పడింది. అన్నము సమస్త భోగ్య పదార్థ రూపము. పంచమహాభూతాలచే నిర్మింపబడినదీ భౌతిక దేహము. భగవంతుడు చరాచర సృష్టిలో అందరికీ వారి వారి అభిరుచుల మేరకు ఆహారమును సృష్టించాడు.

శ్లో ॥ "దేవానామ్మృతం నృణా మృషీణాం చాన్నమోషధిః
దైత్య రక్షః పిశాచాదేర్దత్తం మద్యామిషాదిచ"

దేవతలకు అమృతమును, మానవులకు అన్నమును, ఋషులకు కంద పక్వ ఫలమూలాదులను, దైత్య, రాక్షస, పిశాచములకు మద్య మాంసాదులను భగవంతుడు సృష్టించాడు. అన్నము మాహాత్మ్యమును పురాణాలు, ఇతిహాసాలు, ఉపనిషత్తులు ఘనముగా ప్రశంసించాయి.

అన్నము పరబ్రహ్మ స్వరూపము అని, ప్రాణుల ప్రాణములు అన్నములోనే ప్రతిష్ఠితమై ఉన్నాయని, అన్నము సమస్త ధాతువులకు నిరంతరాభివృద్ధిని కలుగజేస్తుందని, అన్నము ద్వారానే ప్రాణులు ఉత్పన్నమవుతున్నాయని, సకల జగత్తు అన్నము మీదే ఆధారపడి యున్నదని, అందువలన అన్నము లక్ష్మీ జనార్దనుల స్వరూపము అని మత్స్యపురాణములోని ఈ క్రింది శ్లోకము ద్వారా తెలియుచున్నది.

శ్లో ॥ "అన్నం బ్రహ్మయుతః ప్రోక్తమన్నే ప్రాణాః ప్రతిష్ఠితాః
యజ్ఞాద్భవతి పర్జన్యో యజ్ఞకర్మ సముద్భవః"

ఉపనిషత్తులు కూడా అన్నమహత్త్వమును పేర్కొన్నాయి.

'అన్నం బ్రహ్మేతి' అనగా అన్నము బ్రహ్మస్వరూపము. 'అన్నం ననింద్యాత్' అన్నమును నిందించకూడదు. అన్నము, ప్రాణము, నేత్రము, శ్రోత్రము, మనస్సు, వాణి ఇవన్నీ బ్రహ్మ ప్రాప్తికి మార్గములు. ఈ లక్షణములు అన్నీ అన్నము వలనే పొందబడుతున్నాయి. సమస్త ప్రాణులు అన్నము వలన ఏర్పడిన వీర్యము వలన ఉత్పన్నమవుతున్నాయి. అన్నము ద్వారానే జీవితము రక్షింపబడుచున్నది. మరణానంతరము అన్నరూపమైన భూమియందే కలిసిపోతున్నది. అన్నమునకు సంస్కృతములో వ్యుత్పత్తి పరమైన అర్థము – 'అద్యతేఽత్తి, భూతాని' అనగా అన్నము ప్రాణుల ద్వారా భుజింపబడుచున్నది.

అన్నము కూడా ప్రాణులను తింటుంది. అందువలన సమస్త ప్రాణులకు భోజ్యము, భోక్త అయినందువలన 'అన్నము' అని పిలువబడుతున్నది. అన్నమును ఉపాసించువారికి అన్న కొరత అనునది ఉండదు. 'సర్వం వైతేఽన్నమాప్ను విన్తియేఽన్నం బ్రహ్మోపాసతే' అన్నమును ఉపాసించువారికి, జీవితమునకు అవసరమైన భోగములన్నీ ప్రాప్తిస్తాయి.

శరీరము అన్నముతో నిర్మింపబడింది. అన్నముతోనే పోషింపబడుతున్నది. కనుక అన్నమును పవిత్రభావముతో, బ్రహ్మప్రాప్తికి ద్వారముగా భావించాలి. అన్నమును ఉపాసించు వ్యక్తి అన్నమును ఎటువంటి పరిస్థితులలోనూ నిందించకూడదు. అన్నమును తినుటకు కూర్చున్న తరుణములో ఎటువంటి పదార్థమునైనా సరే, రుచిగా లేదనో, వాసన వస్తున్నదనో, చెడిపోయినదనో నెపము పెట్టి నిరాకరించకూడదు.అన్నమును గౌరవించి బ్రహ్మ భావముతో చూడాలి. సత్యయుగమున ప్రాణులు అస్థిగతులు, త్రేతాయుగమున ప్రాణులు మాంసగతులు, ద్వాపరయుగమున ప్రాణులు రుధిరగతులు, కలియుగమున ప్రాణులు అన్నగతులు అని పరాశర స్మృతి పేర్కొనుచున్నది. అన్నము లేకపోతే ప్రాణ నష్టము జరుగుతుంది. అన్నము లభించనప్పుడు ఎంతటి బలవంతుడయినను దుర్బలుడు కాక తప్పదు. అందువలననే దేవతలు, ఋషులు అన్నము మహత్యమును ప్రశంసిస్తున్నారు.

మనుష్యులు విభిన్న మనస్తత్వాలు కలవారు. వారి మనస్తత్వాలను బట్టి వారిని మూడు తరగతులుగా విభజించారు. మొదటిది సాత్త్వికులు, రెండవది రాజసులు, మూడు తామసులు. వారు భుజించే ఆహారము కూడా వారి మనస్తత్వాలను బట్టే ఉంటుంది. సాత్త్వికులకు ఆయువు, ఉత్సాహము, బలము, ఆరోగ్యము, సుఖమును, సంతోషమును కలిగించునది, మనస్సుకు ఇష్టమైనది, చమురుతో చేయబడినది, రుచిగలది, రసయుక్తమైనది, స్నిగ్ధమైనది, చూచుటకు మనోహరమైనది, చిరకాలము శరీరమునందు స్థిరముగానుండునది అయిన ఆహారము చాలా ఇష్టము. కారము, ఉప్పు, మిక్కిలి వేడి గలిగినది, పులుపు, చేదు కలిగినది, దాహము కలిగించునది, ఎండినది, రోగమును, దుఃఖమును కలిగించు ఆహారము రాజసులకు చాలా ఇష్టము. వండిన తరువాత ఒక జాము నిలువ యున్నది, రసరహితమైనది, దుర్గంధమును కలిగించునది, వండిన తరువాత ఒక రాత్రి గడిచినది, ఎంగిలి అయినది, అపవిత్రమైనది అగు భోజనము తామసులకు ప్రియమైన ఆహారము.

ప్రతి విషయములోను జాగ్రత్తలు తీసుకొంటున్నట్లుగానే అన్నము విషయములోనూ తీసుకోవాలి. అన్నమును భుజించుటకు ముందు కాళ్ళు, చేతులు, ముఖము శుభ్రముగా కడుక్కోవాలి.మనసులోనికిఎటువంటిభావమునురానివ్వకుండా ప్రశాంతముగా భుజించాలి. ప్రాణాధారమైన అన్నమునకు నమస్కారము చేయాలి. ఔపోసన చేసి విస్తరాకు చుట్టూ నీటిని వదలాలి. దీనివలన క్రిమికీటకాదులు దరిచేరవు. భోజనమును పలుమార్లు భుజించరాదు. రోజుకు రెండు పర్యాయములు (మధ్యాహ్నము, రాత్రి), సాధ్యమైనచో ఒక పర్యాయము భుజించుట ఆరోగ్యకరము. భోజనము, భోజనమునకు మధ్య చిరుతిండ్లు తినరాదు. ముఖ్యముగా పాటించవలసిన విషయము ఏమిటంటే అన్నమును అవసరమైనంతవరకే తినాలి. ఎక్కువగా పెట్టించుకుని పారవేయకూడదు. అలా పారవేస్తే బ్రహ్మస్వరూపమైన అన్నమును నిందించినట్లే యగుతుంది.

ప్రతి మనిషి తాను ఆచరించు కర్మలను బట్టి పాపపుణ్యములను ఆర్జించుకుంటాడు. పుణ్యఫలము స్వర్గమునకు, పాపఫలము నరకమునకు తీసుకొని పోతుంది. నరకము నుండి విముక్తిని పొందాలనుకుంటే పుణ్యకార్యములను తప్పనిసరిగా ఆచరించాలి. పూజ, వ్రతము, జపము, తపము, హోమము, దానము అని పుణ్యమును ఆరు విధములుగా విభజించారు. ఆరింటిలో దేనిని ఆచరించినను పుణ్యము ప్రాప్తిస్తుంది.

**శ్లో ॥ తపః పరం కృతయుగే త్రేతాయాం జ్ఞానముచ్యతే**
**ద్వాపరే యజ్ఞమిత్యాహుః దానమేవ కలౌయుగే"**

కృతయుగములో తపము, త్రేతాయుగములో జ్ఞానము, ద్వాపరయుగములో యజ్ఞయాగాదులు, కలియుగంలో దానం చేయడం మానవధర్మం అని శాస్త్రము తెలియజేస్తున్నది.

ఒక వస్తువు లేక పదార్థము మీద తనకున్న హక్కును వదులుకుని, ఇతరులకు ఆ హక్కులు కల్పించడమును దానం అని పిలుస్తారు. అనగా ఒకరు ఇచ్చిన దానిని మరొకరు స్వీకరిస్తే దానిని దానం అని అంటారు. 'దానమేవ గృహస్థానం'. గృహస్థులు తప్పక దానము చేయాలి అని పురాణం చెబుతున్నది. దానము చేయుట యందు నిర్లక్ష్యము పనికిరాదు. దానము చేయునప్పుడు ఆ దానమును ఎంతో శ్రద్ధగా, సంతోషముగా, అణకువగా, భక్తిగా, సంకల్ప పూర్వకముగా చేయాలి. అశ్రద్ధగా, అనాసక్తముగా చేయకూడదు. దానము చేయకపోవడం వలన దారిద్ర్యమును అనుభవించవలసి వస్తుంది.

**శ్లో ॥ "అదాన దోషేణ భలే ద్దరిద్రః దరిద్ర దోషేణ కరోతి పాపం**
**పాపాదవశ్యం నరకం ప్రయాతి పునర్దరిద్రః పునరేవపాపి"**

గత జన్మలో దానధర్మములు చేయకపోవడం వలన ఈ జన్మలో దారిద్ర్యము ప్రాప్తిస్తుంది. దారిద్ర్యము వలన బుద్ధి వక్రమార్గమున పయనిస్తుంది. దానివలన పాపకార్యములు చేయడం జరుగుతుంది. తత్ఫలితముగా నరకము ప్రాప్తిస్తుంది. పాపకార్యము లొనర్చుట వలన రాబోవు జన్మలో కూడా దరిద్రుడిగా పుట్టవలసి వస్తుంది. దారిద్ర్య జీవనం నిస్సారమైనది. పాపపు పనులు చేయడం వలన సంఘములో పరపతి నశిస్తుంది. ఈ బాధలు తొలగిపోవాలనుకుంటే దానధర్మములను తప్పక ఆచరించాలి.

దానము చేయాలన్న సంకల్పము కలిగినప్పుడు ఏదయిననూ దానము చేయవచ్చును. ఏ దానము చేయదలచుకున్ననూ దానము చేయు వస్తువు స్వార్జితమై ఉండాలి. స్వార్జితము కాకపోతే దానఫలము లభించదు. బంగారము, ధనము, భూమి మున్నగు వాటిని దానము చేసినప్పుడు, దానమును తీసుకొనువారికి తృప్తి, సంతోషము కలుగవు. ఇంకా ఇస్తే బాగుండును అన్న కోరిక మనసులో ఉంటుంది. దానము చేసినవాడు, దానమును స్వీకరించువాడు ఇరువురు తృప్తి చెందాలంటే ఒకే ఒక దానము ఉంది. అదే అన్నదానము.

**'సర్వాషేవ దానానా మన్నదానం విశిష్యతే'**

అన్ని దానముల కన్నా అన్నదానమే మిన్న.

**శ్లో ॥ "నాన్నదానత్వరం దానం కించిదస్తి నరేశ్వర**
**అన్నేన ధార్యతే కృత్స్నం చరాచర మిదం జగత్"**

అన్న దానము కంటే ఉత్తమమైన దానం మరియొకటి లేదు. ఈ జగత్తు లోని ప్రాణికోటి యంతయు అన్నము చేతనే సంరక్షింపబడుతున్నది. అన్నము లేనియెడల ప్రాణులు జీవించలేవు. కావున అన్నదాత ప్రాణదాత యగుచున్నాడు అని భీష్ముడు యుధిష్ఠిరునకు అన్నదానము గురించి తెలియజేశాడు. అన్నదానము చేయునపుడు పాత్రా పాత్రతల నెరిగి దానము చేయాలి. ఎందువలనంటే చేసిన అన్నదానము వలన కలిగిన శారీరక శక్తితో అతడు ఆచరించబోయే పాపపుణ్యాలలో సగభాగం అన్నదానం చేసినవాడికి చేరుతుంది. అయితే ఎంతటి పాపాత్ముడయిననూ, మరణావస్థలో నున్నప్పుడు తప్పనిసరిగా అన్నము పెట్టాలి. అలా అన్నము పెట్టినవాడు స్వర్గమున సకల సౌఖ్యములనుభవిస్తాడు.

అన్నదానము అత్యంత శ్రేష్ఠమైనది. దానితో సమానమైన దానము మరొకటి లేదు. ఆకలితో అలమటిస్తున్న వారికి అన్నం పెట్టడం వలన విశేష పుణ్యప్రాప్తి కలుగుతుంది. సకల భూతములకు తేజస్సును, ప్రాణమును ఇచ్చునది అన్నము. కాబట్టి అన్నదానము శ్రేష్ఠమైనది. ఆశ్రయము కోరి ఇంటికి వచ్చిన అతిథి నెవరినీ నిరాదరించి పంపకూడదు. అతిథుల కోసం ఎల్లప్పుడూ ఆహార పదార్థములను సిద్ధముగా ఉంచుకోవాలి. అన్నార్తులకు శ్రద్ధతో ఇవ్వబడిన అన్నము తిరిగి దాత దగ్గరకు వస్తుంది. అన్నార్తులను నిరాశ పరచిన వారికి అన్నము లభించదు. గృహమునకు ఏతెంచు అతిథిని దేవుడుగా భావించాలి. అతడిని ఆదరించి శ్రద్ధ, ప్రేమ, సత్కారములతో భోజనము పెట్టి సత్కరించాలి. అలా చేయడం గృహస్థ ధర్మం. ఇంటికి వచ్చిన అతిథికి ప్రతికూల భావమును వ్యక్తము చేయరాదు. ప్రతికూల భావమును ప్రదర్శించి అతిథికి అన్నము పెట్టకుండా భుజించినవారికి అన్నము లభించదు.

దుష్టులు, దుర్మార్గులు, అహంకారులు, కుటిలస్వభావులు మున్నగువారి వద్ద భోజనము స్వీకరించరాదు. వారి దగ్గర భుజించినచో బుద్ధి భ్రష్టుపడిపోతుంది. జ్ఞానము నశించిపోతుంది. దీనికి సంబంధించిన కథ ఒకటి జన బాహుళ్యములో ఉన్నది. కౌరవ పాండవుల మధ్య యుద్ధము ముగిసింది. భీష్ముడు అర్జునుని బాణముల చేత క్షతగాత్రుడై అంపశయ్య మీద పడి ఉన్నాడు. ధర్మరాజు తన సోదరులు, ద్రౌపది కృష్ణులతో వచ్చి భీష్ముణ్ణి దర్శించుకున్నారు. కృష్ణుడి సలహాతో భీష్ముడు ధర్మరాజుకు ధర్మబోధ చేయసాగాడు. దానిని గమనించిన ద్రౌపదికి నవ్వు వచ్చింది. ఆ నవ్వును గమనించిన భీష్ముడు తాను గావిస్తున్న ధర్మబోధను ఆపేశాడు. ద్రౌపదిని దగ్గరకు పిలిచి అడిగాడు. ద్రుపదరాజపుత్రీ! నీ నవ్వుకు కారణమేమిటి? అన్నాడు. ద్రౌపది బిడియపడుతూ నన్ను మన్నించండి మహాత్మా! అని క్షమాపణ కోరింది. ఆమె క్షమాపణ ఆయనకు సంతృప్తి కలిగించలేదు. ఆయన ద్రౌపదితో ఇలా అన్నాడు. కులసతులు పెద్దల దగ్గర, గురుజనుల దగ్గర అకారణముగా నవ్వరు. అలా నవ్వడం విజ్ఞత అనిపించుకోదు. నీవు గుణవంతురాలవు. సుశీలవు. నీ నవ్వు అకారణము అనిపించటంలేదు. బిడియము వీడి నిజము చెప్పుము అన్నాడు. ద్రౌపది చేతులు జోడించి నమస్కరిస్తూ ఇలా అన్నది. "పితామహా! మీరు ఆజ్ఞాపిస్తే నేను చెప్పకుండా ఎలా ఉండగలను. నేను ఎందుకు నవ్వానో తెలియజేస్తాను వినండి. మీరు ధర్మబోధ గావిస్తున్నారు. ఆ ధర్మబోధను వింటుంటే నా మనస్సు గతంలోనికి వెళ్ళిపోయింది. కౌరవ సభలో దుశ్శాసనుడు వస్త్రాపహరణ గావిస్తున్న సమయంలో ఈ ధర్మజ్ఞానము ఎక్కడికి వెళ్ళింది? ఆ సమయమున మీకు ధర్మజ్ఞానము లేకపోవచ్చు. ఈ ఆలోచన వచ్చినదే తడవుగా నాకు నవ్వు వచ్చింది. నన్ను మన్నించండి అన్నది. ద్రౌపది సమాధానమునకు భీష్ముడు శాంతిపూర్వకముగా సమాధానమిచ్చాడు. తల్లీ! నిన్ను క్షమించాల్సిన అవసరం లేదు. ధర్మజ్ఞానము నాకు ఇంతకు పూర్వము కూడా ఉండినది. అహంకారము, అన్యాయము, కుతంత్రము మున్నగు స్వభావములతో విరాజిల్లు దుర్యోధనుడి అన్నము భుజించుట వలన నా బుద్ధి మలినమైపోయింది. అందువలననే కౌరవ సభలో ధర్మమును సరిగా వ్యక్తీకరించలేకపోయినాను. ప్రస్తుతము అర్జునుడి బాణములు తగిలి నా శరీరము నందలి మలిన రక్తము వెళ్ళిపోయింది. శుద్ధ రక్తము తిరిగి వచ్చినందువలన ధర్మజ్ఞానము తిరిగి పునర్జీవితమైంది. ఆ శుద్ధ ధర్మజ్ఞానముతో ధర్మమును ఉపదేశిస్తున్నాను అన్నాడు.

ప్రాణాధారమైన అన్నమును ఎన్నడూ చులకనగా చూడకూడదు. అన్నము పరబ్రహ్మ స్వరూపము. కనుక అన్నమును సాత్త్విక దృష్టితో చూడాలి.


**శ్లో ॥ "పూజయే దశనం నిత్యమద్యాచ్చైతదకుత్సయన్**
**దృష్ట్వా హృష్యేత్ప్రసీదేచ్చ ప్రతినందేచ్చ సర్వేశః"**

అన్నము ముందర కూర్చోగానే ప్రథమముగా అన్నమునకు నమస్కరించాలి. అన్నమునకు ఎటువంటి వంకలు పెట్టకుండా,

నిందించకుండా భుజించాలి. భోజన సమయమున అధికముగా మాట్లాడకూడదు. పరనింద పనికిరాదు. నిందనీయమైన ప్రసంగములు చేయకూడదు. కారణాంతరముల చేత కలిగిన కలవరపాటును వదిలిపెట్టాలి. నిర్మల మనస్సుతో భుజించాలి. దైవప్రసాదమైన ఈ అన్నము ఎల్లప్పుడు నాకు లభించుగాక అని ప్రార్థించాలి. అలా ప్రార్థించి భుజింపబడిన అన్నము బలము, వీర్యము నొసంగుతుంది.

దానము చేయుట పుణ్యమే గాని వాటిలో అన్నదానము ముఖ్యమైనది. అన్నదానము చేయకపోతే మరణానంతరము భోజనము దొరకక అవస్థలు పడవలసి వస్తుంది.

శ్రీరాముడు శంబూకుడిని వధించిన తరువాత దేవతలతో కలిసి అగస్త్యుడిని చూడటానికి ఆయన ఆశ్రమమునకు బయలుదేరుతాడు. అగస్త్యుడు తన ఆశ్రమమునకు వచ్చిన రాముడికి అతిథి సత్కార్యములు గావిస్తాడు. బహుమతిగా ఒక దివ్యమైన ఆభరణమును బహూకరిస్తాడు. రాముడు ఆ దివ్య ఆభరణమును, దాని సౌందర్యమును పరికించి అగస్త్యుడిని అడుగుతాడు. ''మహాత్మా! మీకు ఈ దివ్యాభరణము ఎట్లు లభించింది? ఎవరు మీకు ఇచ్చారు? దయచేసి వివరించండి'' అన్నాడు. రాముని ప్రశ్నలకు సమాధానమిస్తూ అగస్త్యుడు ఆభరణ వృత్తాంతమును తెలియబరుస్తాడు. ఒకనాడు రాత్రి శయనించి, ఉదయముననే లేచి సమీపమున గల ఒక సరోవరమునకు వెళ్ళాను. సరోవరము దగ్గర ఒక శవము కనిపించింది. ఆ శరీరము బలిసి, జీర్ణము గాక పుష్టాంగమై శోభాయమానంగా ఉంది. ఆ శవమును గురించి ఆలోచిస్తున్న తరుణములోనే ఒక దివ్య విమానము అక్కడికి వచ్చింది. ఆ విమానము నుండి దివ్యాలంకార భూషితుడైన ఒక పురుషుడు అప్సరసలు సేవిస్తుండగా క్రిందికి దిగాడు. దిగగానే ఆ శవము దగ్గరకు వెళ్ళి,



తృప్తిగా తిని సరోవరము లోనికి వెళ్ళి ఆచమనమును గావించి విమానమును ఎక్కుటకు ఉద్యుక్తుడయ్యాడు. ఆ తరుణమున నేను అతడిని పలకరించాను. మీరెవ్వరు? ఇట్టి నిందితమైన ఆహారమును తినుటకు కారణమేమిటి? ఇలా దినుటకు కారణము ఉన్నచో తెలియజేయవలసిందిగా అడుగుతున్నాను. నిందితమైన ఇట్టి ఆహారమును తినుటకు ఎవరు సమ్మతిస్తారు? అందులోను నీవంటి దివ్యపురుషుడు ఇట్టి ఆహారమును తినడం నాకు చాలా ఆశ్చర్యమును కలిగిస్తున్నది. ఏది ఏమైనా నీకు ఇది తినదగిన ఆహారము కాదని నేను చెప్పగలను అన్నాడు. అగస్త్యుని మాటలకు ఆ దివ్యపురుషుడు చేతులు జోడించి తన వృత్తాంతమును వివరింపసాగాడు. పూర్వము విదర్భ దేశమును సుదేవుడు అనే రాజు పరిపాలిస్తూ ఉండెడివాడు. ఆయనకు ఇద్దరు భార్యలు. ఆ ఇరువురి భార్యల వలన ఇరువురు తనయులు జన్మించారు. ఒకడు శ్వేతుడు, రెండవవాడు సురథుడు. శ్వేతుడను పేరుగల నేను పెద్ద కుమారుడను. సుదేవుడి మరణానంతరం విదర్భ దేశమునకు రాజునై ధర్మమార్గము ననుసరించి పరిపాలించాను. ప్రజలందరూ సుఖముగా జీవించారు. విరివిగా దానధర్మములు గావించాను. అల్పమని భావించి అన్నదానమును గావించలేదు. వృద్ధావస్థ యందు తమ్ముడు సురథుడిని రాజుగా అభిషేకించి అరణ్యమునకు పోయి తపము గావించాను. తపఃకారణముగా లభించిన పుణ్యముతో పాటు బ్రహ్మలోకమునకు చేరుకున్నాను. బ్రహ్మలోకమున నాకు సుఖ సౌఖ్యములు ప్రాప్తించిననూ, ఆకలి దప్పులు నన్ను బాధపెట్టసాగాయి. బ్రహ్మ దగ్గరకు పోయి – దేవా! నీ లోకమున నాకు ఈ ఆకలి దప్పుల బాధ యేమిటి? నేనేమి పాపము చేశాను? విరివిగా దానధర్మములను గావించానే? ఎందులకు నాకీ శిక్ష? దయచేసి నన్ను రక్షించు. నా ఆకలిబాధ తీర్చు అని ప్రార్థించాను. బ్రహ్మ సమాధానమిస్తూ ''శ్వేతా! నీవు దానధర్మములు గావించిన మాట వాస్తవము. అందువలననే నీకు బ్రహ్మలోక ప్రాప్తి కలిగింది. అయితే తుచ్ఛము, అల్పము అని భావించి అన్నదానము తప్ప ఇతర దానములను గావించావు. ఇతర దానముల వలన బ్రహ్మలోకము, అన్నదానము చేయకపోవడం వలన ఆకలి దప్పులు నీకు ప్రాప్తించాయి. ప్రస్తుతం నీ ఆకలి బాధలు తీరవలెనంటే ఒకటే మార్గమున్నది. పుష్టిగా రుచికరముగా నున్న నీ శరీరమే నీ ఆకలిని తీర్చగలదు. అగస్త్య మహర్షి దర్శనముతో నీ కష్టములన్నీ తొలగిపోతాయి అని పలికాడు. ప్రతిరోజూ ఇక్కడికి వచ్చి నా ఆకలిని తీర్చుకుని పోతుంటాను. అగస్త్య మహర్షి దర్శనము ఎప్పుడు కలుగుతుందా అని ప్రతీక్షిస్తున్నాను'' అని ఆ దివ్యపురుషుడు అగస్త్యునకు తన వివరములు తెలియజేశాడు. అగస్త్యుడు అతడితో నేను అగస్త్యుడను. నీ కష్టములను నేను తొలగిస్తాను అని అభయమిచ్చాడు. ఆ మాటలకు ఆనందించిన ఆ దివ్యపురుషుడు మహర్షీ! నా దగ్గర ఒక దివ్య ఆభరణము ఉన్నది. ఈ ఆభరణము

ప్రతి దినము సువర్ణమును, ధనమును, వస్త్రములను, భక్ష్య భోజ్యములను, ఆభరణములను ఇస్తూ ఉంటుంది. ఈ దివ్యమైన ఆభరణమును మీకు అర్పిస్తున్నాను. అంతేకాదు మీ కోరికలను తీర్చెదను. సమస్త భోగములను ఇచ్చెదను. నన్ను కరుణించి తరింప చేయవలసిందిగా ప్రార్థిస్తున్నాను అని వేడుకొనసాగాడు. అతడిని కష్టముల నుండి బయటపడవేయవలెనన్న ఉద్దేశ్యముతో అగస్త్యుడు ఆ ఆభరణమును గ్రహించాడు. ఆభరణమును గ్రహించిన వెంటనే ఆ దివ్యపురుషుని దివ్యదేహము నశించింది. ఆ దేహము నశించగానే పరమానందముతో బ్రహ్మలోకమునకు వెళ్ళిపోయాడు. రామా! ఆ దివ్యపురుషుడు ఇచ్చిన ఆభరణమును నీకు అర్పించాను అని అగస్త్యుడు రాముడితో పలికాడు.

**శ్లో ॥ "అన్నాదః ప్రాణాదః ప్రోక్తః ప్రాణ దశ్చాపి సర్వతః**
**తస్మాదన్న ప్రదానేన సర్వదానఫలం లభేత్"**

అన్నము వలననే ప్రాణము నిలబడుతుంది. కాబట్టి అన్నము పెట్టినవాడు ప్రాణము పోసినవాడితో సమానముగా చెప్పబడుతున్నాడు. ప్రాణమును మించినది లేదు. కనుక ప్రాణమును నిలిపే అన్నదానము వలన సమస్త దానములు చేసినంత ఫలము లభిస్తుంది. భక్తి శ్రద్ధలతో అన్నదానము గావించినట్లయితే ఇహ పర లోకముల యందు సమస్త శుభములు చేకూరుతాయి.

**శ్లో ॥ అన్నదాః ప్రథమం యాంతి సత్యవాక్ తదనంతరం**
**ఆయాచిత ప్రదాతా చ సమం యాంతి త్రయోజనాః"**

అన్న దాతల గురించి వేదవ్యాస మహర్షి – స్వర్గము మున్నగు ఉత్తమ లోకములకు అందరికన్నా ముందుగా అన్నదానము చేయువారు వెళతారు. పిదప సత్యవాదులు వెళతారు. తదనంతరము అడగకుండానే స్వచ్ఛందంగా దానమిచ్చువారు వెళతారు. ఈ ముగ్గురు పుణ్యాత్ములు సమాన స్థాయిని పొందుతారు అని తెలియజేశారు.

స్వార్జిత ధనముతో పేదలకు అన్నదానము లొనర్చి ఇహ పర లోకములలో సుఖ సౌఖ్యములను కైవసం చేసుకుందాం.

# రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.


ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

## రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com



# వ్యాస పూర్ణిమ

- కౌతా నిర్మల

బ్రహ్మాండ పురాణంలో వ్యాసపూర్ణిమను గురించి తెలియచేసే కథ ఉంది. ఆ కథను నారదుడు వైశంపాయనునికి వివరించినట్లుగా చెప్పబడింది. పూర్వం కాశీలో వేదనిధి, వేదవతి అనే దంపతులు నివసించేవారు. వారు ఎంతో పేదవారు. వారికి ఎంతకాలం గడిచినా సంతానం కలగలేదు. తమకు బిడ్డలు పుట్టలేదన్న బాధ ఆ దంపతులను అమితంగా వేధించేది. ప్రతిరోజూ మధ్యాహ్న సమయంలో వ్యాసమహర్షి మారురూపంలో రహస్యంగా వచ్చి గంగానదిలో స్నానం చేస్తారనీ, ఆయనను దర్శించమనీ ఎవరో వేదనిధికి చెప్పారు. వేదవ్యాస మహర్షిని దర్శించగలిగే భాగ్యం తనకు కలిగినందుకు వేదనిధి మనస్సు ఉప్పొంగిపోయింది. వ్యాసమహర్షిని దర్శించి తనకు సంతానభిక్షను ప్రసాదించమని కోరితే ఆయన అనుగ్రహంతో ఆయన వాక్కు ఫలించి తమకు సంతానం కలుగుతుందని పరిపూర్ణంగా నమ్మాడు వేదనిధి.

మర్నాటి మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉన్నా లక్ష్యపెట్టకుండా కాలినడకన గంగానదీ తీరానికి చేరుకున్నాడు. వ్యాసమహర్షి రాక కోసం నిరీక్షించసాగాడు వేదనిధి. అలా కొంతసమయం గడిచిన తరువాత వ్యాసుడు దండాన్ని చేతిలో ధరించి, భిక్షుక రూపంలో గంగ వద్దకు వచ్చాడు. వేదనిధి ఆయన వద్దకు చేరుకుని ఆయన పాదాల మీద వాలిపోయాడు. ఆయనకు సాష్టాంగ నమస్కారం చేశాడు. ఆ భిక్షుకుడు కోపాన్ని ప్రదర్శిస్తూ "నువ్వెవరు? ఎందుకిలా చేస్తున్నావు? నా దారికి అడ్డు తగులుతున్నావెందుకు? నా పాదాలు వదిలి ఇక్కడనుంచి తొలగిపో, నా దారిన నన్ను వెళ్ళనీ" అంటూ గద్దిస్తూ అన్నాడు.

ఆయన కోపానికి బెదరలేదు వేదనిధి.

"మహాత్మా! మీరు విష్ణు అంశతో జన్మించిన వేదవ్యాసులే అని నాకు తెలుసు. 'వ్యాసాయ, విష్ణురూపాయ, వ్యాసరూపాయ విష్ణవే' అన్నారు. మీ పాదాలకు నమస్కరించుకునే భాగ్యం నాకు లభించడం నా అదృష్టం. నన్ను కరుణిస్తానని చెప్పండి. మీరు అనుగ్రహిస్తానని చెబితే తప్ప మీ పాదలను వదలను" అంటూ ఆయన పాదాలను తన కన్నీటితో అభిషేకించసాగాడు వేదనిధి.

తన పాదాలను వదలని ఆ వ్యక్తి పట్ల ఏర్పడిన కోపం తొలగిపోయి ప్రసన్నత ఏర్పడింది. "నీకేం కావాలో అడుగు" అన్నాడు వ్యాసుడు.

"స్వామీ! రేపు మా తండ్రి గారి ఆబ్దీకం చేస్తున్నాను. మీరు బ్రాహ్మణులుగా మా ఇంటికి దయచేయాలి. మా గృహాన్ని మీ పాదాలతో పావనం చేయాలి" అన్నాడు వేదనిధి ఎంతో వినయంగా.

ఆయన వేదనిధి కోరికను అంగీకరించి "నేను వేదవ్యాసుడిని అన్న విషయాన్ని నువ్వు ఎవరికీ చెప్పకూడదు. ఆ విషయాన్ని రహస్యంగా ఉంచాలి" అని చెప్పాడు వేదవ్యాసుడు

'తానా విషయాన్ని ఎవరికీ తెలియచేయనని' మాట ఇచ్చాడు వేదనిధి. వ్యాస మహర్షి తమ ఇంటికి రావటానికి అంగీకరించినందుకు మహదానందం చెందాడు వేదనిధి.

వ్యాసమహర్షి ఆశీర్వాదం పొందిన వేదనిధి తన గృహానికి చేరుకుని జరిగిన విషయాలన్నీ వేదవతికి తెలియజేశాడు. వేదవ్యాస మహర్షి తమ ఇంటికి వస్తున్నందుకు ఆమె అమితానంద పడింది. మర్నాడు వేకువనే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని, గంగానదిలో స్నానం చేసి, శుచియై ఎంతో శ్రద్ధగా, రుచిగా ఆహార పదార్థాలను వండింది. శ్రాద్ధానికి తగిన ఏర్పాట్లు చేశారు. ఆ దంపతులు వ్యాసుని రాకకై ఎదురు చూడసాగారు. భిక్షుక రూపంలో వ్యాస మహర్షి వచ్చాడు. ఆయనకు ఎదురేగి వినయంగా నమస్కరించారు వేదనిధి, వేదవతి. వ్యాసుడు తృప్తిగా శ్రాద్ధ భోజనాన్ని ఆరగించాడు.

ఆ దంపతుల వినయానికి, వారి భక్తికీ సంతసించిన వ్యాసమహర్షి వారిపట్ల ప్రసన్నుడై, "మీకు గుణవంతులు, ఐశ్వర్యవంతులు అయిన పదిమంది పుత్రులు జన్మిస్తారనీ, మీరు ఈ లోకంలో సుఖంగా జీవించి అంత్యదశలో మరణించిన తర్వాత వైకుంఠం చేరుకుంటారనీ ఆశీర్వదించి, తాను ఆ గృహాన్ని వదిలి వెళ్ళటానికి సిద్ధపడ్డాడు వ్యాసమహర్షి.

"స్వామీ! మీ దర్శన భాగ్యాన్ని తిరిగి మాకు ఎప్పుడు ప్రసాదిస్తారు?" అని అడిగాడు వేదనిధి.

అప్పుడు వ్యాసుడు "వేదనిధీ, వేదాలను క్షుణ్ణంగా అభ్యసించి, వాటి అర్థాలను, పురాణాలను పఠించి వాటిని చక్కగా గ్రహించి, వాటిని వివరించగలిగిన ప్రతి పౌరాణికునిలో నన్ను దర్శించవచ్చు. ఏ పండితునికయినా నా అనుగ్రహం లేకుండా వేదాలలోని, పురాణాలలోని రహస్యాలు, అర్థాలు బోధపడవు. కనుక మహాపండితులైన పౌరాణికుని నా అంశగా, నా రూపంగా తలచి పూజించండి. ఆషాఢ శుద్ధ పౌర్ణమి నాడు, వ్యాస పూజ చేసి వారిని గురువుగా భావించి వారికి నూతన వస్త్రాలను, కానుకలను, దక్షిణ తాంబూలాలను సమర్పించి, వారి ఆశీర్వాదం పొందండి. మీకు నా అనుగ్రహం తప్పకుండా లభిస్తుంది" అని చెప్పాడు.

నారదుని ద్వారా ఈ వ్యాసమహర్షి కథను తెలుసుకున్న వైశంపాయనుడు ఆయననే గురువుగా భావించి, ఆయననే పూజించినట్లుగా బ్రహ్మాండపురాణంలో తెలుపబడింది.

★ ★ ★

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**

## 313. నాగపత్నీ స్తుతి ప్రీతాయ నమః

– కాళీయుని భార్యలు చేసిన స్వపతి రక్షణార్థమైన స్తోత్రము చేత ప్రీతి నొంది వారి కోరికను తీర్చినవాడు – కృష్ణుడు. కాళియుని భార్యలు అతని తలలపై – పడగలపై – నిల్చొని కృష్ణుడు తాండవ నృత్యము చేయుచుండగా అతని పాద ఘట్టములకు కాళియుని పడగలు శిథిలములయినవి. కాళియుని దుస్థితిని చూచి అతని భార్యలు ఆక్రందించుచు వచ్చి కృష్ణుని

**ఎట్టి తపంబు చేసెనొకొ యెట్టి సుకర్మము లాచరించెనో**
**యెట్టి నిజంబు బల్కెనొకొ యీ ఫణి పూర్వ భవంబునందుము**
**న్నెట్టి మహానుభావులకు నెన్నడు జేరువగాని నీవు నే**
**డిట్టి వినోదలీల దలలెక్కి నటించెద వీ ఫణీంద్రు పై ||** - భాగవతము – 10, పూర్వ – 674

–ఈ సర్పరాజు పూర్వజన్మలో ఎట్టి తపస్సు చేసినాడో, ఎట్టి మంచి కర్మలు చేసినాడో, ఎట్టి నిజంబు పల్కెనొ, నీవు ఎట్టి మహానుభావులకు ఎన్నడు దగ్గర చేరని వాడవు. నేడు వినోద లీలగా కాళియుని పడగలపై ఎక్కి నృత్యము చేయుచున్నావు. ఏ వ్రతము చేయకనే యీ సర్పము నీ పాదముల దెబ్బకు గురి అయింది. ఇది అద్భుతముగా నున్నది.


**మమ్ము బెండ్లి సేయుమా ప్రాణ వల్లభు**
**ప్రాణమిచ్చి కావు భక్త వరద!**

అని కాళియుని భార్యలు కృష్ణుని పతి భిక్ష పెట్టమని ప్రార్థించారు. ఇట్లు తమ భర్త కాళియుని బ్రతుకు కోరెడి సర్పము యొక్క భార్యలందు శరణాగత వత్సలుడైన కృష్ణుడు కరుణించి కాళియుని పడగలపై నృత్యము చేయుటను చాలించినాడు. వారికి పతి భిక్ష ప్రసాదించినాడు.

నాగపత్నుల స్తోత్రమునకు ప్రీతుడైన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 314. ప్రలంబాసుర ఖండనాయ నమః

ఒక వేసవి కాలమున ఒకనాడు బలరామకృష్ణులు తోడి బాలురతో కూడి వనము నందు గోవులను మేపుచుండిరి. అప్పుడు ప్రలంబుడు అను రాక్షసుడు వారిని హతమార్చదలచి, గోపాలుని రూపములో వారి కడకు వచ్చినాడు. సర్వజ్ఞుడైన కృష్ణుడు అతనిని చూచినంతనే ఇతడు రాక్షసుడు అని గుర్తించాడు. అయినను అతని స్నేహమునకు ఆమోదించినాడు. అంతేకాక ఆ రాక్షసుని చంపుటకు తగిన ఉపాయమును కూడా ఆలోచించినాడు. కృష్ణుడు గోపబాలురను పిలిచి నేడు మనము రెండ్లు జట్టుగా ఏర్పడి ఆటలాడుదమని చెప్పినాడు. గోపబాలురలో కొందరు కృష్ణుని పక్షమున కొందరు బలరాముని పక్షమున చేరినారు. రెండు జట్ల వారును గడ్డితో, కర్రలతో, రాళ్ళతో గుర్తులు పెట్టుకుని వాటిని బంతులతోనో రాళ్ళతోనో గురి చూచి కొట్టవలెను. అప్పుడు ఆ గుర్తులను కొట్టలేక ఓడిపోయిన వారు, ఆ గుర్తులను కొట్టి జయించిన వారిని ఒక నిర్దిష్ట దూరము వరకు మోయవలెను అని ఒక నియమమును ఏర్పరచుకొనిరి. ఆ నియమము ప్రకారము ఆటలలో ఓడినవారు గెలిచినవారిని మోయుచు క్రీడింపసాగిరి. ఆ సమయమున కృష్ణుడు ప్రలంబాసురుని పన్నాగమును గూర్చి అన్నకు తెలిపినాడు. పిమ్మట కృష్ణ బలరాములు ముందు నడువగా మిగిలిన వారందరు గోవులను మేపుకొనుచు 'భాండీరకము' అను ఒక మర్రిచెట్టు క్రిందికి చేరినారు. అక్కడి ఆటలో బలరాముని పక్షము వారు అనగా





**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

బలరాముడు, శ్రీదాముడు, వృషభుడు మొదలగు వారు విజేతలయిరి. అంతట ఓడిపోయిన పక్షమునకు చెందిన కృష్ణుడు మొదలగు వారు గెలిచిన బలరాముని పక్షములోని వారిని తమ వీపులపై ఎక్కించుకొనిరి. ఓటమి పాలైన పక్షములో ఉన్న కృష్ణుడు శ్రీదాముని, భద్రసేనుడు వృషభుని, ప్రలంబుడు (రాక్షసుడు) బలరాముని మోసినారు. క్రీడా పక్షములు ఏర్పడునపుడే ప్రలంబాసురుడు ఇట్లు ఆలోచించినాడు బలరాముని జట్టులో చేరినచో ఓటమి పాలైనప్పుడు అవతలి జట్టుకు నాయకుడైన కృష్ణుని మోయవలసిన అవసరము రావచ్చును. కృష్ణుని మోయుట అసాధ్యము. కృష్ణుని పక్షమున చేరినచో అవసరమగుచో బలరాముని మోయుట సులభము అని ఊహించి ప్రలంబుడు (రాక్షసుడు) కృష్ణుని పక్షమున చేరినాడు. ఇప్పుడు ఓడిన జట్టులో ఉన్న ప్రలంబుడు బలరాముని తన వీపుపై ఎక్కించుకుని మోయుచు, దింపవలసిన స్థలము వచ్చినను ఆగక, ఆ హద్దును దాటి వేగముగా ముందుకు సాగిపోయినాడు.

సామాన్య గోపాలుని రూపములో ఉన్న ప్రలంబుడు అతి బరువుగా ఉన్న బలరాముని మోయలేక పోవుచుండెను. ఆ స్థితిలో అతని వేగము తగ్గింది. వెంటనే అతడు రాక్షసుడుగా మారినాడు. ఆకాశమున కెగిరినాడు. రాక్షస రూపమున ఆకాశమున సాగి పోవుచున్నాడు. ప్రలంబాసురుని భయంకర రూపమును చూచి బలరాముడు మొదట భయముతో చలించి మరుక్షణములో తన అసాధారణ శక్తి సామర్థ్యములను గుర్తుకు తెచ్చుకుని ప్రలంబాసురుడు తనను దూరముగా తీసుకుపోవుటను గమనించి కోపముతో వజ్రాయుధము వంటి దృఢమైన తన పిడికిలి పోటుతో ఆ రాక్షసుని మాడుపై గట్టిగా దెబ్బ వేసినాడు.

బలరాముని ముష్టి ఘాతముతో చావు దెబ్బ తినిన ఆ రాక్షసుని తల బ్రద్దలయింది. అతడు నోటినుండి రక్తము గ్రక్కుచు స్పృహ కోల్పోయినాడు. అప్పుడు ఆ ప్రలంబాసురుడు భయంకరముగా అరుచుచు ప్రాణములు కోల్పోయి నేల కూలినాడు.

మిగుల పరాక్రమశాలి అయిన బలరాముని చేతిలో ప్రలంబాసురుడు నిహతుడగుటను చూచి గోపబాలురు ఆశ్చర్యపడి, బలరాముని కొనియాడినారు. బలరాముడు తోటి గోపబాలురతో కలిసి సంతోషముగా అందరు గోవులతో బృందావనము చేరినారు.

బలరాముడు ప్రలంబాసురుని చంపిన వైనమును పోతన

**కదువడి దను బెనగొని వడి**
**జనియెడు దనుజు శిరము వ్రయ్య హల ధరుం**
**డదరి పటు చటుల తరమగు**
**పిడికిట వెస విసరి పొడిచె బిరుసున నలుకన్** - భాగ. 10 – పూర్వ. – 734
**హలుధరు బలుపిడికిటి హతి**
**దల పగిలిన రుధిరజలము తను వివరములం**
**దొలక మొరయిడుచు దనుజుడు**
**బలరిపు పవినిహత నగము పగిదిం బడియెన్** - భాగ. 10 - పూర్వ – 735

–తనను మోయుచు వడిగా వెళ్ళుచున్న రాక్షసుని (ప్రలంబుని) తల పగులునట్లుగ మిక్కిలి దృఢమైన తన పిడికిటితో గట్టిగా కోపముతో బలరాముడు కొట్టినాడు. (734) బలరాముని బలమైన పిడికిటి దెబ్బతో ప్రలంబాసురుని తల పగిలి రక్తము కారుచుండగా మొరపెట్టుచు ఇంద్రుని వజ్రాయుధముచే నేల కూలిన పర్వతము వలె ప్రలంబాసురుడు నేలబడినాడు. (735) బలరాముడు విష్ణుదేవుని దశావతారములలో ఒకడు కనుక విష్ణుదేవుని అర్చావతారమైన వేంకటేశునకు కూడా అన్వయించింది. ప్రలంబాసురుని చంపిన బలరామునిగ జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

- రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

అందరూ వెళ్ళారు. ప్రస్రవణగిరి మీద మిగిలింది ముగ్గురు. రామ లక్ష్మణ సుగ్రీవులు. వీరులతో చెప్పిన మాటలు విన్నాడు రాముడు. అంటున్నాడు సుగ్రీవునితో. ''ఈ సమస్త భూమండలంలోని విశేషాలు చెప్పావు. అవి నీకెలా తెల్సు?'' అది రాముని సందేహం.

## తిరుగు ప్రయాణం

వానర నాయకులు సీతాన్వేషణలో నిమగ్నులైనారు. వారి వారి వానరులతో అమిత వేగంతో వెదకసాగారు. మహారణ్యాలు వెదికారు. మహాపర్వతాల్లో వెదికారు. నదీతీర ప్రాంతాల్లో వెదికారు. వనాలు లతాగృహాల్లో వెదికారు. నగరాలు పట్టణాలు పల్లెలు గాలించారు. పచ్చిక బయళ్ళని కూడా వదిలిపెట్టలేదు. సీతాదేవి కనిపించలేదు. రావణుని జాడలేదు. పగలంతా వెదకడం, రాత్రికి ఒకచోట చేరడం, చెట్లమీద పడుకోవడం అది వారి దినచర్య. ఆశ నిరాశ అయింది. గడువు కాలం దగ్గర పడింది. వినతుడు సేనలతో తిరిగి వెళ్ళాడు. ప్రస్రవణగిరి చేరాడు. అలాగే శతవలి సుషేణుడు తమ సేనలతో తిరిగి వచ్చేశారు. దక్షిణానికి వెళ్ళిన సేనలు తిరిగి రాలేదు. హనుమంతుడు వాయుసుతుడు మహాత్ముడు శక్తిశాలి మైథిలిని చూస్తాడు. అది ముగ్గురు నాయకుల నమ్మకం. ఆ మాట తెలియచెప్పాడు సుగ్రీవునికి.

దక్షిణ దిశలో వెళ్ళిన వారిని వర్ణించాడు వాల్మీకి. అంటే ఆ సేనలో హనుమంతుడు ఉన్నాడు. అందుకే ఆ దిశలోని చర్యల్ని విపులంగా వర్ణించాడు. హనుమంతుని ప్రోత్సహించాడు సుగ్రీవుడు. అంగదుడు తారుడు తక్కిన వీరులతో వెళ్ళాడు మారుతి. వింధ్య పర్వతం చేరారు. గుహల్లో వెదికారు. నదీతీరాల్లో వెదికారు. సాగర సమీపాల్లో వెదికారు. వివిధ దేశాలు గాలించారు. మైథిలి జాడలేదు. దొరికిన కందమూలాలు తింటున్నారు. తిరుగుతున్నారు, వెదుకుతున్నారు.

## కండు మహర్షి

పోగా పోగా ఒక ప్రదేశం చేరారు. చెట్లున్నాయి. ఆకుల్లేవు. పూలు లేవు. కాయల్లేవు. పండ్లులేవు. నదులున్నాయి. నీళ్ళు లేవు. సరోవరాలున్నాయి. ఒక్క చుక్క నీరు లేదు. తామరపూలున్నాయి. మంచి వాసనలున్నాయి. ఒక్క తుమ్మెద లేదు. ఒక్క పక్షి లేదు. ఒక్క జంతువు లేదు. ఓషధులు పెరిగిన సూచనలున్నాయి. ఒక్కటీ జీవంతో లేదు.

ఆ దేశం నిర్మానుష్యం. ఆ ప్రాంతంలో ఒక మహర్షి ఉండేవాడు. పేరు కండుడు. అతడు మహాత్ముడు. సత్యవాది.

తపో బల సంపన్నుడు. అయితే అతను కనిపించలేదు. అతనికి ఒక కొడుకు. పదహారేళ్ళవాడు చనిపోయాడు. దేశ ప్రజలు పిల్లవానికి సాయపడలేదు. వైద్యులు సహకరించలేదు. తనకి తెలిసిన ఓషధులు ఉపయోగపడలేదు. మహర్షికి కోపం వచ్చింది. ఏ ఒక్కటీ ప్రాణంతో ఉండరాదు. అది కండుమహర్షి శాపం. అందుకే ఆ ప్రాంతం అలా ఉంది.

విస్మయం చెందారు వానర వీరులు. ముందుకు కదిలారు. ఓ పర్వతం కనిపించింది. ఎక్కారు. కొండ గుహలన్నీ వెదికారు. సీతమ్మ కనిపించలేదు కానీ ఓ రాక్షసుడు కనపడ్డాడు. పర్వతాకారుడు. మహాభయంకరుడు. వాడే రావణుడు అనుకున్నారు. కొండలా నిలిచాడు. చూశాడు వానరుల్ని. 'చచ్చారు పో' అన్నాడు. వారి మీద పడబోయాడు. దెబ్బకి నెత్తురు కక్కాడు. చచ్చాడు వాడు. రావణుడు చనిపోయాడనుకున్నారు. విజయోత్సాహంతో పొంగిపోయారు. సీతాదేవి ఉంటుందని వెదికారు. ఎక్కడా కనిపించలేదు. ముందుకెళ్ళారు. అడవి వచ్చింది. లోపలకెళ్ళారు. అన్వేషించారు. నిరాశ చెందారు. అందరూ ఓ చెట్టు దగ్గర ఆగారు.

## గడువు తీరింది

అంగదుడు ప్రాజ్ఞుడు. అంటున్నాడు వానరులతో. "మనం ఎన్నోచోట్ల వెదికాం. జనకాత్మజ జాడ కానరాలేదు. రావణుడు కనపడలేదు. నెల పూర్తయింది. గడువు ముగిసింది. సుగ్రీవుడు చండశాసనుడు. కోపిష్టి. అతనికి భయపడాలి మనం. రామకార్యం మనది. ఆ మహాత్మునికి భయపడాలి. బద్ధకించరాదు. నిరుత్సాహ పడరాదు. అలసత్వం పనికిరాదు. సీతాదేవి కనపడేవరకు వెదుకుదాం".

**అనిర్వేదం చ దాక్ష్యం చ మనసశ్చా పరాజయం ।**
**కార్యసిద్ధి కరాణ్యాహుః తస్మాదేతత్ బ్రవీమ్యహమ్ ॥**

"విరక్తికి లోను కావద్దు. ఉత్సాహం ధైర్యం కార్యసిద్ధికి ముఖ్యం అంటారు పెద్దలు. విసుగు లేకుండా మళ్ళీ వెదుకుదాం. మన కృషి వృథా కాదు. ఫలం లభిస్తుంది. ఇది మన మంచికే చెబుతున్నాను. ఇది నా అభిప్రాయం. ఇష్టమైతే చేద్దాం. లేదా మరో దారి ఉంటే చెప్పండి".

విన్నాడు గంధమాదనుడు. "అంగదుడు చెప్పాడు. అది ఆచరణ సాధ్యం. హితకరం. అతడు చెప్పినట్లు చేద్దాం. గిరులు గుహలు కొండచరియలు లోయలు అడవులు నదీతీరాలు ప్రతి అంగుళం జల్లెడ పడదాం".

## ఋక్షబిలం

హనుమంతుడు, గజుడు, గవాక్షుడు, శరభుడు, గంధమాదనుడు, మైందుడు, ద్వివిదుడు, సుషేణుడు, జాంబవంతుడు, యువరాజు అంగదుడు బాగా అలసిపోయారు. ఆకలి వేస్తోంది. దాహంగా ఉంది. నీళ్ళకోసం వెతుకుతున్నారు. అంతలో ఒక పర్వతబిలం కనిపించింది. అది మయుడు నిర్మించాడు. దాన్నే ఋక్షబిలమంటారు. లోపల నీళ్ళుంటాయనుకున్నారు. ఆశతో బిలం వైపు వెళ్ళారు. లతలు ఉన్నాయి. చెట్లు ఉన్నాయి. లోపలికి పోవడం కష్టంగా ఉంది. హంసలు, సారసపక్షులు కనిపించాయి. వాటి రెక్కలు తడిసి ఉన్నాయి. బిలంలోంచి బయటికి వస్తున్నాయి. చూశారు అందరూ సుగంధ వాసనలు కూడా వస్తున్నాయి. అది పాతాళానికి దారేమో. బలిచక్రవర్తి ఉంటాడేమో అనుకున్నారు. బిలం భయంకరంగా ఉంది. నీళ్ళున్నాయని తెల్సింది.

ఎక్కడికైనా పోతాడు హనుమంతుడు. అందరినీ చూశాడు. "మనం అలసిపోయాం. దాహం అధికంగా ఉంది. హంసలు క్రౌంచపక్షులు చక్రవాకాలు ఈ బిలం నుండి బయటకు వస్తున్నాయి. కనుక బిలంలో జలం సమృద్ధిగా ఉంటుంది. అది బావి కావచ్చు. కొలను కావచ్చు" అన్నాడు. బిలం లోకి అడుగు పెట్టాడు. అందరూ అనుసరించారతణ్ణి. లోపలికి పోతున్న కొద్దీ కటిక చీకటి. దారి తప్పరాదు. ఒకరి చేయి ఒకరు పట్టుకున్నారు. నెమ్మదిగా నడుస్తున్నారు. వాళ్ళ కనులు పనిచేయలేదు. అలా ఆ గాఢాంధకారంలో ఒక యోజనం వెళ్ళారు. దప్పిక ఎక్కువైంది. నీరసపడ్డారు. అయినా ధైర్యం కోల్పోలేదు. ప్రాణాల మీద ఆశ పోయింది. అయినా నడక ఆగలేదు. ముందుకు పోగా పోగా కొంచెం వెలుతురు కనిపించింది. ఉత్సాహం వచ్చింది. అడుగులు వేగంగా పడ్డాయి. కనులు పని చేశాయి. అందమైన ప్రదేశం కనిపించింది.

ధగధగలాడే బంగారు చెట్లు, మద్దిచెట్లు, తాటిచెట్లు, అశోక చెట్లు, చంద్రచెట్లు, కొండగోగు చెట్లు. బంగారు రంగులో పూలగుత్తులు, ఎర్రటి చిగురుటాకులు, పెద్ద పెద్ద లతలు, ఆ చెట్ల మధ్య వేదికలు. అవి వైఢూర్యాలతో పొదగబడ్డాయి. తామర కొలనులున్నాయి. నాళ్ళు వైఢూర్యాల్లా మెరుస్తున్నాయి. రకరకాల పక్షులు విహరిస్తున్నాయి. కొలనుల్లో కాంచన కమలాలు ఉన్నాయి. అవి సూర్యకాంతితో మెరుస్తున్నాయి. తాబేళ్ళు చేపలు అన్నీ బంగారు మయం.

బంగారు విమాన గృహాలు, వెండి విమాన గృహాలు కనిపించాయి. కిటికీలన్నీ బంగారుమయం. ముత్యాల జాలర్లు వేలాడుతున్నాయి. నేలలు కన్నుల పండువులా ఉన్నాయి. వైడూర్యాలు బంగారం వెండితో చపటా చేసి ఉన్నాయి. చెట్టుకున్న పండ్లు ప్రవాళ మణికాంతుల్లో ఉన్నాయి. పూలమీద బంగారు తుమ్మెదలు మూగుతున్నాయి. చూశారు వానరులు. ఆశ్చర్యపోయారు.

## స్వయంప్రభ

బంగారు శయ్యలు, బంగారు ఆసనాలు, బంగారు



వాహనాలు. వెండితో కంచుతో చేసిన పాత్రలు, చందనాది సుగంధ ద్రవ్యాలు, పరిశుద్ధమైన పానీయాలు, తేనెలు, వస్త్ర రాసుల చిత్రవర్ణ కంబళ్ళు చూశారు వానర వీరులు. అలా చూస్తూ ముందుకు పోయారు. ఒక వృద్ధాంగన కనిపించింది. ఆమె వల్కలాలు ధరించింది. కృష్ణాజినం కప్పుకుంది. చూశారామెను. భయపడ్డారు. విస్మితులైనారు. పర్వతాకారుడు హనుమంతుడు చేతులు జోడించాడు. తల వంచాడు. నమస్కరించాడు. ''అమ్మా! నీవు ఎవరు? ఈ బిలం ఎవరిది? బంగారు రత్నరాశులు ఎవరివి?'' అని ప్రశ్నించాడు. అతని స్వరంలో వినయం వుట్టిపడింది.

మళ్ళీ అంటున్నాడు వాయుపుత్రుడు. ''అమ్మా మేం ఆకలి దప్పులతో వున్నాం. అలిసిపోయాం. చాలా బాధపడుతున్నాం. ఇక్కడ నీళ్ళుంటాయని వచ్చాం. చీకట్లో వచ్చాం. ఒకరి చేతులు ఒకరం పట్టుకుని వచ్చాం. ఇక్కడ ఆశ్చర్యకరమైనవి చూశాం. మా మతి పోయింది. దిక్కు తోచలేదు. ఈ భవనం, ఈ వృక్షాలు ఎవరివి? ఎవరి రక్షణలో ఉన్నాయి? ఇదంతా నీ ప్రభావమా? లేక మరొకరి తపోబలమా? మాకు చెప్పు తల్లీ!''

సర్వభూత హితపరాయణి ధర్మచారిణి వినింది. చూసింది హనుమంతుణ్ణి. ''వానరుడా! దానవ శ్రేష్ఠుడు, మహామాయావి మయుడు. వేల ఏళ్ళు తపస్సు చేశాడు. బ్రహ్మను మెప్పించాడు. వరాలు పొందాడు. ఈ కాంచన వనాన్ని సృష్టించాడు. ఈ భవనాల్ని నిర్మించాడు. రాక్షసుల శిల్పి మయుడు. దేవతాశిల్పి విశ్వకర్మ. ఆ మయుడు ఒక అప్సరసని ప్రేమించాడు. ఆమె పేరు హేమ. ప్రేమ కానుకగా ఈ భవనాల్ని బహూకరించాడు. వజ్రాయుధంతో మయుణ్ణి చంపాడు ఇంద్రుడు. నేను మేరు సావర్ణి కుమార్తెను. నా పేరు స్వయంప్రభ. హేమ నా ప్రియసఖి. నన్నెవరూ ఎదిరించలేరు. ఆ వరాన్ని హేమ నాకు ప్రసాదించింది. ఈ భవన రక్షణ నాదే. ఎవరి కోసం ఇలా వచ్చారు? ఎవరే కాని ఇక్కడికి రాలేరు. ఎలా వచ్చారు? ముందుగా కందమూల ఫలాలు తినండి. దప్పిక తీర్చుకోండి. తర్వాత కారణం చెప్పండి'' అందామె.

అందరూ కడుపారా తిన్నారు. దప్పిక తీర్చుకున్నారు. విశ్రాంతులైనారు. తర్వాత దాపరికం లేకుండా చెప్పసాగాడు హనుమ. ''ఓ తాపసీ! రాముడు, అతని భార్య సీతాదేవి, తమ్ముడు లక్ష్మణుడు దండకారణ్యం లోకి వచ్చారు. పంచవటిలో పర్ణశాల నిర్మించుకున్నారు. రామలక్ష్మణులు లేని సమయం అది. రావణుడనే రాక్షసుడు వచ్చాడు. సీతను అపహరించాడు. ఆమెకోసం అన్నదమ్ములు వెదుకుతూ వచ్చారు. వానరరాజు సుగ్రీవుడు. అతనితో స్నేహం చేశాడు రాముడు. వానర రాజు ఆదేశించాడు. మేమంతా సీతాన్వేషణలో ఉన్నాం. మా నాయకుడు అంగదుడు. వెదికి వెదికి అలసిపోయాం. ఇక్కడికి చేరాం. నీ శరణు జొచ్చాం. నీవు కాపాడావు మమ్మల్ని. నీకేం ప్రత్యుపకారం చేయాలో చెప్పమ్మా!''

వినింది స్వయంప్రభ. ''మీ సాహస కృత్యానికి సంతోషం. నేను నా ధర్మం పాటించాను. నాకు మీరేం చేయనక్కరలేదు'' అన్నది.

''అమ్మా మా రాజు సుగ్రీవుడు చెప్పిన గడువు దాటింది. అతడు మమ్మల్ని చంపేస్తాడు. భయంగా ఉంది. అయినా రామకార్యం నెరవేర్చాలి. నీవు పరమ ధార్మికురాలవు. మమ్మల్ని ఈ బిలం నుంచి దాటించు. మమ్మల్ని రక్షించు'' అన్నాడు వాయుపుత్రుడు మారుతి.

అంటోందామె. ''మీరిక్కడికి వస్తే ప్రాణాలతో తిరిగి పోలేరు. అయితే మిమ్మల్ని బయటికి పంపుతాను. అది నా తపోబలమే. మీరంతా కన్నులు మూసుకోండి. తెరిస్తే ఇంతే సంగతులు. నా మాట వినండి. చెప్పినట్లు చేయండి''.

అందరూ గట్టిగా కన్నులు మూసుకున్నారు. అంతేకాదు. చేతులతో కళ్ళని కప్పేశారు. చూసింది స్వయంప్రభ. రెప్పపాటు కాలంలో బయటికి చేర్చింది. కనులు తెరిచారు. ''ఇది వింధ్య పర్వతం దక్షిణ భాగం. అదే మహాసముద్రం. మీకు శుభం'' అంది స్వయంప్రభ. తన స్వస్థలం చేరుకుంది.

## ప్రాయోపవేశం

సముద్రాన్ని చూశారు వానర వీరులు. అది వరుణునికి నిలయం. ఎగిసి పడుతున్నాయి అలలు. భయం కల్గిస్తున్నాయి. సముద్రపు ఘోష అంతటా ప్రతిధ్వనిస్తోంది. వింధ్య పర్వతం వైపు నడిచారు. వివిధ ఫల పుష్ప వృక్షాలున్నాయి. అక్కడ కూర్చున్నారు. అది వింధ్యకు నైరుతి దిశ. వసంత ఋతువు రాబోతోంది. అంగదుడు అంటున్నాడు. ''ఆశ్వయుజ మాసం మనకు కాలపరిమితి. మనం బిలంలో ఉన్నాం. ఆ మాసం దాటిపోయింది. వెనక్కి వెడితే చంపేస్తాడు సుగ్రీవుడు. అక్కడికి వెళ్ళి చావడం కంటే ఇక్కడే చస్తాం. అందుకు ప్రాయోపవేశం

ఒక్కటే మార్గం. నన్ను యువరాజుని చేసింది సుగ్రీవుడు కాదు. రాముడు చేశాడు. మొదటి నుంచి నేనంటే సుగ్రీవునికి పడదు. బద్ధవైరమని చెప్పాలి. చిత్రహింసలు పెడతాడు. వధిస్తాడు''.

విన్నారు వానరులు. ''నిజమే సుగ్రీవుడు తీక్షణ స్వభావుడు. సీత జాడ తెల్సుకోలేకపోయాం.వెనక్కి వెడితే చావడం ఖాయం'' అన్నారు. అపుడు తారుడు కలగజేసుకున్నాడు. ''ఇక్కడ చావడమెందుకు? స్వయంప్రభ బిలంలోకి వెడదాం. అక్కడ అన్నపానాదులకు లోటుండదు. అక్కడికి సుగ్రీవుడు రాలేడు. రాముడు రాలేడు. దేవేంద్రుడూ రాలేడు. ఎవరి భయం ఉండదు మనకు''.

ఆ మాటలు అంగదునికి అనుకూలంగా ఉన్నాయి. విన్నాడతడు.సంతోషించాడు.వానరులు కూడా సంతుష్టులైనారు. అంగదుడు అంటున్నాడు. ''వెనక్కి వెళ్ళరాదు. వెడితే చస్తాం. అది జరగరాదు. ప్రమాదం లేనిది ఏదో ఆలోచించండి. మీరెలా చెబితే అలా చేద్దాం''.

తనతండ్రిని చంపించినవాడు సుగ్రీవుడు. తనని యువరాజుగా చేసింది రాముడు. అతనికి భయపడ్డాడు సుగ్రీవుడు. విధిలేక యువరాజ్యాభిషేకం గావించాడు. పినతండ్రి అంటే కోపం ఉందతనికి. ఆ కోపం క్రమంగా వైరంగా మారుతుంది. అది గమనించాడు హనుమంతుడు. అంగదుని మనసు మార్చాలి. ప్రాయోపవేశం నుంచి మాన్పించాలి. అంగదునిలో బాహుబలం వుంది. బుద్ధిబలం ఉంది. సుగ్రీవునితో వైరం పెంచుకోరాదు. కలిసి ఉండాలి. అది హనుమంతుని ఆలోచన. అందుకే తారుని భేదోపాయం సమర్థించలేదు. అంటున్నాడు.



''యువరాజా! నీవు యుద్ధంలో గొప్పవాడివి. నీ తండ్రి కంటే గొప్పవాడివి. వానరులు సహజంగా చపలచిత్తులు. ఏదో మాట్లాడుతారు. అయినా ఒకటి ఆలోచించు. ఆలుబిడ్డల్ని వదిలారు. నెల రోజులైంది. ఇళ్ళకి వెళ్ళాలని వుంటారు. నీ మాట వినరు. ముఖ్యంగా జాంబవంతుడు వినడు. నీలుడు వినడు. వాళ్ళు నిన్ను అనుసరించరు. బలహీనుడు బలవంతునితో విరోధమా? అది తగదు. ఈ మాట నేను కాదు, నీతి వేత్తలంటున్నారు. తారుడు చెప్పినట్లు బిలం నీకు రక్షణా? లక్ష్మణుడు బాణాలు వేస్తాడు. ఆ బిలం బద్దలైపోతుంది. తిండి దొరకలేదు. నిద్రలేదు. నెల రోజులు కష్టాలు పడ్డారు వీళ్ళంతా. వెనక్కి వెళ్తారు. అపుడు నీవు ఒంటరి అవుతావు. నీవూ మాతో వచ్చెయ్. సుగ్రీవుడు ఏమీ అనడు. ఏమీ చేయడు. ఆనుపూర్వకంగా నీవు రాజు కాగలవు. అంగదా! సుగ్రీవుడు ధర్మాత్ముడు. అందరినీ సంతోషపెడతాడు. దృఢవ్రతుడు. ప్రతిజ్ఞ తప్పనివాడు. నిన్ను చంపడు. తార నీకోసం బతుకుతోంది. సుగ్రీవునికి కొడుకుల్లేరు. నిన్ను తన కొడుకుగా భావిస్తున్నాడు. నా మాట విను. వెనక్కి వెళ్దాం పద''.

## సుగ్రీవుని నిందించుట

హనుమంతుని మాటలు ధర్మసమ్మతాలు. నీతియుక్తాలు. కాని అవి అంగదునిపై ఫలించలేదు. అంటున్నాడు అంగదుడు. ''హనుమా! సుగ్రీవుడు అస్థిరచిత్తుడు. అంతఃకరణశుద్ధి లేనివాడు. క్రూరుడు. కపటి. పరాక్రమ హీనుడు. ధైర్యహీనుడు. తార పట్టమహిషి. సుగ్రీవునికి వదిన. తల్లి లాంటిది. భర్త బతికి వుండగా చేపట్టాడు. అది ధర్మమా? శత్రువుతో గుహలోకి పోయాడు వాలి. యుద్ధం చేస్తున్నాడు. గుహ ద్వారాన్ని మూశాడు. రాజ్యం చేపట్టాడు. అతడు ధార్మికుడా? రామునికి సాయం చేస్తానన్నాడు. మరచిపోయాడు. అతడు కృతజ్ఞుడా? లక్ష్మణునికి భయపడ్డాడు. సీతాన్వేషణకి ఆజ్ఞాపించాడు. అది అధర్మ భయం''.

''సుగ్రీవుడు పాపాత్ముడు. కృతఘ్నుడు. అవివేకి. చపలచిత్తుడు. శఠుడు. తనకు పుట్టేవాణ్ణి రాజును చేస్తాడు. నన్ను బతకనీయడు. రహస్యంగా ఉరి తీస్తాడు. ఒక దుర్బలునిగా శక్తిహీనుడిగా అనాథగా అక్కడికి రావాలి. బతకాలి. దాని బదులు ఋక్షబిలంలో వుంటాను. అది నాకు శ్రేయస్కరం. లేదా ఇక్కడే ప్రాయోపవేశం మేలు'' అన్నాడు. మళ్ళీ వానరులతో ఇలా అంటున్నాడు.

''మీరందరూ వెళ్ళండి. నేను కిష్కింధకు రాను. ఇక్కడే ప్రాణాలు విడుస్తాను. రామలక్ష్మణులు బలవంతులు. వారికి నా నమస్కారాలు చెప్పండి. మా పినతండ్రికి నమస్కారాలు చెప్పండి. వృద్ధ వానరులందరికీ నమస్కారాలు చెప్పండి. మా పినతల్లిని అడిగానని చెప్పండి. మా అమ్మది జాలిగుండె. నేనంటే ఆమెకు పంచప్రాణాలు. చావువార్త వింటుంది. దుఃఖిస్తుంది. ప్రాణాలు విడుస్తుంది.

(సశేషం)

ధారావాహికం



# శ్రీ కృష్ణ తత్వం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

అఘాసుర మోక్షణంతో బాలకృష్ణుణ్ణి దర్శించినారు బ్రహ్మాది దేవతలు.ఆ కృష్ణ తత్వాన్ని ఇంకొక సారి దర్శించాలని అనుకున్నాడు బ్రహ్మదేవుడు–ఇక దూడలను మాయం చేసేసాడు. వాటిని వెదకాలని కృష్ణుడు అటు వెళ్లగానే ఇటు గోపబాలురను కూడా మాయం చేసేసి ఒకవిధంగా అసహ్యాపచారానికి కారణమైనాడు.

ఒకరోజు కాదు–ఒక నెల రోజులు కూడా కాదు– ఏకంగా ఒక సంవత్సర కాలం–దాచేసినవాడు (మాయచేసినవాడు) ఇంకెవరు చతుర్ముఖ బ్రహ్మదేవుడు అని సర్వజ్ఞుడు– సర్వాంతర్యామియైన కృష్ణదేవునికి తెలిసిపోయింది.

సర్వశక్తిసంపన్నుడైన భగవానునిదుతలుచుకుంటే–గోవత్స–గోపబాలురు ఎక్కడున్నా వచ్చేయగలరు.అయితే బ్రహ్మదేవుని మోహం తొలగాలి–తనే సృష్టికర్తను అనే అహంకారాన్ని నశింపచేయాలని సంకల్పించాడు కృష్ణభగవానుడు.

అటు గోపికలకు ఇటు ఆవులకు కూడా ఏవిధమైన అనుమానం రాకుండా సర్వం విష్ణుమయమంటూ వైష్ణవ మాయను కల్పించాడు.

కృష్ణుడేం చేస్తున్నాడో చూడాలని–హంస వాహనంమీద బ్రహ్మదేవుడు వచ్చాడు. ఎప్పటిలాగే గోవత్సాలు గోపబాలురు స్వేచ్ఛగా విహరిస్తూ కనిపించడంతో దిక్కుతోచలేదు బ్రహ్మంగారికి.అసలు నేనే గుహలో దాచిపెడితే– ఇక్కడికి మరి రావడమేమిటి–విచిత్రంకదా నివ్వెరపోయాడు. సృష్టికర్తను నేనే. మరి ఈ మాయా సృష్టి ఎవరిది?

**ఏవం సమ్మోహయన్ విష్ణుం విమోహం విశ్వమోహనమ్ ।**

**స్వయైవ మాయాజోపి స్వయమేవ విమోహితః ॥**

నారాయణుడు విశ్వాన్ని మాయలో పడేస్తాడు. బ్రహ్మ ఎవరి మాయలకు లోనుగాడు.కృష్ణుణ్ణి తన మాయా ప్రభావంతో మోహపరవశుని చేద్దామని తలంచిన చతుర్ముఖ బ్రహ్మ తనకు తానే సమ్మోహితుడయ్యాడు.

పట్టపగటిపూట మిణుగురు పురుగుల కాంతి– సూర్యకాంతికి ఎదురుగా తేలిపోతుంది.అవిధముగా అలా కృష్ణభగవానుని ముందు బ్రహ్మదేవుని స్థాయి దిగజారింది. ఆవుదూడల్లో ఇంకా గోపబాలురలో కృష్ణదేవుని దర్శించినాడు బ్రహ్మ.

చతుర్ముఖ బ్రహ్మదేవుడు దర్శించిన కృష్ణభగవానుడు ఇలావున్నాడు–

**ఘనశ్యామా । పీతకౌశేయవాససః। చతుర్భుజాః శంఖచక్రగదా రాజీవ పాణయః । కిరీటనః కుండలినో హారిణో వనమాలినః ।**

అపుడు అక్కడ గోవత్స గోపబాలురు కృష్ణదేవుని రూపంలోనే వున్నట్లుగా కనిపించారు. వాళ్లందరునూ అచ్చం అల నీల మేఘ శ్యామలమైన వర్ణాలతోను పట్టుపీతాంబరాలునూ చతుర్భుజాలూ శంఖచక్రాదులునూ కిరీటాలునూ కుండలాలూ హారాలును వనమాలలూ శ్రీవత్స చిహ్నాలునూ భుజకీర్తులూ శ్రీకృష్ణ స్వరూపులై విరాజిల్లుతున్నారు.ఇంక తన భంగపాటును తెలుసుకున్నాడు బ్రహ్మ. తన నాలుగు తలలూ స్వామి పాదాలకు తాకేట్లుగా ప్రణమిల్లి– ఆనందాశ్రువులు రాలగా ఆ దివ్యపాదపద్మాలను భక్తితో అభిషేకించాడు.

చిన్ని కృష్ణుడు చతుర్ముఖ బ్రహ్మదేవుని ముందు ప్రదర్శించిన లీలావిలాసాలు అపూర్వమైనవి.వేలకొద్ది గోపాలురరూపంలో– అలాగే వేలాది ఆవుదూడల రూపంతో–అంతే సంఖ్యలో బ్రహ్మదేవుళ్ల రూపంతో– ప్రత్యేకంగా చతుర్ముఖబ్రహ్మకి దర్శనమిచ్చాడు కృష్ణుడు. ఆ స్వామి ఈశ్వరీయమైనట్టి అనంతమైనటువంటి తత్వాన్ని– వర్ణించడానికి భాష చాలదు.

"శృణ్వన్ గృణన్నేతి నరోఖిలార్థాన్" పరీక్షిత్తు మహారాజుకు శుకమహర్షి చెప్పాడు–బ్రహ్మదేవునీ కృష్ణస్తుతిని. వినినవారందరు కూడా వెన్వెంటనే ధర్మార్థకామమోక్షాలను పొందుతారని ఫలశ్రుతిగా గుర్తించాలన్నాడు.

నెలకు ఒకసారి ఒక పామును ఆహారంగా ఇవ్వడానికి సర్పాలకు గరుత్మంతునికి ఒప్పందం కుదిరింది.కద్రువ కుమారుడు కాళియుడు తన వంతు సర్పాహారాన్ని ఇవ్వకుండా అహంకారించి తనే తినేసాడు.అందుకని గరుడుడు మహోగ్రుడై– కాళీయుని చంపేయాలని దాడి చేసాడు. భయవిహ్వలుడైపోయిన కాళియుడు కాళీయమడుగుని చేరాడు.

ఆ కాళీయమడుగులోని చేపలను ఇష్టంవచ్చినట్లుగా గరుత్మంతుడు భక్షించేవాడు.ఆమడుగులో తపస్సు చేస్తున్న సౌభరిమహర్షిని ఆ చేపలు శరణుజొచ్చాయి.ఇక్కడికి గరుత్మంతుడు వస్తే– అతనికి మరణం తప్పదంటూ శపించాడు మహర్షి.కనుకనే నిర్భయుడై ఆ మడుగులో కాళియుడు వుండిపోయాడు.

పూతన శకటాసురాదులు కంసుని ఆజ్ఞానుసారంగా కృష్ణభగవానుని ఒక్కణ్ణే హతమార్చాలని దుర్బుద్ధితో వచ్చినారు. ఎవరి ప్రేరణలేకపోయినా– మడుగులోవుంటూ–విషధూమంతో– విషజ్వాలలతో– జల భూమ్యాకాశాల్లోని అమాయక వేలకొలది ప్రాణులను సంహరిస్తూ– ఆనందిస్తూ నూటొక్క పడగలతో కాళియుడు బుసలు కొడుతూ–వాటిలోని విషాగ్ని జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. కాట్లువేసే తన పడగలతో చుట్టేసాడు కన్నయ్యని."గావో వృషా వత్సతర్యః క్రందమానాః సుదుఃఖితాః" గోవులు వృషభాలు కోడెదూడలు లేగదూడలూ దుఃఖంతో ఆక్రందిస్తున్నాయి. దీనమైన వదనాలతో చూస్తున్నాయి.

బృందావనంలోని గోపీగోపాలురునూ నందయశోదలును కృష్ణుణ్ణి చూసి– దుఃఖాక్రాంతులైనారు. అపుడు కృష్ణ భగవానుడు తన శరీరాన్ని పెంచినాడు. పైకెగిసినాడు.పడగలను తొక్కాడు. వాని పడగలపైన వున్న రత్న కాంతులు కృష్ణస్వామి పాదాల ఎర్రదనాన్ని రెట్టింపు చేస్తున్నాయి.

కాళీయుని పడగలనే రంగస్థలంమీద కృష్ణతాండవానికి– ఎన్నడేకాని ఎపుడూ ఎవరికి తలవంచని దుర్మార్గుడు కృష్ణునికి తలవంచినాడు.నూటొక్క పడగలు చితికిపోయినాయి.వాడు రక్తసిక్తమైపోయినాడు. నెత్తుటి చుక్కలు– ఎర్రని పూలతో కృష్ణదేవుని పూజించినట్లున్నాయి.

కాళీయుని భార్యలు కృష్ణభగవానునితో అంటున్నారు ఈ విధంగా––

దేవా!ఈ కాళీయుడు పూర్వజన్మలో ఏ ఏ తపస్సులు చేసాడో– ఏవిధమైనట్టి సత్కార్యాలు ఆచరించినాడో కదా– ఎపుడెలాంటి నిజాలు పలికాడో–ఏ పుణ్యవంతుల సన్నిధికి ఏరోజూ వెళ్లని– ఈ ఫణిరాజు పడగల మీద– నీవు నాట్యం చేసావంటే– అదెంతటి భాగ్యమో!

**న నాకపృష్ఠం న చ సార్వభౌమం న పారమేష్ఠ్యం న రసాధిపత్యమ్।**
**న యోగసిద్ధీరపునర్భవం వా వాంఛతి యత్పాదరజః ప్రపన్నాః ॥**

ప్రభూ! స్వర్గలోకాన్ని కానీ చక్రవర్తిత్వాన్ని కానీ– బ్రహ్మదేవుని పదవిని కానీ– పాతాళాది లోకాల మీద అధికారం కానీ– అణిమాదిసిద్ధులని కానీ– మోక్షాన్ని కానీ కోరడంలేదు. మా భర్త గర్వాంధుడైననూ– మహాక్రోధుడైననూ–నీ దివ్యమైన పాదరేణువుల స్పర్శ పొందడమే మహద్భాగ్యం.ఓ స్వామీ! మాకు పతిభిక్ష పెట్టు.

కాళీయుడు కూడా కృష్ణభగవానునికి నమస్కరించాడు. స్వామీ! మా నడకలు వంకరటింకరగా వుంటాయి.ముఖాలు విషాగ్నిభరితాలు. దుర్మార్గులం మేం. రోషజాతులం.మంచోళ్లం కాదు దేవా! నన్ను రక్షిస్తావా? శిక్షిస్తావా?నీ చిత్తం.ఏ సనకాదులు నీ పాదరజాన్ని కోరుతుంటారో ఆ పాదరజాన్ని నేను చూసాను. ఇక పాలముంచినా నీటముంచినా నీదే భారం– అన్నాడు.

కాళీయుని క్షమించాడు కృష్ణదేవుడు.ఈ మడుగులోని నీళ్లు ఇక ఈ క్షణంనుంచి అమృతమయంగా వుంటాయి.నీవు సముద్రానికి వెళ్లిపో.నా పాదముద్రలు నీ పడగలపైన వున్నాయి కనుక గరుత్మంతునితో నీకు భయంలేదని అభయమిచ్చాడు కృష్ణుడు.

కాళీయ ఫణి మాణిక్య రంజిత శ్రీ పదాంబుజాయ నమః!

కాళీయుడు సపరివారంగా సముద్రానికి వెళ్లాడు.

నేను సర్వాధికుణ్ణి అనే అహంకారం భయంకరమైన విషం.నీ పాదమే శరణమని స్వామికి శరణాగతి మనం చేసినట్లైతే– రజస్తతమోగుణాలు పూర్తిగా నశిస్తాయి. సత్వగుణం వృద్ధిచెందుతూ– త్రిగుణాతీతులమయ్యేట్లుగా మనకు భగవదనుగ్రహం లభించగలదు.

కాళీయుని భార్యలు మనోచిత్తవృత్తులకు ప్రతీకలు.వేల సంఖ్యలో చిత్తవృత్తులు మన మనసులో వుంటాయి. వాటిని నాశనం చేయాలంటే నిరంతరమూ భగవన్నామ స్మరణమే ప్రధానసాధనం. కృష్ణ పరమాత్మ దివ్య మంగళ కళ్యాణ రూపం మన మనసులో నిలిస్తే చాలు– జన్మసాఫల్యమైనట్లే.

కృష్ణ భగవానుని అసాధారణమైనట్టి అత్యంత ఆశ్చర్యాదీకర కృత్యాలు ఊహించరానివని చెప్పకతప్పదు. రాక్షసి పూతన విషంకానీ– కాళీయుని భయంకరమైనట్టి విషజ్వాలలు కానీ– అడవిలో రెండుసార్లు సంభవించిన దావానలం కానీ మన కృష్ణ భగవానుని ఏమీచేయలేక పోయాయి.

కార్చిచ్చార్పు పటుత్వము నేర్పునె నరుడొకడు శౌరి నేడిదె కార్చిచ్చార్చి మనల రక్షింపంగ నేర్చె! ఇతండజుడొ హరియో నిటలాక్షుండో!

దావాగ్నిని చల్లార్చే శక్తి ఒక మానవునికి వుంటుందా? నేడు కృష్ణుడు కార్చిచ్చు ఆర్పి మనల్ని కాపాడినాడు.ఇతడు బ్రహ్మో విష్ణువో ముక్కంటియో కాదు కదా– అవి గోపబాలుర మాటలు.

భాగవతంలో గోపికావస్త్రాపహరణం చాలా మంది విమర్శలకు గురైనది. అది అశ్లీలమని– అసభ్యకరమన్నారు. అందులో లాలా లజపతిరాయ్ ఒకరు.

**(ఇంకా ఉంది)**

ధారావాహికం



# ముకుందమాల

- భువనేశ్వరి మారేపల్లి,
9550241921

**బద్ధేనాంజలినా నతేన శిరసా గాత్రై స్సరోమోద్గమైః**
**కంఠేన స్వరగద్గదేన నయనే నోద్గీర్ణ బాష్పాంబునా ।**
**నిత్యం త్వచ్చరణారవిందయుగళ ధ్యానామృతాస్వాదినాం**
**అస్మాకం సరసీరుహాక్ష సతతం సంపద్యతాం జీవితం ॥**

ఓ పద్మ నయనా! అత్యంత భక్తితో నీకు అంజలి ఘటించి, శ్రద్ధతో శిరస్సు వంచి, పులకించిన శరీరం గగుర్పాటు చెందగా, కంఠస్వరం గద్గదమై పోగా, ఆపలేని ఆనందబాష్పములు జలజలా ప్రవిస్తుండగా, నీ పాదపద్మములను సదా ధ్యానించుట అనే మకరందాన్ని ఆర్తితో త్రాగుతూ నీ ధ్యాసయే మాకు జీవితముగా శ్వాసగా చేసుకుని గడిపే భాగ్యాన్ని ప్రసాదించు ఓ మధుసూదనా! అంటూ కీర్తించారు.

పరమాత్మ యొక్క విశ్వరూప దర్శనం సామాన్యులమైన మనవంటి వారికి దుర్లభమైనప్పటికీ కులశేఖరాళ్వార్లు అందరికి వారి జ్ఞానానికి సరిపడే రీతిలో ఈ శ్లోకంలో వివరిస్తు, అనన్యమైన భక్తితో ఆ ముకుందుడిని సేవించి తరించే భాగ్యం ప్రసాదించమని వేడుకుంటున్నారు. పరమాత్మ నేత్ర సౌందర్యం చూసినవారై ఆ దివ్యానుభవంలో తనలో జరిగే మార్పులను వర్ణిస్తూ, ఆయా అవయవములు అలాగే ప్రవర్తించాలని పరమాత్మని కోరుకుంటున్నారు.

పరమాత్మ యొక్క దివ్య నేత్రములు పద్మపత్రములలాంటి ఎర్రని విశాలములైన నేత్రములు కలిగినవాడు. ఇలా కలిగి ఉండడంచేత ఇది మహాపురుషుడు లక్షణంగా శాస్త్రం తెలియజేస్తోంది.

'ఛాందోగ్యమనే ఉపనిషత్తు అసలు పరమాత్మ ఎలా ఉంటాడు? ఆయన దివ్య అవయవములు ఎలా ఉంటాయి ఆపాదతలమస్తకం వర్ణించింది. అందులో భాగంగా భగవానుడి యొక్క నేత్రము లను వర్ణించే సమయంలో ఇలా చెప్పింది.

"తస్య యథా కప్యాసం పుండరీకం ఏవమక్షిణీ" పరమాత్మ యొక్క రెండు నేత్రములను సరస్సు నందు సూర్యకిరణములచే వికసించబడిన ఎర్ర తామర రేకులవలె శోభిస్తున్నాయని వర్ణిస్తాయి. ఈ శృతి వాక్యానికే భగవద్రామానుజులవారు యాదవ ప్రకాశుడి వద్ద విద్యాభ్యాసం చేసే సమయం ఆయన చెప్పిన అపశ్రుతి విని తట్టుకోలేక రామానుజులవారు సరిచేసి వర్ణిస్తారు,

**"సంపుల్లదళ పద్మస్య సదృశే లోచనే హరేః ।**
**తస్యాఃశ్రుతేరేవ మర్థో వక్తవ్యః శాస్త్రవిత్తమైః ॥"**

లేతుగా నీటి నుండి పుట్టి ఉదయిస్తున్న సూర్యుడి కిరణములచే చక్కగా వికసించిన పద్మమును పోలిన నేత్రములు కలిగిన శ్రీమన్నారాయణుడు అని శాస్త్రములు చెప్తున్నాయి. అలాంటి స్వరూపమును దర్శించిన కులశేఖరాళ్వార్లు ఓ పుష్కరాక్షా! నా చేతులు ఇతరమైన కార్యములను చేయక నీకు అంజలి ఘటించాలి. సమస్త జగత్తుకు ప్రభువువైన నీ స్వర్ణ మకుటమును చూస్తూ నా శిరస్సు నీయందు భక్తితో వంచి ఉండాలి. భగవంతుడా నిన్ను నీ దివ్య మంగళ విగ్రహాన్ని దర్శించిన నా శరీరము పులకరించిపోవాలి. ఇన్ని రోజులనుండి నిన్ను తలవని కారణంచేత భయము కలిగి అలాగే భగవద్భక్తి కలిగి కంఠమున

గద్గద స్వరము కలగాలి. పరమాత్మ నిన్ను దర్శించడం చేత, ధ్యానించడం చేత, కన్నులలో ఆనందబాష్పములు కలగాలి. సర్వ కాలములయందు నీ యొక్క చరణ కమలద్వయము యొక్క ధ్యానము అనే అమృతమును పానము చేసేలాగా ఓ పుండరీకాక్షా! మాకు ఈ రీతిగా జీవితాన్ని గడిపేలా అనుగ్రహించుము అంటూ కీర్తిస్తూ, పరమాత్మ దగ్గరకు ప్రవేశించేటప్పుడు మనము ఎలా వినయంతో ఉండాలి ఎలా సేవించాలి, ఎలా సేవిస్తే ఆ దివ్యమంగళ విగ్రహ స్వరూపుడైన పరమాత్మ యొక్క ఆనందాన్ని పొందగలము అనేటువంటివి మనకు నేర్పుతున్నారు.

ఈ విషయాన్నే కన్హోపాత్ర కూడా తెలియచెబుతోంది. ఎలా సేవిస్తే ఆ దివ్యమంగళ విగ్రహ స్వరూపుడైన పరమాత్మ యొక్క ఆనందాన్ని పొందగలమో! ఇంతకీ ఆ కన్హోపాత్ర ఎవరు!

పండర్‌పూర్‌కు పద్నాలుగు మైళ్ల దూరంలో ఉన్న మంగళవేద పట్టణంలో శ్యామా అనే దాసి ఉండేది. శ్యామాకు కన్హోపాత్ర అనే అందమైన కుమార్తె ఉంది. ఈ లోకంలో ఆమె అందానికి సాటి లేదు, చాల అందమైనది. ఆమె చిన్నతనంలోనే సంగీతం నాట్యం నేర్చుకుంది. శ్యామా, రాజును చూడటానికి తన కుమార్తెను తనతో రమ్మని కోరింది. తద్వారా అతను ఆమెకు కొంత డబ్బు మరియు ఆభరణాలు ఇస్తాడు అని చెప్పింది. అప్పుడు కన్హోపాత్ర రాజుల దర్బార్‌కి రానని చెప్పింది. అంతేకాదు తనకంటే అందంగా ఉన్న వారిని మాత్రమే పెళ్లి చేసుకుంటానని చెప్పింది.

ఒకరోజు పండరీకి వెళ్తున్న యాత్రికుల బృందం భగవంతుని స్తుతిస్తూ పాటలు పాడుతూ వెళుతున్నారు. కన్హోపాత్ర వారిని చూసినప్పుడు ఆమె వారికి నమస్కారం చేసి, వారు ఎక్కడికి వెళ్తున్నారని వారిని అడిగింది. యాత్రికులు విఠల్ స్వామిని చూడటానికి పండరీకి వెళ్తున్నామని ఆమెకు సమాధానం ఇచ్చారు. అప్పుడు ఆమె అతని మహిమను వర్ణించమని వారిని కోరింది, దానికి వారు బ్రహ్మ మరియు ఇతరులు కూడా అతని మహిమను వర్ణించలేకపోయారని మరియు అతని అందం లక్ష్మీదేవి కంటే ఎన్నో రెట్లు మించిపోయి ఉంటుందని చెప్పారు. అప్పుడు కన్హోపాత్ర వారిని అడిగింది, ఆమె ప్రభువు వద్దకు విజ్ఞాపన దారుగా వెళితే, అతను(విఠల్) ఆమెను అంగీకరిస్తాడా అని. అప్పుడు సాధువులు ఆమెను తప్పకుండా స్వీకరిస్తారని చెప్పడంతో, ఆమె ఇంటికి వెళ్లి పండరీకి వెళుతున్నానని తల్లికి చెప్పి, ఆమె చేతిలో ఒక వీణ తీసుకుని వారితో వెళ్లిపోయింది. ఆమె యాత్రికులతో కలిసి స్వామిని కీర్తిస్తూ పండరీకి చేరుకుంది. ఆమె విఠల్ దర్శనం చేసుకుని పండరీలో ఉండాలని నిర్ణయించుకుంది. ఆమె ఎప్పుడూ గుడిలోని పెద్ద ద్వారంలోనే ఉంటూ ఆయనను స్తుతిస్తూ ఉంటుంది.



బీదర్ నుండి వచ్చిన ఒక వ్యక్తి ఆమెను చూసి వెళ్లి రాజుకు ఆమె గురించి, ఆమె అందం గురించి చెప్పాడు. ఇది విన్న మహమ్మదీయ రాజు పండర్‌పూర్ ఆలయం నుండి కన్హోపాత్రను తీసుకురావడానికి తన కాపలాదారులను పంపాడు. కాపలాదారులు ఆలయ ద్వారాల వద్దకు వచ్చి కన్హోపాత్రకు రాజు ఆదేశాలను చెప్పారు మరియు ఆమె వాటిని వినకపోతే, వారు ఆమెను బలవంతంగా తీసుకెళ్లవలసి ఉంటుంది అని. ఆ తర్వాత తాను చివరిసారిగా విఠల్‌ను దర్శనం చేసుకుని, వారితో కలిసి రాజు వద్దకు వస్తానని చెప్పింది.

లోపలికి వెళ్లి విఠల్‌ను ప్రార్థించి, అతను (విఠల్) ఇప్పుడు తనను విడిచిపెడితే ప్రపంచం మొత్తం అతనిని (విఠల్) నిందిస్తుందని చెప్పింది. ఆమె విఠల్‌ను వేడుకున్నందున, అతను (విఠల్) ఆమె ఆత్మను తొలగించి తనలో ఐక్యం చేసుకున్నాడు. అతను కన్హోపాత్రను తన ఒడిలోకి తీసుకున్నాడు మరియు ఆమె అతని (విఠల్) ఒడిలో మరణించింది. ఆమె శవాన్ని ఆలయ దక్షిణ ద్వారం వద్ద పాతిపెట్టమని విఠల్ పూజారిని ఆదేశించాడు. వారు ఆమెను పాతిపెట్టిన వెంటనే ఆ ప్రదేశంలో ఒక 'తారాతి' చెట్టు మొలకెత్తింది మరియు అందరూ ఆశ్చర్యపోయారు. పండర్‌పూర్ లోని విఠల్ రుక్మిణి ఆలయంలో ఈ చెట్టును మనం ఇప్పటికీ చూడవచ్చు.

ఇంతలో ఆలయ ప్రధాన ద్వారంలో కూర్చున్న రాజుగారి కాపలాదారులు కన్హోపాత్ర ఏమైందని పూజారిని అడిగారు. ఆమె ఇప్పుడు విఠల్‌లో కలిసిపోయిందని, ఆమె ఇక లేదని వారు చెప్పారు. కాపలాదారులు ఆమె శవాన్ని చూపించమని అడిగారు, పూజారి అది చెట్టుగా మారిందని చెప్పాడు. కాపలాదారులు వారు చెప్పిన మాటలు నమ్మలేదు మరియు పూజారిని పట్టుకుని రాజు వద్దకు తీసుకెళ్లారు. పూజారి ఆలయం




నుండి కొబ్బరికాయ మరియు బుక్కను ప్రసాదంగా రాజుకు సమర్పించి జరిగిన విషయం చెప్పాడు. రాజు కొబ్బరికాయను తీసుకున్నప్పుడు కొబ్బరికాయలో వెంట్రుకలు కనిపించాయి మరియు దేవుడికి సమర్పించిన కొబ్బరికాయలో ఇది ఎలా వచ్చిందని పూజారిని అడిగాడు. పూజారి భయపడి, అది ఎలా వచ్చిందోనని కంగారు పడ్డాడు. అది విఠల్ కేశాలని రాజుకు చెప్పాలని నిర్ణయించుకున్నాడు. రాజు నమ్మలేదు మరియు ఇది నిజమేనా అని అడిగాడు. అప్పుడు పూజారి పందరీకి వచ్చి స్వయంగా చూడమని చెప్పి, రాతపూర్వకంగా కూడా ఇచ్చాడు. రాజు పంఢర్‌పూర్‌కు వచ్చి దేవుడిని దర్శించి వారు అతని గురించి వివరించినది నిజమో కాదో తనిఖీ చేయాలని నిర్ణయించుకున్నాడు. అతను ఆలయంలోకి ప్రవేశించి దేవుడికి నమస్కరించి, దేవుని పడక గదికి వెళ్లి దేవుడిని చూశాడు. అప్పుడు అతను దేవుని అద్భుతమైన కిరీటం, అందమైన గిరజాల జుట్టు, అతని తామర కళ్ళు, అతని మొసలి చెవి రింగులు మరియు అతని మెడలోని కౌస్తుభాన్ని చూశాడు. రాజు ఇది చూసిన క్షణంలో పశ్చాత్తాపపడి, పూజారితో, వారు వివరించిన విధంగానే స్వామిని చూశానని చెప్పాడు. అప్పుడు అతను దేవుని ముందు సాష్టాంగపడి, అతని పాదాలను ఆలింగనం చేసుకున్నాడు మరియు విఠల్‌తో ఐక్యం కావడంలో కన్హోపాత్ర యొక్క అదృష్టమే గొప్పదని చెప్పాడు.

ఆలయ ఆవరణలో సమాధి ఉన్న ఏకైక వ్యక్తి ఆమె. కన్హోపాత్ర, ఆమె సన్యాసి-కవులు చోఖమేలా (14వ శతాబ్దం) మరియు నామదేవ (c.1270–c.1350)ల సమకాలీనురాలు. కన్హోపాత్ర అనేక అభంగాలను స్వరపరిచింది. ఆమె కవితా శైలి అర్థం చేసుకోవడానికి సులభంగా మరియు సరళమైన వ్యక్తీకరణతో వివరించబడింది. కన్హోపాత్ర కవిత్వం "అణగారిన వారి మేల్కొలుపు" మరియు స్త్రీ సృజనాత్మక వ్యక్తీకరణ యొక్క పెరుగుదలను ప్రతిబింబిస్తుంది. కన్హోపాత్ర తన కష్టాలను అంతం చేయమని విఠోబాను వేడుకుంటుంది. 'అభంగ పతితా తు పావనహేలో', ఆమె తన ప్రభువును పడిపోయినవారి రక్షకునిగా గుర్తించి, తనను కూడా రక్షించమని అడుగుతుంది.

సంత్ కన్హోపాత్రా పంఢర్‌పూర్‌లో ఉన్న సమయంలో అనేక అభంగాలను స్వరపరిచారు, అయితే వాటిలో 30 మాత్రమే ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. వాటిలో 23 వార్కారీ సాధువుల సంకలనంలో చేర్చబడ్డాయి.

"నాకో దేవరాయ అంత ఆతా పాహు, ప్రాణ్ హా సర్వత జౌ పాహే" ఆమె అత్యంత ప్రజాదరణ పొందిన సృష్టి, అంటే "ఓ ప్రభూ, దయచేసి నా సహనాన్ని పరీక్షించవద్దు; నా ఆత్మ ఈ శరీరాన్ని విపరీతంగా విడిచిపెట్టాలనుకుంటోంది."



శరీరాన్ని మనస్సును తన సర్వస్వాన్నీ పాండురంగానికే అర్పించిన కన్హోపాత్రను ఆ కమనీయ విగ్రహుడు అనుగ్రహించాడు. స్వామి స్వీకరించాడు. ఆమె ప్రాణాలు అనంత వాయువులలో కలిసిపోయాయి. ముఖంపై చెరగని చిరునవ్వు అట్లాగే మిగిలి వుంది. తృప్తితో కూడిన మందహాసమది. అమాయకమైన చిన్న పిల్లల మనస్తత్వం కలిగిన ఆమెకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. తన స్వధామానికి తాను చేరుకుంది.

కాబట్టి, కన్హోపాత్ర జీవితం, భగవంతుడు తన భక్తులను ఎన్నటికీ విడిచిపెట్టడని మనకు బోధిస్తుంది. కావలసిందల్లా ఒక్కటే సర్వకాలములలో ఆ పరమాత్మునిపై మన హృదయాలలో నిజమైన భక్తి కలిగి ఉండడమే!

**ఓం నమో భగవతే వాసుదేవాయ**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా|| విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## బ్రహ్మ పురాణాంతర్గతము

**గత సంచిక తరువాయి**

ఆ తరువాత ఆ బోయవాడు భగవంతుడాదేశించిన విధంగా ఆ పుట్టలోనున్న వరాహస్వామి విగ్రహాన్ని బయటకు తీసి, పుష్కరిణికి వాయవ్యదిక్కున ఆలయాన్ని నిర్మింపజేసి ఆగమశాస్త్ర విశారదులైన వారిచే యథావిధిగా భగవంతుని ప్రతిష్ఠంపజేసి పూజలు జరిపించాడు. అప్పుడు వరాహరూపంలో ఉన్న సాక్షాత్తు శ్రీహరి ఆ బోయవానితో యిలా అన్నాడు.

పూర్వం సేవ్యం విమానం మే తీర్థం చ శ్రీనివాసతః ।
తతః ప్రభృతి తత్తీర్థం పూర్వం సేవ్యం బభూవహ ॥

**-బ్రహ్మపురాణం. అ. 8. శ్లో. 32.**

ఓ నిషాదా ! శ్రీనివాసుని కంటె ముందుగా నా ఆలయాన్ని, నా తీర్థాన్ని భక్తులు సేవించాలి ! అని ఆదేశించాడు. అప్పటినుండి ఆ వరాహ తీర్థాన్ని భక్తులు ముందుగా సేవిస్తున్నారు. వరాహపుష్కరిణికి ఉత్తరంగా కుబేరుడు నిర్మించిన ధనద తీర్థమున్నది. దానిలో స్నానంచేసిన వారికి పాపాలన్నీ పోయి సంపదలు చేకూరుతాయి. ఈశాన్యదిశలో గాలవుడు నిర్మించిన తీర్థమున్నది. ఆ తీర్థాన్ని పానం చేయుట వలన, ఆ తీర్థంలో స్నానం చేయుట వలన భుక్తి, ముక్తి లభిస్తాయి. తూర్పు వైపున మార్కండేయుడు నిర్మించిన మార్కండేయ తీర్థముంది. దానిలో స్నానం చేస్తే దీర్ఘాయుష్మంతులవుతారు.

ఆగ్నేయదిశలో అగ్నిదేవుడు నిర్మించిన ఆగ్నేయ తీర్థమున్నది. అది సర్వపాపాలను పోగొడుతుంది. దక్షిణ దిక్కున యమతీర్థమున్నది. ఇది నరక బాధలనుండి కాపాడుతుంది. అక్కడే వశిష్ఠుడు నిర్మించిన వశిష్ఠ తీర్థం కూడా ఉన్నది. నైరుతిదిక్కున వాయవ్య దిక్కులలో వారుణ, వాయు తీర్థాలున్నాయి. వాటిలో స్నానం చేసిన వారికి వెంటనే ముక్తి లభిస్తుంది.

వరాహపుష్కరిణి మధ్యలో సరస్వతీ తీర్థముంది. ఇది మహా పాతకాలను నశింపచేస్తుంది. మానవుడు ఈ తొమ్మిది తీర్థాలలో ఒకేరోజు స్నానంచేసి ఆ తరువాత శ్రీనివాసుని దర్శించినచో అతనికి పునర్జన్మ ఉండదు.

స్వామి పుష్కరిణి స్నానం శ్రీనివాసస్య దర్శనమ్ ।
సహస్రనామ పఠనం నాల్పస్య తపసః ఫలమ్ ॥

**-బ్రహ్మపురాణం. అ. 8. శ్లో 39.40.**

స్వామి పుష్కరిణిలో స్నానం చేయడం, శ్రీనివాసుని దర్శించడం, సహస్ర నామపారాయణ, చేయడం, ఈ మూడూ గొప్ప తపస్సు చేసిన వారికి గాని లభించవు. ఈ పైన చెప్పిన తొమ్మిది తీర్థాలలో స్నానం చేయక పోయినా, వరాహస్వామిని దర్శించకపోయినా వారి యాత్ర నిష్ఫలమవుతుంది. శ్రీనివాసుడు తృప్తి చెందడు. అటువంటి వారికి భగవంతుడు ధర్మార్థ కామ మోక్షాలనే నాలుగు పురుషార్థాలను ప్రసాదించడు. కావున ఈ చెప్పిన తీర్థ మాహాత్మ్యాన్ని వరాహస్వామి మహిమను

విననిచో వారు చేసే తీర్థయాత్ర బూడిదలో హోమం చేసినట్టుగా వ్యర్థమౌతుంది కావున ఓ మహాత్మా ! నీవు ఎల్లప్పుడు భగవత్కథలను వినుము. అని దుర్వాసమహర్షి దిలీప మహారాజుకు చెప్పాడు.

**తీర్థ యాత్రా మహిమ :**

దిలీపుడు దుర్వాస మహర్షితో మునిశ్రేష్ఠా ! తీర్థ యాత్రలు చేసేటప్పుడు పాటించవలసిన పద్ధతు లేమిటి ?

ఏ సమయంలో చేస్తే ఏమి ఫలితం వస్తుంది ? నాకు వీటిని వివరించి చెప్పండి. ఎంత విన్నా నాకు తృప్తి కలుగడం లేదు అని అడుగగా దుర్వాసమహర్షి దిలీపునితో యిలా చెప్పాడు.

మహారాజా ! కర్మభూమియైన ఈ భారతవర్షంలో పుట్టినవాడు సంస్కారమును పొంది, సంస్కరింపబడి బాల్యంలో విద్యాభ్యాసం చేసి, యౌవనంలో వివాహం చేసుకోవాలి. ఆ తరువాత శాస్త్రములలో విశ్వాసం బలపడుటకై దంపతులిరువురు తీర్థయాత్రలు చేయాలి. కర్మలు మూడు విధాలు 1. నిత్యకర్మలు 2. నైమిత్తిక కర్మలు. 3. కామ్య కర్మలు. తీర్థయాత్రలను నైమిత్తిక కర్మలని పెద్దలు చెబుతారు.

పుణ్యక్షేత్ర మహిమలు, తీర్థముల మహిమలు తెలుసుకొని ఆయా క్షేత్రములలో తీర్థములలో ఆచరింపవలసిన విధి విధానములను తెలుసుకొని ఆచరించేవారికి, అవేవీ తెలియనివారికంటే ఫలిత మెక్కువగా ఉంటుంది. ధ్యాన యోగులు తీర్థయాత్రలు చేయనవసరం లేదు. వారికి ఈ తీర్థ యాత్రా సమయంలో ధ్యానం కుదరక మనస్సుకు ఏకాగ్రత చెడుతుంది. కావున వారికి తీర్థయాత్రల వలన ప్రయోజనం లేదు. ధ్యానయోగం చెడుట వలన జ్ఞానం నశిస్తుంది. జ్ఞాన హీనులు అపమార్గంలో వెళ్ళి చివరకు నరకాన్ని పొందుతారు.

అలాగే వేదాధ్యయనం చేయనివాడు, సత్కర్మలు ఆచరించనివాడు తీర్థయాత్రలు చేసి ప్రయోజనంలేదు.

అతనికి కేవలం యాత్రవలన కలిగెడి శ్రమ మాత్రమే మిగులుతుంది కాని పుణ్యం లభించదు. మంచివారితో సహవాసం చేస్తూ సత్కథాశ్రవణం చేస్తూ సదాచార పరాయణుడై తీర్థయాత్ర చేసేవాడు బ్రహ్మపదాన్ని పొందుతాడు.

**సత్సంగీ సత్కథాంశృణ్వన్ సదాచారసమన్వితః ।**
**తీర్థయాత్రాం ప్రకుర్వాణో బ్రహ్మ నిర్వాణ మృచ్ఛతి ॥**

**-బ్రహ్మపురాణం. అ. 9. శ్లో. 8.**

శాస్త్రవిధి తెలిసిన పెద్దలతో పాటు వాటిని తెలుసుకొని తాను కూడా పాటిస్తూ తీర్థయాత్ర చేసేవారికి సకల పాపాలు నశించి మోక్షం లభిస్తుంది. పరమపదం లభిస్తుంది. మానవుడు కోరికలతో కర్మలు చేయరాదు. అలా చేయటం వలన మరల జన్మ వస్తుంది. జన్మించటం వలన మరల కర్మలు చేస్తాడు. కర్మలు చేయడం వలన జన్మ వస్తుంది. అందువలన దైహికా ముష్మికమైన కర్మలన్నిటినీ నిష్కామంగా చేయాలి. అటువంటి వారికి ఇహపరాల్లో సకలం సిద్ధిస్తాయి.

మానవులందరికీ విద్య వలన, జ్ఞానం వలన మననం సిద్ధిస్తుంది. విద్యలను అభ్యసించుట వలన, పెద్దల నుండి శాస్త్ర విషయములను విని తెలుసుకొనుట వలనను, మననము వలనను పరోక్షజ్ఞానము, అపరోక్ష జ్ఞానము కొంత అలవడుతుంది. ప్రత్యక్షంగా దర్శించిన శాస్త్ర విషయములలో ఎక్కువ శ్రద్ధ కలుగుతుంది. శ్రద్ధ వలన భక్తి పుడుతుంది. ఆ భక్తి వలన భగవంతుడు సంతుష్టుడవుతాడు.

కావున శాస్త్రార్థములు చర్చిస్తూ, వాటిని వింటూ తీర్థయాత్రలు చేయాలి. శాస్త్రార్థముల వలన భగవంతుని గురించి మనసులో అవగాహన ఏర్పడుతుంది. దేవతలు, ఋషులు ఆ విధంగ శాస్త్రాలాపములు చేస్తూ అధోక్షజుడైన భగవంతుని ఉపాసిస్తూ ఆ పరమాత్మను గురించి జ్ఞానాన్ని పొందారు. వసిష్ఠాది మహర్షులు, దేవతలందరూ కూడా తీర్థస్థలములలో నివాసమేర్పరచుకొని యోగసమాధి ద్వారా పరమపదాన్ని పొందారు.

వేద శాస్త్ర జ్ఞానం లేనివాళ్ళు, కర్తవ్యతా జ్ఞానం లేని వాళ్ళు కాకులు కప్పల వలె స్నానఫలాన్ని పొందలేరు. సకల విద్యలభ్యసించిన వాళ్ళు, పుణ్యాత్ములు, స్నానాది సత్కర్మలనాచరించి నిర్మల మనస్కులై ఆత్మజ్ఞానము కలిగి మోక్షాన్ని పొందుతారు. నిరంతరం సత్కర్మలాచరించుట వలన జ్ఞాన విజ్ఞానములు కలిగి అపరోక్ష జ్ఞానమునకు కావలసిన భక్తి, శ్రద్ధ, వైరాగ్యము కలిగి క్రమంగా ఆ పుణ్యాత్ములకు కైవల్యం సిద్ధిస్తుంది. భగవంతుని దర్శించిన, వినిన, అనుభవం కల దేవతలు, ఋషులు కూడ ఆ విధంగ చిత్తశుద్ధి కొరకు పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ తీర్థయాత్రలు చేస్తారు. అటువంటప్పుడు భక్తి శ్రద్ధలు లేని మానవులు తీర్థయాత్రలు చేయాలని వేరే చెప్పనక్కరలేదు.

మానవుడు విద్యల నభ్యసించి సత్సాంగత్యం చేస్తూ భగవత్కథలను వింటూ, యితరులకు వినిపిస్తూ సత్పురుషులతో కూడి తీర్థవైభవాన్ని వింటూ ఆనందంతో కూడినవాడై శ్రద్ధా భక్తులతో తీర్థయాత్రలు చేయాలి. ఆ విధంగ తీర్థయాత్రలను చేసేవారు పాపరహితులై పరమగతిని పొందుతారు. మహారాజా ! నీవు ఈ విధంగా తీర్థయాత్రలు ఆచరించి ఆ జనార్దనుని సంతోషపెట్టు. నీ ధనధాన్యాదులను భక్తితో భగవంతునికి సమర్పించు. అలాగే సదా జాగరూకుడవై వేంకటాచల యాత్రను చేయి! అని దుర్వాసమహర్షి దిలీపునికి తీర్థయాత్రా వైభవాన్ని వివరించాడు.

**వేంకటాద్రిలో చేయవలసిన దానములు :**

దిలీపుడు దుర్వాసమహర్షిని ఓ మునివర్యా వేంకటాద్రిలో శ్రీనివాసుని ప్రీతి కొరకు ఏ ఏ దానాలు చేయాలో తెలియజేయండి అని అడిగాడు. అప్పుడు దుర్వాసమహర్షి వేంకటాద్రిలో చేయవలసిన దానములను గురించి ఈ విధంగా వివరించాడు.



ఈ వేంకటాద్రిలో చేయవలసిన దానములను వివరిస్తాను. శ్రద్ధగా విను. ఇక్కడ అన్నదానం. పితృదేవతల నుద్దేశించి పెట్టే శ్రాద్ధము ప్రశస్తమైనవి. భగవంతుని ప్రీతికొరకై యిక్కడ సువర్ణ దానం. చేసేవారు అమృతత్వప్రాప్తి రూపమైన మోక్షాన్ని పొందుతారు. వస్త్రదానం చేస్తే ఆయుష్షు వృద్ధి చెందుతుంది. పితృదేవత లందరు వేంకటాచలంలో శ్రాద్ధములు చేసి, పిండ ప్రదానము చేయాలని కోరుకుంటారు. అలా చేస్తే పితృదేవతలు చాలా సంతోషిస్తారు. వారికి ఉత్తమ గతులు కలుగుతాయి. విష్ణుప్రీతికై కపిలగోవును దానం చేస్తే ఆ గోవు శరీరంపై ఎన్ని రోమాలున్నాయో అన్ని సంవత్సరాలు విష్ణులోకంలో నివసిస్తారు. దేవ దేవుని కైంకర్యం నిమిత్తమై ఆవును కాని, ఎద్దును గాని, భూమిని కాని భక్తితో దానం చేసినవారు తెలిసీ తెలియక చేసిన పాపముల నుండి వెంటనే విముక్తులై మోక్షాన్ని పొందుతారు. భగవంతుని కొరకు ఆవునుగాని, ఎద్దును గాని దానం చేసినవారు మోక్షాన్ని పొందుతారు. వారికి పునర్జన్మ లేదు.

విష్ణు ప్రీతికై కర్పూరాన్ని, చందనాన్ని, శంఖాన్ని ఆభరణాలను సమర్పిస్తే గురుతల్పంపై శయనించిన దోషం పోతుంది. జగత్ప్రభువుకు గొప్ప ఆభరణములను సమర్పించి ఆరాధించేవారు దేహాంతంలో ఆత్మానుభవాన్ని పొందుతారు.

భగవంతుని రథోత్సవానికై రథాన్ని నిర్మించేవారు కోటి కన్యాదానముల ఫలాన్ని, పదివేల గోదానముల ఫలాన్ని పొందుతారు. శ్రీవేంకటాచలంలో శ్రీమహా విష్ణువునకు ఛత్రచామరాదులను, పూల మాలలను సమర్పించేవారు బ్రహ్మ కల్పాంతం వరకు చక్రవర్తియై సకల భోగాలను అనుభవించి తన పితృ, పితామహులతో పాటు మోక్షాన్ని పొందుతారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన భగవానునికి ఏనుగును గాని, గుర్రాన్ని గాని సమర్పించినవారు లోకపాలకులౌతారు ఇందుకు సందేహం లేదు.

మధుసూదనునికి తమకిష్టమైన ఏ ఏ వస్తువులైనను భక్తితో సమర్పిస్తే దానివలన అక్షయమైన ఫలాన్ని పొంది వైకుంఠంలో ఆనందాన్ననుభవిస్తారు. పాత్రతనెరిగి దానం చేయాలి. సత్పాత్రదానం విశేషఫలప్రదం. ఇక్కడ సాక్షాత్తు శ్రీహరియే దాన పాత్రుడు కావున ఆయనకు సమర్పించిన అనంత ఫలితాన్నిస్తుందనడంలో సందేహం లేదు. ఇక్కడ భగవంతునికి ఏ కొద్ది మాత్రము సమర్పించిన అది మోక్షాన్ని, ప్రసాదిస్తుంది. వేంకటాచలంలో పర్వదినాలలో శ్రోత్రియుడైన, సదాచారపరుడైన బ్రాహ్మణోత్తమునికి ఏ కొంచెం దానం చేసిన అది మర్రివిత్తనం వలె అనంతంగా వృద్ధిచెందుతుంది.

మోక్షాన్ని కోరేవాడు కన్యాదానం, భూదానం, విద్యా దానములను చేయాలి. ఈ మూడు దానములతో సమానమైన దానము ముల్లోకాలలోను లేదు.

**ముక్తి కామేన దాతవ్యా కన్యా పృథ్వీ సరస్వతీ ।**
**న తాసాం సదృశం దానం త్రిషు లోకేషు విద్యతే ॥**

**-బ్రహ్మ. పు. అ. 10. శ్లో. 18.**

భగవత్ప్రీతికై సంగీతము, వాద్యము, నృత్యము మొదలైన కైంకర్యములను చేసేవారు కోటి మహాపాతకముల నుండి వెంటనే విముక్తులౌతారు. భగవంతునికి ధ్వజ పతాకాదులతో సపర్యలు చేసేవారు సకల పాపవిముక్తులై పరమగతిని పొందుతారు. పరమాత్మకు గంటను సమర్పించేవారు దివ్యజ్ఞానాన్ని, కీర్తిని పొందుతారు. శ్రీమహావిష్ణువునకు ధ్వజాలతో, గరుడాది వాహనాలతో ఉత్సవం చేయించేవారు దేవేంద్ర పదవిని పొంది, అమరలోక సుఖాలనుభవించి, ఆ తరువాత మోక్షాన్ని పొందుతారు.

ఐదు పర్వదినాలలో (పౌర్ణమి, అమావాస్యమొ॥) భగవంతునికి ఉత్సవాలు చేయించేవారి వేయి అపరాధాలను స్వామి క్షమిస్తాడు. ఇందుకు సందేహం లేదు. వారు ఈ లోకంలో సకల భోగాలు అనుభవించి మరణానంతరం మోక్షాన్ని పొందుతారు. భగవంతునికి షడ్రసోపేతమైన నైవేద్యములను సమర్పించేవారు ఐహిక ఆముష్మిక సుఖాల నన్నిటిని పొందుతారు. లక్ష్మీపతికి సహస్ర నామాలతో పూజ చేయించేవారు అన్నిరకముల పూజలు చేసినట్లే. ఇందుకు సందేహం లేదు.

గోరువంకలు, చిలుకలు మొదలగు పక్షులను, కోతులు. సారంగములు, జింకలు, అడవి ఆవులు మొదలగు అడవి మృగములు భగవంతునికి సమర్పించేవారు స్వర్గాన్ని పొందుతారు. సుందరమైన పూలతోటలను, అనేక రకముల ఉద్యానవనములను భగవంతుడు క్రీడించుటకు అనువైన భవనములను (ఆలయములను) నిర్మించేవారు ముక్తులవుతారు. ప్రతిరోజు విష్ణు సన్నిధానములో దీపారాధన చేసేవారికి వేయి బ్రహ్మహత్యా పాతకములు, పది వేల గురు తల్పగత పాపములు, అలాగే ఇతరములైన కోట్లకొలది మహాపాతకాలు, సూర్యుడు మంచును కరిగించినట్లు నశిస్తాయి.

## విష్ణు వర్ధనుడనే ద్విజ బంధువు వృత్తాంతం :

ఈ సందర్భంగా ఒక ప్రాచీన గాథను చెబుతాను, దీనిని వింటే పాపాలన్నీ పోతాయి. సకల శుభాలు కలుగుతాయి. పూర్వం విష్ణువర్ధనుడనే ఒక బ్రాహ్మణ బంధువు (భ్రష్ట బ్రాహ్మణుడు) ఉండేవాడు. అతడు కోపంతో తన గురువైన దేవస్వామిని చంపి, ఆ గురువుగారింట్లో సేవకావృత్తి చేస్తూ, ధర్మ పథాన్ని వీడి ఆ గురువుగారి వేయిమంది భార్యలతో సహవాసం చేశాడు. కాముకుడై యథేచ్ఛగా వారితో సంచరించాడు. ఇలా కొంతకాలం గడువగా ఆ పాపాత్మునికి పాపఫలితంగా శ్వేతకుష్ఠువ్యాధి వచ్చింది. ఆ వ్యాధితో అతని శరీరమంతా అసహ్యంగా తయారయ్యింది. అవయవాలన్నీ కుళ్ళిపోయి ముక్కలు ముక్కలుగా ఊడిపోవనారంభించినాయి. అతని వలన భ్రష్టులైన ఆ గురుపత్నులు దరిద్రులై దుఃఖించారు. ఐశ్వర్యమదంతో బలాత్కారంగా భ్రష్టులైన వారు లోకాపవాద భీతిచే ఇంటికీ నిప్పంటించుకొని మరణించారు. విష్ణు వర్ధనుని బంధువులందరూ బహిష్కరించారు. ఆ దుర్మార్గుడు చివరకు అడవుల పాలై దిక్కులేని చావు పొందాడు. అడవిలోని నక్కలు అతని శవాన్ని పీక్కు తిన్నాయి. యమకింకరులు వచ్చి అతన్ని భయంకరమైన కోలాహలంతోకూడిన నరకానికి తీసుకువెళ్ళారు. అక్కడ అతను అన్ని విధములైన నరక బాధలననుభవించాడు.

ఆ తరువాత అతని కుమారుడు వేదుడనే వాడు తండ్రి పాప కార్యములను తలచుకొని విచారించి ఆ పాప శాంతికై వేంకటాచలానికి వెళ్ళి దేవదేవుని సన్నిధిలో రాత్రింబవళ్ళు వెలిగేటట్టుగా అఖండ దీపారాధన చేశాడు. మహారాజా ! ఆ దీపారాధన చేసిన పుణ్యం వల్ల అతని తండ్రి పాపములన్నీ నశించి అతను యమదూతలను ధిక్కరించి వైకుంఠానికి వెళ్ళాడు. కావున భగవంతుని సన్నిధిలో దీపారాధన చేసేవారికి దుఃఖాలు దూరమవుతాయి. వేంకటాద్రిపై ఏ కొంచెం దానం చేసినా అది కల్పాంతం వరకు మర్రి విత్తనం వలె అవిచ్ఛిన్నంగా అభివృద్ధి చెందుతుంది.

**తస్మాద్దీపప్రదో మర్త్యో న పునర్దుఃఖమశ్నుతే ।**
**యత్కించిత్కురుతే దానం వేంకటాచలమూర్ధని ।**
**తదా కల్పమవిచ్ఛిన్నం వర్ధతే వటబీజవత్ ॥**

**-బ్రహ్మపురాణం. అ. 10. శ్లో. 40,41.**

ఈ వేంకటేశ్వర వైభవాన్ని ఆసాంతం విని కృత నిశ్చయంతో వేంకటాద్రి యాత్రకు బయలుదేరి వెళ్ళేవారు ప్రతి అడుగుకు అశ్వమేధయాగఫలాన్ని పొందుతారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. వేంకటేశ్వరుని మాహాత్మ్యంలో ఒక్క శ్లోకాన్ని గాని, అర్ధ శ్లోకాన్నిగాని, ఒక్క పదాన్ని గాని, కనీసం ఒక్క అక్షరాన్నైనా ఎవరైతే భక్తితో పఠిస్తారో వింటారో వారు బ్రహ్మహత్యాది మహాపాతకాలనుండి ఇతర ఉప పాతకాలనుండి విముక్తులవుతారు. సూర్యుడు మంచును కరిగించినట్లు వారి పాపాలన్నీ నశిస్తాయి. శ్రీవేంకటాచల మాహాత్మ్యపారాయణ శ్రవణాదులు ఎవరి గృహంలో జరుగుతాయో వారు ఆయురారోగ్య ఐశ్వర్యాదులను పొంది చివరలో విష్ణు పదాన్ని పొందుతారు.

## బ్రహ్మోత్తర ఖండం

**బ్రహ్మసభలో వసిష్ఠుడు :**

శౌనకాది మహర్షులు సూతమహర్షితో ఓ సూత పౌరాణికా ! వేద వేదార్థ తత్త్వజ్ఞా ! వేద వ్యాస కృపా పాత్రా! తీర్థాలన్నిటిలో సకల పాపాలను పోగొట్టే పుణ్యతీర్థాన్ని గురించి మాకు చెప్పండి అని అన్నాడు అప్పుడు సూతమహర్షి ఓ మహర్షులారా ! సర్వపాపాలని పోగొట్టేది, వినినంతనే ప్రత్యక్ష పరోక్ష ఫలాలను యిచ్చునది, పుణ్య ప్రదమైనది, సకల ఋషి సమ్మతమైన కథను మీకు చెబుతాను. మీరు ఏకాగ్ర చిత్తంతో ఇతర విషయములను ఆలోచించకుండా ఇతర పనుల యందు మనసు పెట్టకుండా ఆ పుణ్య కథామృతాన్ని గ్రోలండి, మీ బోటివారే యిటువంటి పుణ్యకథను వినుటకు తగినవారు.

పూర్వం మహాత్ములైన మహర్షులలో ఉత్తమోత్తములు, ద్విజశ్రేష్ఠులైన వసిష్ఠాదిమహర్షులు ఏదోపని మీద బ్రహ్మసభకు వెళ్ళారు. అక్కడ సిద్ధులు, దేవతలు, పుణ్యాత్ములైన చక్రవర్తులు, సనక సనందనాది మహాయోగా చార్యులు, గంగాది నదులు– సర్వతీర్థముల అధి దేవతలు, అలాగే మూర్తి మంతాలైన, అనంతాలైన వేదములు శాస్త్రములచేత సేవింపబడుతున్న చతుర్ముఖుడు, సురజ్యేష్ఠుడు అయిన బ్రహ్మదేవుని సమీపించి వసిష్ఠమహర్షి ఆయనకు ఆనందంతో నమస్కరించి ఈ విధంగా ప్రార్థించారు.

ఓ బ్రహ్మదేవా ! సకల లోక నాయకా ! అమరశేఖరా ! నీకు నమస్కరిస్తున్నాను. దయతో నన్ను వీక్షించండి ! అని సాష్టాంగ నమస్కారం చేసి పైకి లేచిన వసిష్ఠమహర్షిని దయతో వీక్షించి బ్రహ్మదేవుడు కూర్చోమన్నాడు. ఆ సభాకార్యక్రమాలన్నీ ముగిసిన తరువాత బ్రహ్మదేవుడు వసిష్ఠునితో నీ రాకకు కారణమేమిటి అని అడిగాడు. అప్పుడు వసిష్ఠమహర్షి వినయంతో వినమ్రుడై నమస్కరించి అపరిమిత తేజశ్శాలియైన బ్రహ్మదేవునికి ఈ విధంగా విన్నవించుకొన్నాడు.

పరమ పూజ్యా ! పంకజాసనా ! బ్రహ్మదేవా ! నీకు నమస్కారము. నాయందు ప్రసన్నుడవు కమ్ము, నేను మీకు కొంచెం విన్నవించుకుంటాను. ప్రభూ ! దానిని దయతో ఆలకించండి. నన్ను ప్రజలందరు వసిష్ఠ ! వసిష్ఠ! అని ఎంతో గౌరవిస్తున్నారు. కాని నాకదంతా దుఃఖాన్నే కలిగిస్తున్నదనుటలో సందేహం లేదు. నేను రాజ పురోహితుడననే విషయం తమకు తెలుసు పురోహితులకు చాలా పాపం సంక్రమిస్తుంది. రాజులు

చేసే పాపవులంతా పురోహితులకే సంక్రమిస్తుందని లోకంలో ప్రతీతి. కాబట్టి ప్రాయశ్చిత్తంతో పోగొట్టుకోవలసిన పాపం నాకు చాలా ఉంది. ఆ పాప శాంతి చేసికొనుటకై నేను సదా విచారిస్తున్నాను. ఇంకను మరొక విషయం మనవి చేస్తాను. మహాత్మా ! దానిని వినండి.

**జానాతి మాం రాజపురోహితం భవాన్**
**పురోహితానాం బహుళం హి పాపమ్ ।**
**తే రాజునో యద్యదఘం చరంతి**
**పురోహితానాం తదితి ప్రవాదః ॥**
**బ్రహ్మోత్తర ఖండం. అ. 50. శ్లో. 16**

## సర్వాబద్ధుని కథ :

ఒక గ్రామంలో సర్వాబద్ధుడనే బ్రాహ్మణుడున్నాడు. అతడు ఎల్లప్పుడు నన్నే స్మరిస్తుంటాడు. అతడు నాస్తికుడు, దుష్ట స్వభావుడు, దురాచారుడు, దరిద్రుడు, మహాపాపాత్ముడు. యజ్ఞాలు జరిగే అన్నిచోట్ల, బ్రాహ్మణ సదస్సుల్లో, సద్బ్రాహ్మణులు సమావేశమైన చోట ఏదో కొంచెం దక్షిణను ఆపేక్షించి అతను కూడా అక్కడకు వచ్చి కూర్చున్నాడు. అతనిని చూచి ఆ సదస్సులోని ఒక బ్రాహ్మణుడు కోపావేశంతో ఓ సర్వాబద్ధా ! ఈ బ్రాహ్మణ సదస్సులోకి నీవెందుకొచ్చావు ? స్నాన సంధ్యాదులు లేని నీవు వసిష్ఠుని వలె వచ్చి కూర్చున్నావు అని అన్నాడు.

అది విని సర్వాబద్ధుడు దుఃఖంతో మరో చోటికి వెళ్ళి అతడు నన్ను కోపంతో వసిష్ఠుని వలె ఉన్నాడన్నాడు. కాబట్టి ఆ వసిష్ఠుడే నన్ను రక్షించుగాక! అతడే నన్ను పవిత్రుణ్ణి చేయు గాక అని రోజూ అనుకుంటూ సర్వకాల సర్వావస్థలలోను నన్నే ధ్యానిస్తున్నాడు. అతనెప్పుడూ వసిష్ఠా, వసిష్ఠా అని నన్నే స్మరిస్తున్నాడు. శరీరంతోను, మనస్సుతోను, వాక్కుతోను అతను చేసే పాపాలకు అంతే లేదు.

ఎవరి పేరుతోనో ఆచరించే పాపాలు వంటివి మరెక్కడా వుండవని నా అభిప్రాయం. అయినప్పటికి అతడు నన్ను ఆశ్రయించాడు. కావున అతనియందు నాకు దయ కలిగింది. ఓ పితామహా ! రాజపురోహితుడుగా నాకు సంక్రమించిన పాపము నన్నాశ్రయించిన వాని పాపము నశించే మార్గాన్ని ఉపదేశించండి అని ప్రార్థించాడు. అంతట బ్రహ్మదేవుడు మునిశ్రేష్ఠుడైన వసిష్ఠునితో యిలా అన్నాడు. పాపాలు ప్రాయశ్చిత్తాలతో పోతాయి కదా ! కాబట్టి శాస్త్రాలలో చెప్పిన విధంగా ప్రాయశ్చిత్తాలు చేసుకొని మీ పాపాలను పోగొట్టుకోవచ్చు అని బ్రహ్మదేవుడు చెప్పగా వసిష్ఠమహర్షి మరల బ్రహ్మదేవునితో యిలా అన్నాడు.

స్వామీ! నేను చెప్పేది కొంచెం ఆలకించండి. నా పాపాలు అతని పాపాలు సామాన్యమైనవి కావు. చాలా గొప్పవి, అసంఖ్యాకమైనవి. అవి ప్రాయశ్చిత్తాలతో పోయేవి కావు. అందువలననే మీవద్దకు వచ్చాను. ఓ ధర్మాత్మా మీకు నమస్కరిస్తున్నాను. నిన్నే శరణు వేడుతున్నాను. మా యిరువురి పాపరాశులు ఎలా సులభంగా నశిస్తాయో ప్రత్యక్షంగా ఫలం ఎలా సిద్ధిస్తుందో ఆ ఉపాయాన్ని మాకు తెలియజేయండి అని ప్రార్థించాడు.

**బ్రహ్మదేవుని ఆజ్ఞతో వసిష్ఠాదులు వేంకటాద్రికి రాక :**

వసిష్ఠమహర్షి ఈ విధంగా ప్రార్థించగా బ్రహ్మదేవుడు కొంతసేపు ఆలోచించి తన మనస్సులో శ్రీహరిని ధ్యానించి వేంకటేశ్వరునికి నమస్కరించి వసిష్ఠునితో ఇలా అన్నాడు– వారణాసికి దక్షిణంవైపున వేంకటాద్రి అనే ప్రసిద్ధమైన పర్వతం ఉంది. అది విశ్వవిఖ్యాతి చెందింది. శ్రీవేంకటమనే పేరును ఉచ్చరించినంత మాత్రముననే అతడు దేవతలకు కూడా పూజ్యుడవుతాడు. ఆ పర్వతమంత మహత్తరమైనది. దానిలోని తీర్థాలన్నీ సకల పాపాలను పోగొడతాయి. ఆ వేంకటాచలంలో అరవై ఆరు కోట్ల తీర్థాలున్నాయి. వాటిల్లో ఉత్తమోత్తమమైనది స్వామి పుష్కరిణి దానికి దక్షిణం వైపున శ్రీమహా విష్ణువు లక్ష్మీదేవితో కూడా ఆనందంగా క్రీడిస్తున్నాడు

**వేంకటాద్రిరితి ఖ్యాతో విశ్వలోకైక సమ్మతః ।**
**శ్రీవేంకటాతి యన్నామ మర్త్యోవాచా వదన్నపి ॥**
**దేవానాం వందనీయత్వం యాతి తాదృఙ్మహీధరః**
**తత్ర తీర్థాని సర్వాణి సర్వపాపహరాణి చ ॥**
**షట్షష్టికోటితీర్థాని విద్యంతే వేంకటాచలే ।**
**స్వామి తీర్థమితి ఖ్యాతం సర్వతీర్థోత్తమోత్తమమ్ ॥**
**తత్తీరే దక్షిణే విష్ణుర్లక్ష్మ్యాసహ విమోదతే ॥**
**-బ్రహ్మపురాణం : అ. 50. శ్లో. 32.35**

అగస్త్య మహర్షి శంఖమహారాజు మొదలగు వారికి కోరిన వరాలను ప్రసాదించిన వేంకటేశ్వరునికి నమస్కరించినచో ఐహికాముష్మిక ఫలాలన్నీ లభిస్తాయి. ఆ వేంకటాద్రి మధ్యలో ఘోణతీర్థశ్రీ అనే పవిత్రమైన తీర్థముంది. దానిలో స్నానం చేస్తే సదా పవిత్రులవుతారు. సూర్యుడు మీనరాశిలో ఉండగా పౌర్ణమినాడు ఘోణ (తుంబురు) తీర్థంలో స్నానం చేస్తే సర్వపాపాలు నశిస్తాయి. నీవు నిన్నాశ్రయించిన సర్వాబద్ధుడు ఆ వేంకటాచలానికి వెళ్ళి ఫాల్గుణ పౌర్ణమినాడు ఆ ఘోణ తీర్థంలో స్నానం చేస్తే మీరిరువురు పవిత్రులవుతారు అని బ్రహ్మదేవుడు చెప్పగా వసిష్ఠమహర్షి ఆనందంతో ఆయనకు నమస్కరించి మిక్కిలి వేగంగా బ్రహ్మలోకంనుండి భూలోకానికి దిగి వచ్చి సర్వాబద్ధుని సమీపించి అతనితో యిలా అన్నాడు. ఓ బ్రాహ్మణా ! నీవు నన్ను ఎల్లప్పుడు స్మరిస్తూ నన్నాశ్రయించావు. నీ పాపపరిహారం కొరకు ఒక ఉపాయం చెబుతాను విను. నేను వేంకటాద్రికి వెళుతున్నాను. నీవు కూడా వెంటనే నాతోపాటు రా! ఇంక ఆలస్యం చెయ్యకు అని చెప్పగా ఆ సర్వాబద్ధుడు వసిష్ఠునితో పాటు వేంకటాద్రికి బయలుదేరాడు.

**(సశేషం)**

# అష్టాదశ సిద్ధులు

- గోనుగుంట మురళీకృష్ణ

శ్రీరాముడి ముద్రిక తీసుకుని సముద్రం దాటుతున్నాడు హనుమంతుడు సీతాన్వేషణ కోసం. కొంతదూరం వెళ్ళిన తర్వాత సింహిక అనే రాక్షసి సముద్రం మధ్యలో నుంచీ లేచి "ఓ వానరుడా! ఈరోజు సూర్యోదయం సమయానికి ముందుగా ఎవరు నా కంట బడతారో వారు నాకు ఆహారం అవుతారని బ్రహ్మదేవుడు నాకు వరం ఇచ్చాడు. నా నోటిలో ప్రవేశించు" అన్నది.

"అలాగే చేస్తాను. కానీ ఇప్పుడు అత్యవసర పనిమీద వెళుతున్నాను. తిరిగి వచ్చేటప్పుడు నీకు ఆహారం అవుతాను" అన్నాడు హనుమంతుడు. "అలా కుదరదు, ఇప్పుడే కావాలి" అన్నది సింహిక. హనుమంతుడు ఒక్కక్షణం ఆలోచించి సరే అన్నాడు. సింహిక పది యోజనాల వెడల్పు ఉన్న భయంకరమైన తన నోటిని తెరిచింది. హనుమంతుడు తన శరీరాన్ని ఇరవై యోజనాల వెడల్పు పెంచాడు. సింహిక ముప్పై యోజనాలు పెంచింది. ఆయన నలభై యోజనాలు పెంచాడు. మళ్ళీ యాభై యోజనాలు పెంచింది. ఆయన కూడా అరవై యోజనాలు పెంచాడు. సింహిక తన నోరు డెబ్బై యోజనాల వెడల్పు పెంచింది. హనుమంతుడు హటాత్తుగా సూక్ష్మరూపం లోకి మారి ఆమె నోటిలో ప్రవేశించాడు. ఆమె గ్రహించేలోపు చటుక్కున బయటకు వచ్చి "సింహికా! నువ్వు కోరినట్లు నేను నీ నోటిలో ప్రవేశించాను. బ్రహ్మ నీకు ఇచ్చిన వరం సఫలం చేశాను. సెలవు" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఈ సంఘటన విన్నప్పుడు సాధారణంగా "హనుమంతుడు దేవుడు. మహిమలను చూపించాడు" అనుకుంటారు సామాన్యులు.

అలాగే మహాభారతంలో కూడా కురుక్షేత్ర యుద్ధం ముగిసిన తర్వాత శ్రీకృష్ణుడు పాండవులను వెంటబెట్టుకుని ధృతరాష్ట్రుడి దగ్గరకు వచ్చి "మామా! పాండవులు విజయులై నీ ఆశీర్వాదం కోసం వచ్చారు" అని చెబుతాడు. విచారంగా కూర్చున్న ధృతరాష్ట్రుడికి కడుపు రగిలిపోతుంది. నూరుగురు కొడుకులను చంపిన వాడిని తీసుకువచ్చి ఆశీర్వదించమంటే కడుపు రగిలిపోదా ఏ తండ్రికైనా! "నాయనా భీమసేనా! రా నాయనా! ఆశీర్వదిస్తాను" అని పిలిచాడు. భీముడు రాబోతుంటే శ్రీకృష్ణుడు వారించి, ఒక ఉక్కు విగ్రహం ముందుంచుతాడు. ధృతరాష్ట్రుడు ఆ విగ్రహాన్ని కసిదీరా గట్టిగా అదిమి పిండిపిండి చేశాడు. నిజం తెలిసిన తర్వాత "వాసుదేవా! ఈ వృద్ధుడిని ఇంకా మోసం చేస్తున్నావా!" అన్నాడు. "మామా! ఇంత జరిగినా నీకు పామరత్వం పోలేదు. నేను ఉండగా పాండవులను ఎవరూ ఏమీ చేయలేరు" అన్నాడు శ్రీకృష్ణుడు (అప్పటినుంచీ మనసులో కపటం పెట్టుకుని పైకి అభిమానం నటిస్తూ కౌగిలించుకోవటాన్ని "ధృతరాష్ట్ర కౌగిలి" అనటం పరిపాటి అయింది).

ఇంతకీ శ్రీకృష్ణుడు భీముడి ఉక్కు విగ్రహాన్ని ఎక్కడి నుంచీ తెచ్చాడు? దుర్యోధనుడి మందిరంలో నుంచీ తెప్పిస్తాడు. దుర్యోధనుడి మందిరంలో భీముడి విగ్రహం ఎందుకు ఉన్నది? అని మళ్ళీ సందేహం వస్తుంది. ఎందుకంటే దుర్యోధనుడి ప్రధానమైన శత్రువు భీముడు. అతడిని తుదముట్టించటానికి చిన్నప్పటి నుంచీ అనేక ప్రయత్నాలు చేశాడు. ఎలాగైనా భీముడిని జయించాలనే ఇచ్ఛతో పాండవులు అరణ్య అజ్ఞాత వాసాలు చేసేటప్పుడు భీముడి ఉక్కు విగ్రహాన్ని తయారు చేయించి, దానితో పదమూడేళ్ళ పాటు గదాయుద్ధం సాధన చేస్తూ ఉండేవాడు. దాన్ని శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రుడి ముందు పెడతాడు.

ఇక్కడ కూడా సాధారణంగా "శ్రీకృష్ణుడు తలచుకుంటే చేయలేనిది ఏముంది?" అనుకుంటారు తప్ప లోతుగా ఆలోచించరు. కానీ వాస్తవానికి "అష్టసిద్ధులు" అని ఎనిమిది రకాల సిద్ధులు ఉంటాయి. అవేమిటంటే –

**"అణిమా మహిమా చైవ గరిమా లఘిమా తథా,**
**ప్రాప్తిః ప్రాకామ్య మీశత్వం వశిత్వం చాష్ట సిద్ధయః"**

అని శ్లోక రూపంలో చెబుతారు. ఇవన్నీ యోగసాధన ద్వారా లభిస్తాయి. సాధన చేసేవాడు యోగమార్గంలో ముందుకు వెళుతున్నప్పుడు ఒక స్థాయికి చేరుకుంటాడు. ఆ స్థాయిలో భౌతికమైన పరిస్థితులు దాటిపోతాడని యోగ శాస్త్రం చెబుతుంది. ఈ శ్లోకంలో –

**అణిమ = సూక్ష్మరూపం పొందటం**
**మహిమ = దీర్ఘకాయం పొందటం (లావు)**
**గరిమ = పొడవైన ఆకారం పొందటం**
**లఘిమ = దూదిపింజలా తేలికగా అవటం**
**ప్రాప్తి = దూరంగా ఉన్న వస్తువును తీసుకురావటం**
**ప్రాకామ్యం = కొత్త వస్తువులను సృష్టించటం**
**ఈశత్వం = అందరి మీద అధికారం పొందగలగటం**
**వశిత్వం = అందరినీ వశం చేసుకోవటం**

ఈ ఎనిమిదిటినీ అష్టసిద్ధులు అని అంటారు. ఇంతక్రితం హనుమంతుడు సింహిక నోట్లోకి వెళ్ళేటప్పుడు దీర్ఘకాయం "మహిమ" అనే సిద్ధి ద్వారా, సూక్ష్మరూపం "అణిమ" అనే సిద్ధి ద్వారా పొందుతాడు (హనుమంతుడిని "అష్టసిద్ధి నవవిధికే

దాతా” అని అంటాడు తులసీదాసు హనుమాన్ చాలీసాలో). అలాగే శ్రీకృష్ణుడు “ప్రాప్తి” అనే సిద్ధి ద్వారా దుర్యోధనుడి మందిరంలో ఉన్న భీముడి విగ్రహాన్ని దృతరాష్ట్రుడి దగ్గరకు తీసుకువస్తాడు.

ఇలాంటి సిద్ధులు హనుమంతుడు, వినాయకుడు, శ్రీకృష్ణుడు, వంటి వారికి ఉండేవని పురాణాలలో చెబుతారు. వాస్తవానికి ఈ సిద్ధులు పద్దెనిమిది అని శ్రీకృష్ణుడు భాగవతం-ఏకాదశ స్కంధంలో చెబుతాడు. ఇంకా అనూర్మిర్మితం (ఆకలి దప్పులకు లోను కాకుండా ఉండటం), మనోజవం (మనసుతో సమాన వేగం కలిగి ఉండటం), కామరూపం (కోరుకున్న రూపం ధరించటం), పరకాయ ప్రవేశం (ఒక శరీరాన్ని విడిచి వేరొక శరీరంలో ప్రవేశించటం), స్వచ్ఛంద మరణం (కోరుకున్నప్పుడు మరణించటం), సంకల్ప సిద్ధి (తలచుకున్న దానిని పొందటం), అప్రతిహతమైన ఆజ్ఞ (తన ఆజ్ఞకి తిరుగులేక పోవటం), అప్రతిహత గతి (తన గమనానికి అడ్డులేక పోవటం), దూర శ్రవణం (దూరంగా ఉన్నది వినటం), దూరదర్శనం (దూరంగా ఉన్నది చూడటం) మొదలైనవి.

అయితే ఇక్కడ మొదట చెప్పిన ఎనిమిది సిద్ధులూ శ్రీకృష్ణుడికి సంబంధించినవి. అంటే ఆ సిద్ధులను సాధించాలంటే, యోగి సాధన చేసేటప్పుడు మనసుని ఇంద్రియాల మీద నుంచీ మళ్ళించి, శ్రీకృష్ణమూర్తిని మనసులో నిలుపుకుని ధ్యానించాలి. ఆ స్థితిలో ధ్యానం చేసే యోగి, కృష్ణుడు ఏకమైన స్థితి ఏర్పడినట్లు అవుతుంది. ఆ విధంగా భగవంతుని యందు లీనం చేసిన యోగికి ఈ సిద్ధులన్నీ కైవసం అవుతాయి.

ఇక మిగిలిన పది సిద్ధులు గుణ ప్రధానములు. అంటే సత్యాధిక్యం ప్రధానమైనది. సత్యం ఆచరించటం ద్వారా కైవసం అవుతాయి. ఇవి శంతనుడు వంటి వారికి ఉండేవని పురాణాలు చెబుతాయి. ఆ విధంగా సాధించిన స్వచ్ఛంద మరణాన్ని భీష్ముడికి వరంగా ఇస్తాడు శంతనుడు.

★★★

# గురుభక్తి

**- సాయినాథ్**

పూర్వం కౌత్సుడు అనే పేద పిల్లవాణ్ణి విద్యాధరుడు అనే గురువుగారు తన ఆశ్రమానికి పిలుచుకువచ్చి తనకు తెలిసిన అన్ని విద్యలు నేర్పారు.

ఒకసారి గురువుగారు పనిమీద కొన్ని రోజులు బయటకు వెళ్ళారు. గురువుగారు తిరిగి వచ్చేవరకు కౌత్సుడు ఆశ్రమాన్ని చక్కగా చూసుకున్నాడు. గురువుగారు తిరిగి వచ్చిన కొన్ని రోజులకు కౌత్సుడి చదువు పూర్తయింది.

కౌత్సుణ్ణి తీసుకెళ్ళటానికి తల్లితండ్రులు వచ్చారు. కానీ కౌత్సుడు తాను గురువు గారి దగ్గరే ఉంటానని ఇంటికి రానని కరాఖండిగా చెప్పి తల్లితండ్రులను వెనక్కి పంపాడు. వాళ్ళు వెళ్ళిన తరువాత గురువు కారణం అడిగాడు. అప్పుడు కౌత్సుడు ఇలా చెప్పాడు. ‘‘గురువుగారూ మీరు కొన్ని రోజుల క్రితం బయటకు వెళ్ళినప్పుడు మీ జాతకం చూశాను. మీరు సమీప భవిష్యత్తులో భయంకరమైన రోగంతో ఇబ్బంది పడతారు. అందుకే మిమ్మల్ని వదిలి వెళ్ళలేను’’ అని చెప్పాడు.

కొన్ని రోజులకు గురువుగారికి క్షయ రోగం వచ్చింది. ఆ కాలంలో క్షయకు చికిత్స లేకపోవడంతో కాశీకి వెళ్ళి దానధర్మాలు పుణ్యకార్యాలు చేయాలని గురుశిష్యులు కాశీకి వెళ్ళారు. గురువుగారి రోగం చూసి కాశీ ప్రజలు అసహ్యించుకున్నారు. కానీ కౌత్సుడు గురువు గారికి సేవలు చేస్తూనే ఉన్నాడు. ఎంతోమంది గురువుగారిని వదిలి వెళ్ళమని సలహా ఇచ్చినప్పటికీ కౌత్సుడు మాత్రం గురువు గారిని వదలలేదు.

కౌత్సుడి గురుభక్తికి మెచ్చిన త్రిమూర్తులు అతణ్ణి పరీక్షించాలనుకున్నారు. మొదట బ్రహ్మ మారువేషంలో వెళ్ళి గురువుని వదిలేయమని సలహా ఇచ్చారు. కౌత్సుడు బ్రహ్మ చెప్పిన మాటలు వినలేదు. మరలా విష్ణువు మారువేషంలో వచ్చి సలహా ఇచ్చినా కూడా కౌత్సుడు వినలేదు. చివరికి పరమేశ్వరుడు వచ్చినా వినలేదు. మెచ్చిన పరమేశ్వరుడు ఏదైనా సహాయం కావాలా అని అడిగాడు.

మరెవరూ గురువును వదిలేయమని సలహా ఇవ్వడానికి రాకుండా కాపలా కాయమన్నాడు. అతని గురుభక్తికి మెచ్చిన త్రిమూర్తులు ప్రత్యక్షమయ్యారు. కౌత్సుడికి మోక్షం ఇస్తామన్నారు.

అప్పుడు కౌత్సుడు వారితో నాకు మీ గురించి చెప్పి, ఈరోజు మీరు ప్రత్యక్షం కావడానికి కారణమైన నా గురువే నాకు బ్రహ్మ. నా గురువే నాకు విష్ణువు. నా గురువే నాకు మహేశ్వరుడు.

మీరు సాక్షాత్కారం కావడానికి కారణమైన నా గురువే పరబ్రహ్మ అని అర్థం వచ్చేలా శ్లోకం చెప్పాడు.

**గురుబ్రహ్మ గురువిష్ణు గురుదేవో మహేశ్వరః**

**గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురువే నమః**

తన గురువు గారికి మోక్షం ప్రసాదించమని వేడుకున్నాడు. గురుభక్తికి మెచ్చిన త్రిమూర్తులు గురువుగారికి మోక్షం ప్రసాదించారు.

ఆనందంతో కౌత్సుడు తల్లితండ్రుల వద్దకు వెళ్ళిపోయాడు.



# తులసి

**– మందరపు వి.జి.శంకరాచారి**

**హిందూ ధర్మంలో తులసి పూజకు విశిష్టమైన స్థానం ఉంది. ప్రతిరోజూ తులసిని పూజిస్తే సర్వసంపదలూ ఒనగూరుతాయి. ఆయురారోగ్య ఐశ్వర్యములతో పాటు ముక్తికీ – మోక్షానికీ దారిని చూపే శక్తి గలది తులసిమాత. ద్వాపరంలో రుక్మిణీదేవి ఈ తులసీదళంతోనే పరమాత్మయైన శ్రీకృష్ణుడ్ని తూచగలిగింది.**

అటువంటి తులసి – గతజన్మలో విష్ణుమూర్తి భక్తురాలైనప్పటికీ – ఒకానొక సందర్భంలో తనయొక్క పాతివ్రత్యం మంట కలిపాడని నారాయణుడ్ని శపిస్తుంది. అయినా తులసి తన భక్తురాలు కనుక... కరుణామూర్తియైన వైకుంఠవాసుడు ఆమెను క్షమిస్తాడు. తులసిమాతగా జన్మను ప్రసాదించి అందరిచేత పూజింపబడే యోగ్యతను అనుగ్రహిస్తాడు. పురాణంలో చెప్పబడిన ఆ తులసి కథ గురించి సంక్షిప్తంగా...

పూర్వకాలంలో కాలనేమి అనే రాక్షసుడు ఉండేవాడు. అతడికి ఒక కూతురు జన్మించింది. ఆమెకు 'వృంద' అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచసాగాడు కాలనేమి. ఆమె దిన దిన ప్రవర్ధమానమవుతూ యవ్వనం వచ్చేసరికి అందాలరాశిగా మారిపోతుంది. ఆమెను చూస్తే ఎంతటివాడైనా సరే మోహంలో పడవలసిందే. చూపు తిప్పుకోలేని అందం 'వృంద'ది.

ఒకసారి వృంద తన స్నేహితురాళ్ళతో కలిసి వనవిహారానికి వెళ్తుంది. అప్పుడు అటుగా వచ్చిన 'జలంధర్' అనే రాక్షసుడు ఆమెను చూసి మోహిస్తాడు... ప్రేమిస్తాడు.

జలంధర్ సామాన్యుడు కాడు. తేజోవంతమైన శరీరాన్ని కలిగినవాడు. పరమశివుడియొక్క మూడోకంటి నుండి వెలువడిన క్రోధాగ్ని జ్వాలలతో జన్మించినవాడు. బ్రహ్మదేవుణ్ణి మెప్పించి వరాన్ని పొందినవాడు. పరమశివుడి చేతిలో తప్ప మరెవరితోనూ మరణం సంభవించకుండా వరాన్ని పొందాడు. అటువంటి మహావీరుడు 'వృంద'ని చూసి మోహించి కాలనేమి దగ్గరకు వెళ్ళి తను వృందను వివాహం చేసుకోదలచుకున్నట్లుగా చెబుతాడు. అయితే కాలనేమి అందుకు ఒప్పుకుంటాడు కానీ ఒక షరతు పెడతాడు.

తన దగ్గరకు వచ్చిన జలంధర్ తో 'జలంధరా! నీవు మహావీరుడవని... మన రాక్షస జాతికి తలమానికంగా నిలిచిన ఆణిముత్యానివని నాకు తెలుసు. అయితే మన రాక్షసజాతికి బద్ధశత్రువు విష్ణుమూర్తి. అటువంటి విష్ణుమూర్తిని నా కుమార్తె 'వృంద' ఆరాధిస్తుంది. భక్తితో పూజిస్తుంది. ప్రతిరోజూ అర్చన చేస్తూ తన్మయస్థితిని... అవ్యక్తమైన అనుభూతిని పొందుతుంది.

తను నాకు లేక లేక కలిగిన సంతానం కాబట్టి ఆమె మన శత్రువైన ఆ శ్రీహరిని పూజించి, ఆరాధిస్తూ ఉన్నా నేను ఆమెను

శిక్షించలేదు. తన కొరకు ఒక పూజామందిరాన్ని నిర్మించి మరీ ఆరాధన చేసుకోమని చెప్పాను. నీవు కూడా ఆమె భక్తిని పరిహసించకుండా అడ్డు చెప్పకుండా ఉన్నట్లయితే నా కుమార్తెను నీకిచ్చి వివాహం చేస్తాను. ఈ షరతుకి నీవు ఒప్పుకున్నట్లయితే 'వృంద'ని నీకిచ్చి వివాహం చేయుటకు నాకెటువంటి అభ్యంతరం లేదు అని చెబుతాడు.

ఆ షరతుకి ఒప్పుకున్న జలంధరుడు ఆమెను వివాహం చేసుకుంటాడు. ఆమె పూజలకి ఎటువంటి ఆటంకం కలిగించకుండా ఒక ప్రార్ధనా మందిరాన్ని ఏర్పాటు చేస్తాడు.

'వృంద' నిరంతరం నారాయణుడి ధ్యానంలో ఉండేది. ఆమె భక్తికి మురిసిన నారాయణుడు ఆమెకు తెలియకుండానే ఒక వరాన్ని అనుగ్రహిస్తాడు. 'వృంద' పాతివ్రత్యము వలన మరియు శ్రీమన్నారాయణుడిని అనుదినం పూజిస్తూ ఆరాధనలో గడపడం వలన భర్త జలంధరుడి శక్తి ద్విగుణీకృతమవుతుంది. అమిత బల సంపన్నుడిగా మారతాడు.ఏనాడైతే 'వృంద' తన యొక్క పాతివ్రత్య నియమం క్షణమైనా గతి తప్పితే ఆమె భర్త నిర్వీర్యుడవుతాడు. ఈ వరం ఆమె కోరకపోయినా అనుగ్రహించాడు. ఈ వరం వలన జలంధరుడు తనని వివాహమాడిన తర్వాత మహాశక్తివంతుడవుతాడు. అయితే సత్యం తెలియని వృంద తన భర్తకి గల శక్తి ద్విగుణీకృతం కావడం... తన భర్త వీరత్వమేనని భావిస్తుంది.



వృంద పాతివ్రత్య మహిమ వలన, మహాశక్తి వంతుడిగా మారిన జలంధర్ కి తను గొప్పవీరుడిననే అహం మదిలో కలుగుతుంది. ముల్లోకాలపై దండయాత్ర జరిపి అందర్నీ ఓడించి సృష్టి, స్థితి, లయ కారకుడ్ని తనేనన్న భావం అతడిలో ప్రజ్వరిల్లుతుంది.

ఈ భావం తన మదిలో అంకురించగానే పరమాత్మయైన శివుడినే జయించాలని తలపోస్తాడు. ఈ ఉద్దేశ్యంతో కైలాసానికి వెళ్ళి అక్కడ శివుడితో "పరమశివుడివైన నువ్వే ఈ సృష్టి, స్థితి, లయలకు కారణమనుకుని భూలోక ప్రజలు అందరూ నిన్ను పూజిస్తున్నారు. కానీ నా ప్రజలకు ఈ చరాచర ప్రపంచమునకు మూలపురుషుడిని. నీ తర్వాత నీ స్థానాన్ని పొందవలసినవాడను నేను. నీ మూడో నేత్రం నుండి జ్వలించిన క్రోధాగ్నిలో ఉద్భవించినవాడిని. నీ కుమారుడిని అయిన నాకు మాత్రమే నీ స్థానమును పొందుటకు అర్హత కలదు. అయితే నీవు జీవించినంత కాలము నేను నీ స్థానాన్ని పొందలేను. కాబట్టి నీతో యుద్ధం చేయవచ్చాను. మన ఇద్దరి సంగ్రామంలో నేను నిన్ను వధించి నీ స్థానమును అధిరోహించి ప్రజలచేత మన్ననలను అందుకుంటాను" అని శివుణ్ణి తను పరిపాలిస్తున్న ప్రాంతమునకు వచ్చి యుద్ధం చేయమని కోరతాడు.

అందుకు శివుడు "ఓరీ మూర్ఖా! నానుండి జన్మించిన నీకు అహంకారం పెరిగిపోయింది. తండ్రి స్థానంలో ఉన్న నాతోనే యుద్ధం చేయాలని ఉబలాటపడుతున్నావు. యుద్ధంలో నిన్ను హతమార్చి నీ రాక్షస పాలననుండి ప్రజలకు విముక్తి కలిగిస్తాను. ఇప్పుడే నీవు పరిపాలన సాగిస్తున్న ప్రాంతానికి పద అని జలంధర్ తో పాటుగా అతడు పరిపాలిస్తున్న ప్రాంతానికి వస్తాడు.

శివుడికి జలంధరుడికీ మధ్య భీకర సంగ్రామం మొదలవుతుంది. ఎవరికి వారు తీసిపోకుండా యుద్ధం చేస్తూ ఉంటారు. 'వృంద' పాతివ్రత్య మహిమ వలన, విష్ణుపూజ వలన జలంధర్ కి క్షణ క్షణమూ శక్తి పెరిగి ఉత్సాహం, అలసట కానరాకుండా యుద్ధం చేస్తూ ఉంటాడు.

వీరిద్దరి భీకర సంగ్రామానికి లోకాలన్నీ వణికిపోతాయి. దేవతలంతా వణికిపోతారు. భూలోకవాసులు అతలాకుతలమవుతారు. ఈ స్థితిలో దేవతలందరూ కలిసి విష్ణుమూర్తి దగ్గరకు వెళ్ళి విషయం చెబుతారు.

వైకుంఠవాసుడు వారి యొక్క విన్నపం విని సమస్య పరిష్కరించడానికి పూనుకుంటాడు.

నారాయణుడు వెంటనే జలంధర్ రూపాన్ని పొంది 'వృంద' దగ్గరకు వెడతాడు.

మహాపతివ్రత యైన 'వృంద' జలంధర్ రూపంలో ఉన్న నారాయణుడి చెంతకు చేరుకుంటుంది. నారాయణుడి స్పర్శ తగలగానే అతడు తన భర్త జలంధర్ కాదని గ్రహిస్తుంది. శ్రీమన్నారాయణుడి కరస్పర్శ వల్ల ఆమె పాతివ్రత్య ఫలం తగ్గిపోతుంది. వెంటనే శివుడితో యుద్ధం చేయుచున్న జలంధరుడు ఒక్కసారిగా శక్తిహీనుడవుతాడు. ఆ స్థితిలో వెంటనే శివుడు త్రిశూలంతో జలంధరుడిని వధిస్తాడు.

జలంధరుడు మరణించిన వెంటనే విషయం గ్రహించిన వృంద తన చెంతనే ఉన్న నారాయణుడితో "వైకుంఠవాసా... నేను నా చిన్నతనం నుండి నీ భక్తిలో ఓలలాడాను. నిన్ను ఆరాధించాను. పూజించాను. చివరకు నా భర్తను సంహరించడానికి నా భర్త రూపంలో వచ్చి నన్ను మోసం చేశావు. నా పాతివ్రత్యమంతా మంట కలిపావు. కాబట్టి నువ్వు సాలిగ్రామ శిలగా అవతరించు" అంటూ శపిస్తుంది.

భక్తురాలైన 'వృంద' ఇచ్చిన శాపాన్ని ఆనందంగా స్వీకరిస్తాడు శ్రీహరి.

తనకు శాపమిచ్చిన వృందతో శ్రీమన్నారాయణుడు "వృందా! నీవు నా భక్తురాలివైనా సరే... నీ భర్త సంహరింపబడాలనే

ఉద్దేశ్యంతోనే నేను నీ పతి రూపంలో ఇక్కడకు వచ్చాను. నువ్వు నన్ను నిరంతరం ఆరాధిస్తూ పూజ చేయడం వలన నీ పతి యొక్క శక్తి అమితంగా పెరిగి పరమశివుడితో సమానమైన శక్తిమంతుడిగా మారబోతున్నాడు. అదే జరిగితే సృష్టికి విఘాతం ఏర్పడుతుంది. ఈ స్థితిలో నీ పతిని నిర్వీర్యుడిని చేయడం తప్పనిసరి. కాబట్టి గత్యంతరం లేక నేను నీ పతి రూపంలో వచ్చాను. నీ పాతివ్రత్యాన్ని భగ్నం చేశాను. ఇలా నేను ప్రవర్తించకపోతే జలంధరుడి శక్తి బలహీనపడదు. అతడు శక్తిహీనుడు కానిచో ఎవ్వరితోనూ సంహరింపబడడు. ఈ విషయం తెలియక నీవు నన్ను శపించావు'' అంటూ విషయం చెబుతాడు.

విషయం పూర్తిగా తెలుసుకున్న వృంద తను ఆవేశానికి ఆగ్రహానికి లోనయ్యానని, అనాలోచితంగా శపించానని తనని క్షమించమని శ్రీమన్నారాయణుడిని వేడుకుంటుంది.

అప్పుడు శ్రీహరి వృందని ''తులసీ'' అని పిలుస్తాడు. పిలిచిన తదనంతరం ఈవిధంగా చెబుతాడు.

''తులసీ! నీవు నన్ను శపించావని చింతింపవలదు. నీ శాపం ప్రజల పాపాలను క్షయం చేయడానికి ఉపయోగ పడుతుంది. ఎలాగంటే నీ శాపం వలన నేను సాలిగ్రామశిలగా గండకీ నది దగ్గర ఆవిర్భవిస్తాను. ఆ శిలపై విష్ణుచక్రం, సూర్యదేవుడు గుర్తులుగా ఉంటాయి. ఈ శిలను పూజిస్తే ప్రత్యక్షంగా నన్ను పూజించినట్లుగానే భావించి ప్రజలకు పుణ్యఫలాన్ని అనుగ్రహిస్తాను. అంతేకాదు ఇకనుండి నీవు నీ దేహాన్ని విడిచిన తదనంతరం తులసిమొక్కగా మారిపోతావు.


ఈ సృష్టి ఉన్నంతకాలం ప్రజలందరూ నిన్ను పూజిస్తారు. ఎక్కడైతే తులసి ఉంటుందో అక్కడ భోగభాగ్యాలు, సిరిసంపదలు, ఆయురారోగ్యాలు వెల్లివిరుస్తాయి. భక్తులందరికీ విజయాలను చేకూరుస్తావు. నిన్ను పూజిస్తే నారాయణుడిని పూజించినట్లే.

ఇకనుండి ఎవరు తులసిదళములతో అర్చించినా, తులసిమాలను నా మెడలో వేసి పూజించినా వారికి నా అనుగ్రహం సంపూర్ణంగా లభిస్తుంది. ఎన్ని పుష్పాలతో నన్ను అలంకరించినా తులసిమాలగానీ, తులసిదళంగానీ ఆ పుష్పాల మధ్య లేకపోయినట్లయితే నాకు సంతృప్తి కలగదు అని చెబుతాడు.

వృంద నారాయణుడి అనుగ్రహంతో సంతృప్తి చెందుతుంది. దేహాన్ని త్యజిస్తుంది. మరుజన్మలో తులసిమొక్కగా అవతరిస్తుంది.

(ఆ విధంగా తులసిగా అవతరించిన వృంద భక్తులందరికీ తులసిమాలగా మారింది. ప్రతిభక్తుడి ఇంటిలోనూ తులసిమొక్కగా వెలసి అందరితోనూ పూజింపబడుతోంది. ప్రతిరోజూ తులసిని పూజిస్తే లక్ష్మీనారాయణుల అనుగ్రహం కలుగుతుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు).

★★★



**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం సంకల్పించిన మొత్తం 111 శ్రీనివాస కళ్యాణాలలో భాగంగా గత నెలలో నిర్వహించిన కళ్యాణాలు**

## 65వ కళ్యాణము

తేది 17-06-2024 సోమవారం నాడు ఉదయం 10.30 నుండి జరిగింది. దీనిని ఎం.వి.ఎస్.ఆర్ పట్నాయక్, నీలిమ దంపతులు నిర్వహించారు. ఇది గ్రీన్ టెర్రస్ అపార్టుమెంట్, బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్ లో జరిగింది. వైఖానసాగమోక్తంగా, అన్నమయ్య కీర్తనల మధ్య వైభవంగా జరిగింది.

## 66వ కళ్యాణము

తేది 23-06-2024 ఆదివారం ఉదయం 10.30 నుండి జరిగింది. ఇది ఎం.ఐ.జి ఎ 44, స్వాతీ స్టీల్స్ పక్కన, డా.ఎ.ఎస్.రావ్ నగర్ హైదరాబాద్ లో జరిగింది. దీనిని శ్రీమాన్ బసవేశ్వర్ రావు, రజని దంపతులు నిర్వహించారు. వైఖానసాగమోక్తంగా, అన్నమయ్య కీర్తనల మధ్యన జరిగింది.

# తిరుమల సర్వస్వం

– పల్లపోతు వాణిశ్రీ



## మాధవుడు చేసే మానవ సేవ

తిరుమల శ్రీవేంకటేశ్వరునికి కానుకలుగా వచ్చిన వందల, వేల కోట్ల మొత్తంలో సింహభాగం ప్రత్యక్షభాగంగానో, పరోక్షంగానో సమాజసేవకే అంకితమవుతుంది. ఏవిధంగా అయితే ఇబ్బడిముబ్బడిగా కానుకలు వచ్చి పడతాయో, అదేవిధంగా చేతికి ఎముక లేకుండా, ఆ వచ్చిన సొమ్మునంతా శ్రీవారు, భక్తులకు ఇతోధికమైన సౌకర్యాలు కల్పించడం కోసం, హైందవధర్మ పరిరక్షణార్థం మరియు సమాజ శ్రేయస్సు కోసం వెచ్చిస్తారు. ఈ మానవసేవా కార్యకలాపాలు తిరుమల క్షేత్రంలోనూ, తిరుపతి పట్టణంలోనూ, ఆంధ్రరాష్ట్రమంతటా మరియు జాతీయ స్థాయిలోనూ విస్తరించి ఉన్నాయి.

వీటన్నింటిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గది 'నభూతో నభవిష్యతి' అన్న చందంగా తిరుమలలో జరిగే నిత్యాన్నదానం.

**మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం**

చారిత్రకాధారాలు లభ్యమైనంతవరకూ, తిరుమలలో అన్నదానం ప్రక్రియ దాదాపుగా వెయ్యి సంవత్సరాల క్రితమే ప్రారంభమయ్యింది. అప్పటి చోళప్రభువైన 'ఇంగోరు రాజు' శ్రీవారి సన్నిధిలో ఇద్దరు బ్రాహ్మణులకు నిత్యాన్నదానం జరిపించడానికి తగిన ఏర్పాట్లు చేశాడు. తరువాత 1450 వ సంవత్సరంలో విజయనగర రాజు సాళువ నరసింహరాయలు 'రామానుజ కూటములు'గా పిలువబడే ఉచిత భోజనశాలలను ఏర్పాటు చేశాడు. దానిని నిర్వహించడానికి కావలసిన ఆర్థిక వనరుల కోసం ఆలయానికి అనేక భూములను దానంగా ఇచ్చాడు. ఆవిధంగా శ్రీవేంకటేశ్వరుని చెంతకు వేంచేసిన భక్తులెవ్వరూ ఆకలితో వెనుదిరగరాదన్నది తరతరాలుగా తిరుమల యాజమాన్యం త్రికరణశుద్ధిగా నమ్మి, ఆచరణలో పెడుతున్న సిద్ధాంతం, అదే లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని వందల ఏళ్ళ నుండి శ్రీవారి ప్రసాదాలను భారీ స్థాయిలో తయారు చేయించి భక్తులకు ఉచితంగానో లేదా నామమాత్రపు ధరలకు వితరణ చేయడం, అలిపిరి మార్గం పొడవునా ఉన్న విశ్రాంతి మంటపాలలో యాత్రికులకు షడ్రసోపేతమైన భోజనాలు వడ్డించడం, తిరుమల కొండపై అనేక అన్నదాన సత్రాలను నిర్వహించడం వంటి ఎన్నో అన్న వితరణ కార్యకలాపాలను ఆయా కాలాలలో ఉన్న ఆలయ యాజమాన్యాలు చేపట్టాయి. శ్రీవారి భక్తులైన ఎందరో దాతలు కూడా ఆ పుణ్యకార్యాలలో పాలు పంచుకునేవారు. అందులో భాగంగానే దాదాపు నూటయాభై సంవత్సరాల క్రితమే మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అత్యంత భారీస్థాయిలో అన్నసంతర్పణ గావించేది. ఆమె నిత్యాన్నదాన మహాయజ్ఞానికి యథాశక్తి తోడ్పడడం కోసం ఉత్తరాన ఉన్న గోల్కొండ నుంచి, దక్షిణాన తమిళనాట దిండిగల్ వరకు వ్యాపించి ఉన్న శ్రీవారి తెలుగు, తమిళ భక్తులు తమ తమ అమూల్యమైన భూములను వెంగమాంబకు ధారాదత్తం చేస్తూ దానపత్రాలు వ్రాసి ఇచ్చారు. వెంగమాంబ నిత్యాన్నదానమే కాకుండా, వైశాఖమాసంలో వచ్చే నృసింహ జయంతిని పురస్కరించుకుని, భక్తులకు పది రోజులపాటు నవకాయ పిండివంటలతో కూడిన ప్రత్యేకమైన భోజనాన్ని అందజేసేవారు.



**అవిరామ వితరణ :**

ఆ మహనీయురాలి స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని, ప్రపంచ చరిత్రలో ఎన్నడూ లేనంత పెద్దస్థాయిలో ఈ అన్నదాన మహాయజ్ఞాన్ని తి.తి.దే కొనసాగిస్తోంది. దాదాపుగా గత 35 సంవత్సరాల నుండి నిరంతరాయంగా కొనసాగుతున్న ఈ యజ్ఞానికి – ఒక్క గ్రహణ కాలంలో తప్ప – ఎన్నడూ విరామం లేదు. కరోనా కష్టకాలంలో కొన్ని రోజులు మినహాయించి, నిరాఘాటంగా అన్న వితరణ జరుగుతూనే ఉంది.

తిరుమలలో అన్నప్రసాదానికి కొన్ని విశిష్టమైన ప్రత్యేకతలు ఉన్నాయి. అవి మనందరికీ తెలిసినవే అయినా, వాటికున్న ప్రాధాన్యత దృష్ట్యా పునశ్చరణ చేసుకోదగ్గవి. అవేంటో చూద్దాం.

అత్యద్భుతమైన రుచి, తరిగొండ వెంగమాంబ అన్నదాన కేంద్రంలో వడ్డించే భోజనం అమృతతుల్యంగా ఉంటుంది. ఆ పదార్థాల లోని రుచి ఐదు నక్షత్రాల హోటల్లో సైతం మనం ఎన్నడూ చవిచూసి ఉండబోము. అంకితభావంతో పనిచేసే వందలాదిమంది చేయి తిరిగిన వంట కార్మికుల అవిరళ కృషికి శ్రీనివాసుని కటాక్షం తోడవ్వటమే దీనికి కారణం. సాంబారు, రసం, రోటిపచ్చడి వంటి సర్వసాధారణమైన వంటకాలకు కూడా, పంచభక్ష్య పరమాన్నాలను మరపించే అమోఘమైన రుచి ఉంటుంది. ఆదరణ, ఆప్యాయతలను రంగరించి వడ్డించడం కూడా ఆ అమూల్యమైన రుచికి కారణం కావచ్చు.

**శుచి – శుభ్రత :**

ప్రతిదినం సగటున లక్షమందికి పైగా భక్తులు గుమిగూడే ఆ ప్రదేశంలో ఎన్నడూ ఒక వెంట్రుక గానీ, ఏవిధమైన క్రిమి కీటకాలు గానీ కానరావు. ఎంతో శ్రద్ధ వహించి, రేయింబవళ్ళు కృషి చేస్తేగాని పరిసరాలను అంత పరిశుభ్రంగా ఉంచటం సాధ్యం కాదు. తిరుమల క్షేత్రమంతా స్వచ్ఛతకు మారుపేరైతే, అన్నదానకేంద్రం మాత్రం మరింత స్వచ్ఛంగా, శుచి–శుభ్రతకు చిరునామాగా పేరు తెచ్చుకుంది.

**సత్వర సేవలు :**

ప్రస్తుతం ఎంతటి ప్రణాళికాబద్ధమైన ఏర్పాట్లు చేశారంటే, భక్తుల రద్దీ ఎంత ఎక్కువగా ఉన్నప్పటికీ ఉచిత భోజనం నిమిత్తం ఎవరూ వేచి ఉండాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు. దాదాపుగా 15 నిమిషాల వ్యవధి లోపునే భోజన కార్యక్రమాన్ని ముగించవచ్చు. ఒక హాలు నిండిన వెంటనే భక్తులను వేరే హాలులోకి నిర్దేశించే ప్రణాళికా బద్ధమైన వ్యవస్థ ఉంది. మనం నిర్దిష్ట స్థానంలో కూర్చున్నదే తడవుగా, వెనువెంటనే వడ్డన కార్యక్రమం ప్రారంభమవుతుంది. అన్నప్రసాద కేంద్రంలోని కార్మికులు సుశిక్షితులైన సైనికుల్లా వడ్డన కొనసాగిస్తారు. భక్తుల రద్దీ మరీ ఎక్కువైతే, కాలయాపన అరికట్టడానికై 'బఫే' పద్ధతిలో భోజనాలను వడ్డించే సంప్రదాయానికి కూడా తి.తి.దే శ్రీకారం చుట్టింది.

**ఆదరణ – ఆప్యాయత :**

ప్రతినిత్యం లక్షమంది భక్తులకు వండి వడ్డించే సిబ్బంది ముఖాలలో ఏవిధమైన విసుగుదల గాని, అలసట గాని మచ్చుకు కూడా కానరావు. తమకు కేటాయించిన విధులను వారు త్రికరణశుద్ధితో నిర్వర్తిస్తుంటారు. హాలులోనికి ప్రవేశించినది మొదలు, చేతులు శుభ్రపరచుకుని నిష్క్రమించేంతవరకు భక్తులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలందిస్తూ, ఏ విధమైన ఇబ్బంది, అసౌకర్యం కలగకుండా చూస్తారు.

**కాలక్రమం :**

1985 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారక రామారావు గారు శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదాన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. 'రామయ్య' అనే భక్తుడు సమర్పించుకున్న ఐదు లక్షల విరాళంతో ప్రారంభమైన ఈ పథకంలో భాగంగా అప్పట్లో ప్రతిరోజూ 2000 మంది భక్తులకు పులిహోర మాత్రమే అందించేవారు. 1987వ సంవత్సరం నుండి మధ్యాహ్నం, రాత్రి పరిమిత సంఖ్యలో భక్తులకు భోజనం సమకూర్చేవారు.

1994వ సంవత్సరంలో 'శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదాన ట్రస్ట్' రూపు దిద్దుకుంది. ట్రస్ట్ కు వచ్చిన విరాళాలను బ్యాంకుల్లో కాలపరిమితి డిపాజిట్లలో జమ చేసి వచ్చిన వడ్డీసొమ్ముతో నిత్యాన్నదాన కార్యక్రమం నడిపించ బడుతుంది. వడ్డీగా వచ్చిన మొత్తం సరిపోకపోతే కావలసిన మొత్తాన్ని గ్రాంట్ రూపంలో తి.తి.దే సమకూరుస్తుంది. ప్రస్తుతం ఈ ట్రస్టుకు సుమారు 752 కోట్ల రూపాయలు పైగా డిపాజిట్లు ఉన్నాయి. స్వదేశీ విదేశీ భక్తుల నుండి ఈ ట్రస్టుకు విరాళాల వెల్లువ కొనసాగుతూనే ఉంది.

2007వ సంవత్సరం వరకు శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు మాత్రమే ఉచిత అన్నప్రసాదం అందించబడేది. తరువాత దర్శనంతో సంబంధం లేకుండా ఆకలిగొన్న ప్రతి భక్తునికి అన్నప్రసాదం అందించటం ప్రారంభించారు. దీంతో అన్నార్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది.

2009వ సంవత్సరంలో అప్పటివరకూ దక్షిణాది భక్తులకు మాత్రమే అనుకూలంగా ఉండే సాంబార్, రసం

వంటి పదార్థాలకు తోడుగా, ఉత్తరాది భక్తులకు రోటీ, దాల్ వంటివి ప్రవేశపెట్ట బడ్డాయి. మొట్టమొదట్లో దక్షిణాది వారి కోసం ముద్దపప్పు, నెయ్యి, చక్కెరపొంగలి కూడా వడ్డించేవారు. తర్వాత వ్యయభారం అధికమవటం వల్ల నెయ్యి, ముద్దపప్పును తొలగించారు.

**అన్ని హంగులతో కూడుకున్న భవనం :**

రోజు రోజుకూ పెరుగుతున్న భక్తుల తాకిడి వల్ల అప్పటి వరకూ ఉన్న భవనం సరిపోక పోవడంతో, ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన రెండంతస్తుల విశాలమైన భవనాన్ని, నాలుగు భోజన శాలలతో నిర్మించారు. 2011వ సంవత్సరంలో అప్పటి భారత రాష్ట్రపతి ప్రతిభా దేవీసింగ్ పాటిల్ గారు ఈ భవన సముదాయాన్ని ప్రారంభించారు. ఈ భవనం మొదటి అంతస్తులో ఉన్న చిన్న ఉద్యానవనంలో నమస్కార భంగిమలో ఉన్న వెంగమాంబగారి చూడచక్కనైన రాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దాని ప్రక్కనే ఉన్న ఉన్నతమైన, విశాలమైన కుడ్యంపై శేషాచల పర్వతాలలో కొలువై ఉన్న శ్రీశైలం, త్రిపురాంతకం, మహానంది, అహోబిలం, తిరుమల వంటి అయిదు శైవ, వైష్ణవ క్షేత్రాల ఊహాచిత్రం భక్తులను అమితంగా ఆకట్టుకుంటుంది.

ఈ భవన నిర్మాణానికి అప్పట్లో 37 కోట్ల రూపాయలు వ్యయం కాగా, అందులో 'ఎల్.వి.రాజు అనే భక్తుడు 20 కోట్లను, ప్రతాపరెడ్డి అనే మరో భక్తుడు 5 కోట్ల రూపాయలను సమకూర్చారు. మిగిలిన 12 కోట్లు తి.తి.దే వెచ్చించింది. ఒక్కో భోజనశాలలో వెయ్యిమంది చొప్పున, ఒకేసారి నాలుగువేల మంది భక్తులకు ఎక్కడా వేచి ఉండాల్సిన అవసరం లేకుండా భోజనం వడ్డించగలిగే ఏర్పాటు చేయబడింది. అలాగే, తిరుచానూరు ఆలయంలో కూడా ఇదే తరహాలో 5 కోట్ల రూపాయలతో నూతన భవనం నిర్మించబడింది.

**సుశిక్షితులైన సిబ్బంది :**

ఈ అన్నప్రసాద కేంద్రంలో పనిచేసే సిబ్బందిని కనిపించే దేవుళ్ళుగా చెప్పుకోవచ్చు. సుమారుగా 1200 మంది ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. దశాబ్దాల నుంచి చేపడుతున్న ఈ అన్నదాన కార్యక్రమంలో ఇప్పటివరకు ఒక్క విమర్శ కూడా రాలేదంటే, ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది ఎంత శ్రద్ధాభక్తులతో తమ విధులు నిర్వర్తిస్తున్నారో చెప్పుకోవచ్చు. అన్నప్రసాదాల తయారీ కోసం తెల్లవారు ఝూమున నాలుగు గంటల నుండి వంటలు ప్రారంభించి, షిఫ్టుకు 40 మంది చొప్పున రెండు షిఫ్టులుగా వంట చేస్తారు. అన్న ప్రసాద వితరణలో శ్రీవారి సేవకుల పాత్ర కూడా ఎంతో కీలకమైనది. ఇప్పటివరకు సుమారుగా రెండు లక్షలకు పైగా శ్రీవారి సేవకులు అన్నప్రసాదాల తయారీ మరియు వితరణలో అమూల్యమైన సేవలను అందించారు. కూరగాయలను శుభ్రపరచటం, తరగటం మొదలుకొని పదార్థాల పంపిణీ వరకు గల అన్ని దశల్లోనూ వీరి సేవలు చెప్పుకోదగ్గవి.

**కూరగాయల – వంటదినుసుల లభ్యత :**

తి.తి.దే భోజనాలకు కావలసిన టన్నుల కొద్దీ బియ్యాన్ని భక్తుల నుండి కానుకల రూపేణా స్వీకరించడమే కాకుండా, ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్రలలో ఉండే బియ్యం మిల్లుల నుండి కూడా కొనుగోలు చేస్తోంది. బియ్యం మిల్లుల వారు కొన్ని క్వింటాళ్ళ బియ్యాన్ని అన్నప్రసాద నిమిత్తం ఉచితంగా ఇవ్వడమే కాకుండా, మిగిలిన బియ్యాన్ని బహిరంగ విపణి ధరల కంటె చాలా తక్కువకే సరఫరా చేస్తారు. అలాగే వంటల నిమిత్తం కావలసిన వంటనూనె, నెయ్యి, పంచదార, పప్పుదినుసులు వంటి మిగిలిన సరుకులు కూడా కొన్నింటిని కానుకల రూపంలో ఉచితంగానూ, మిగిలిన వాటిని రాయితీ ధరలలోనూ, తి.తి.దే సమకూర్చుకుంటుంది. అయితే నాణ్యతను నిర్ధారించే విషయంలోనూ, బహిరంగ విపణిలో పెద్ద మొత్తంలో కొనుగోలు చేసేటప్పుడు విధిగా పాటించవలసిన నియమాల విషయంలోనూ పూర్తి పారదర్శకతతో కూడిన అత్యున్నత ప్రమాణాలను పాటిస్తూ ఏవిధమైన వివాదాలకు తావు లేకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోబడుతున్నాయి.

రోజుకు 8-9 క్వింటాళ్ళ కూరగాయలను కూడా తి.తి.దే దాతలనుండి స్వీకరిస్తుంది. చెన్నై, బెంగుళూరు, మదనపల్లి, చిక్బళ్లాపూర్, విజయవాడ, తిరుపూరు, వెల్లూరు వంటి సమీప. సుదూర ప్రాంతాల నుండి కూడా దాతలు కూరగాయలను ఉచితంగా సరఫరా చేస్తారు. కూరగాయల నిమిత్తం ఇంతవరకు తి.తి.దే ఒక్కరూపాయ కూడా ఖర్చుపెట్టలేదంటే దాతల, భక్తుల మదిలో శ్రీవారి పట్ల ఎంతటి ఆదరాభిమానాలు ఉన్నాయో వెల్లడవుతుంది. సరుకులు కొనుగోలు చేసే సమయంలో వాటి నాణ్యతను నిర్ధారించడానికి, వాటన్నింటిని అన్నదాన సమయంలోని శీల గిడ్డంగులలో నిలవ చేయడం కోసం, కూరగాయలు కడగటం, తరగటం కోసం, టన్నుల కొద్దీ అన్నాన్ని బాయిలర్ లలో వండటం కోసం తి.తి.దే ఎప్పటికప్పుడు పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఎంతో అధునాతనమైన ఉపకరణాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటూ, సమయాన్ని, ఇతర వనరులను ఆదా చేస్తూ భక్తుల ఆదరాభిమానాలను చూరగొంటోంది.

**అన్నప్రసాదం తయారీ :**

ప్రసాదాల తయారీ కోసం తరిగొండ వెంగమాంబ అన్నదాన కేంద్రంతో పాటుగా వైకుంఠం క్యూ సముదాయంలో ఉన్న రెండు పెద్ద పాకశాలలను కూడా వినియోగిస్తారు. వీటన్నింటిలో చక్కెరపొంగలి, సాంబార్, రసం, కూర, చట్నీ, అన్నం తయారీ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. ఉదయం అల్పాహారంగా కిచిడీ, ఉప్మా, పొంగలి తయారు చేస్తారు. మధ్యాహ్న, రాత్రి భోజనాలలో అన్నం, సాంబారు, రసం, రోటిపచ్చడి, కూర లేదా

పప్పుతో పాటుగా చక్కెరపొంగలి కూడా వడ్డిస్తారు.

**వితరణ :**

ఉదయం 10 గంటల నుండి అన్నదానకేంద్రంలో అన్నప్రసాద వితరణ జరుగుతుంటుంది. కేవలం ఒక గంట విరామంతో, రాత్రి 11 గంటల వరకూ వడ్డన కొనసాగుతూనే ఉంటుంది. అలాగే వైకుంఠం-2 పాకశాలల్లో నుండి, క్యూలలో వేచి ఉన్న భక్తులకు నిరంతరాయంగా పాలు, ఉదయం వేళలో అల్పాహారాలు సరఫరా అవుతాయి. అంతేకాక, తిరుమలలోని అనేక కూడళ్ళలో అన్నప్రసాద కేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు వేడివేడిగా సాంబారన్నం, పెరుగన్నం, కిచిడీ, ఉప్మా, పొంగలి ఎప్పటికప్పుడు తయారుచేసి అందజేస్తుంటారు. శ్రీవేంకటేశ్వరుని సన్నిధి అంటేనే అన్నవితరణకు పెట్టింది పేరు.

కొండపైనున్న వివిధ ప్రదేశాలకు తోడుగా అలిపిరి నడక మార్గంలోని గాలిగోపురం వద్ద, ఏడవ మైలురాయి వద్ద, శ్రీవారి మెట్ల మార్గం ముగిసే చోట, తిరుపతిలోని విష్ణునివాసం మరియు శ్రీనివాసం వసతి సముదాయాలలోనూ ఉచిత అన్నప్రసాదం కోసం బారులు తీరి ఉన్న వేలాది భక్తులను తరచుగా మనం చూస్తూనే ఉంటాం. అంతే కాకుండా బ్రహ్మోత్సవాల సమయంలో తిరుపతి పట్టణంలోని కపిలేశ్వరస్వామి ఆలయం, అప్పలాయగుంట, కోదండరామాలయం, నారాయణవనం, శ్రీనివాస మంగాపురం వంటి తి.తి.దే అనుబంధ ఆలయాలలో కూడా అన్నవితరణ జరుగుతుంది.

ఇదివరకు ముఖ్యమైన భక్తుల కోసం తి.తి.దే అతిథి గృహాలలో వంట ఏర్పాట్లు చేసేవారు. ఇప్పుడా ప్రత్యేక ఏర్పాట్లకు స్వస్తి చెప్పి, ముఖ్యమైన అతిముఖ్యమైన భక్తులను కూడా అన్నదాన కేంద్రానికే తరలించడం వల్ల భోజనాల వ్యవస్థలో మరింత నాణ్యత, పారదర్శకత చోటు చేసుకున్నాయి.

**నైవేద్యం :**

తయారు చేసిన అన్నప్రసాదాలను ముందుగా అన్నపూర్ణాదేవికి నైవేద్యంగా సమర్పించిన తరువాత భక్తులకు వితరణ చేస్తారు. తిరుమల దివ్యక్షేత్రంలో సాక్షాత్తు శ్రీవారి కనుసన్నలలో తయారు చేయబడినది, జగత్తులోని సమస్త జీవరాశులకు ఆహారాన్ని సమకూర్చే అన్నపూర్ణాదేవికి నివేదించబడినది, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా లక్షలాది భక్తుల క్షుద్బాధ తీర్చేది అవ్వడం వల్ల, అన్నప్రసాదంలోని ఒక్క మెతుకును కూడా వ్యర్థం చేయకుండా, శ్రీవేంకటేశ్వరుని మనసారా ధ్యానించుకుని, భక్తితో సంతృప్తిగా భుజించి ఆ ప్రసాదం యొక్క పవిత్రతను కాపాడవలసిన బాధ్యత మనందరి పైనా ఉంది. అంతేకాకుండా ఈ అన్నదాన కార్యక్రమం ఆచంద్ర తారార్కం కొనసాగాలని ఆశిస్తూ, ఈ మహాయజ్ఞంలో మనం కూడా పాలు పంచుకుని, ఉడతా భక్తిగా తృణమో, పణమో విరాళాల రూపంలో సమర్పించుకుందాం.



**వేద విద్యాబోధన**

వేదాలంటే పుక్కిటి పురాణాలు కాదు. విజ్ఞాన నిక్షేపాలు. వేల సంవత్సరాల క్రితం హైందవజాతి ఉనికిని ప్రపంచానికి చాటిచెప్పిన కరదీపికలు. నేడు మానవజాతిని పట్టిపీడిస్తున్న అనేక శారీరక, మానసిక, సామాజిక రుగ్మతలకు తరచి చూస్తే మన వేదాలలో సత్వరమైన, ఖచ్చితమైన, సులభసాధ్యమైన పరిష్కార మార్గాలు కానవస్తాయనేది కాదనలేని సత్యం. కానీ పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదన్న చందంగా వేదాలను ఉపేక్షించి, పాశ్చాత్య పోకడలను అనుసరించడం వల్ల ఇప్పటికే మనమెంతగానో కోల్పోయాం.

ఈ నేపథ్యంలో మహత్తరమైన వేదసంస్కృతి వ్యాప్తికి తి.తి.దే అవిరళ కృషి సలుపుతోంది. దానిని వివరించే ముందు, ఏ వేదంలో ఏం చెప్పబడిందో క్లుప్తంగా తెలుసుకుంటే వేదాల పట్ల ఆసక్తి, అనురక్తి పెరుగుతాయి.

* ఋగ్వేదం ఐదు శాఖల సమాహారం అయినప్పటికీ ప్రస్తుతం 'శాకల' అనబడే ఒక శాఖ మాత్రమే మనకు అందుబాటులో ఉంది. దీనిలో మానవుని సామాజిక నడవడి (సోషల్ బిహేవియర్), రోగ చికిత్సా పద్ధతులు, కృత్రిమ అవయవాల అమరిక (ఆర్టిఫిషియల్ లింబ్స్), సూక్ష్మ శస్త్రచికిత్స (మైక్రో సర్జరీ), వర్షాల కోసం చేపట్టవలసిన పద్ధతులు మొదలైనవి చెప్పబడ్డాయి.

* యజుర్వేదంలో ప్రాణహింస కూడదని, బలులు నిషిద్ధమని చెప్పబడింది. యాగాలు చేసే పద్ధతులు కూడా పేర్కొనబడ్డాయి.

* సామవేదంలో కళలు, సంగీతం, వాద్యపరికరాలు, సాహిత్యం మొదలగు వాటిని వివరించడంతో పాటు, సృష్టి సమస్తం శూన్యం నుండి ఉద్భవించి, శూన్యంలోనే ఐక్యమైపోతుందని ప్రతిపాదించబడింది. ఈనాటి బ్లాక్ హోల్ సిద్ధాంతానికి సామవేదంలోని సూత్రీకరణలే ప్రాతిపదికలని కొందరు అభిప్రాయ పడతారు.

* అథర్వణ వేదంలో ఆత్మలు, ప్రేతాత్మలు, యుద్ధవిద్యలు, విషశాస్త్రం, శత్రుసైనికులను క్రిమి కీటకాలతో హతమార్చటం (బయోవార్) వంటి విషయాలపై విస్తృతమైన సమాచారం ఉంది.

ఇంతేకాకుండా జ్వరం, అతిసారం, అతిమూత్రం, వాతం, పిత్తం, శ్లేష్మం, విషజ్వరం, క్షయ, బొల్లి, కుష్టువ్యాధులకు; తేలుకాటు, పాముకాటుకు; సుఖప్రసవానికి, సంతానలేమికి; శిరస్సు, ముక్కు, చెవి, కంఠానికి (నేటి ఇఎన్ టి) వచ్చే వ్యాధులకు ఔషధాలు, ఉపశమనాలు చెప్పబడ్డాయి.

**వేదపాఠశాల :**

తిరుమల ప్రధానాలయం నుండి దాదాపు ఐదారు మైళ్ళ దూరాన ఉన్న 'ధర్మగిరి' అనే ప్రదేశంలో తి.తి.దే వారి ఆధ్వర్యంలో, తిరుపతిలోని వేదవిశ్వవిద్యాలయానికి అనుబంధంగా, ఓ సువిశాలమైన ప్రాంగణంలో 'వేదపాఠశాల' నడుపబడుతోంది. 1884వ సంవత్సరంలో ఒక చిన్న కుటీరంలో ప్రారంభింపబడ్డ ఈ పాఠశాల, దినదిన ప్రవర్ధమానమవుతూ, నేడున్న ప్రాంగణంలోకి మారింది. వాహనమార్గం ద్వారా ప్రయాణించి, శిలాతోరణం ఉద్యానవన సముదాయాన్ని దాటిన తర్వాత, ప్రకృతి శోభతో ఉట్టిపడుతున్న ప్రశాంత వాతావరణంలో నెలకొన్న ఈ పాఠశాలను చేరుకోవచ్చు. పచ్చని పరిసరాలతో మమేకమై సాంప్రదాయ వేషభాషలతో నున్న చిన్నారులు వేదాలను వీనులవిందుగా వల్లె వేస్తున్న దృశ్యం నయనానందకరంగా, కర్ణపేయంగా గోచరిస్తుంది. వీరందరూ పంచెకట్టుతో, నుదుటిపై నామాలతో, శిరస్సుపై శిఖతో అభినవ బృహస్పతుల వలె తేజరిల్లుతుంటారు.

సనాతన కాలం నుంచి ప్రపంచం నలుమూలలలోని కోట్లాది ప్రజలు అవలంబిస్తున్న హైందవమత మనుగడకు మూలం – 'వేదం'.

చతుర్వేదాలు శేషాచల సానువులలో బండశిలలుగా అవతరించాయని అన్నమాచార్యులవారు తన కీర్తనలలో పేర్కొన్నట్లుగా ఇంతకుముందే చెప్పుకున్నాం. నాలుగు వేదాలే ఆనందనిలయం చుట్టూ ఉన్న నాలుగు మాడ వీధులుగా అవతరించాయని కూడా పురాణాలలో చెప్పబడింది. ఎందరెందరో కవులు, గాయకులు, మహాభక్తులు శ్రీవేంకటేశ్వరుణ్ణి వేదపురుషునిగా అభివర్ణించారు. అంతటి మహత్తరమైన ఘనచరిత్ర గల వేదాలను పరిరక్షించడంలో తి.తి.దే తన వంతు పాత్రను అద్వితీయంగా పోషిస్తోంది. అందులో భాగంగా ఆసక్తి, అర్హత గల బాలురకు అతి చిన్న వయసు నుండే వేద విద్యాభ్యాసం గావించడం ఈ పాఠశాల ప్రధానోద్దేశ్యం.

శ్రీవేంకటేశ్వరుని ఆశీస్సులతో, 2006వ సంవత్సరంలో మహా మహోపాధ్యాయ రామేశ్వర్ ఠాకూర్ గారి చేతుల మీదుగా, తిరుపతి పట్టణంలో వేద విశ్వవిద్యాలయం ప్రారంభించబడింది. ప్రపంచంలోనే మొట్టమొదటి 'వేదవిశ్వవిద్యాలయం'గా వినుతికెక్కిన ఈ సంస్థలో ప్రస్తుతం 24 మంది అధ్యాపకుల శిక్షణలో 350 మంది విద్యార్థులు వేదవిద్యాభ్యాసం నెరుపుతున్నారు. యూజిసి ఆమోదంతో నడుపబడుతున్న ఈ విశ్వవిద్యాలయంలో కానీ ఖర్చు లేకుండా ఎవరైనా వేదాలను అభ్యసించవచ్చు. విద్యార్థులకు ఉచిత వసతి, భోజన, విద్య సదుపాయాలు కల్పించబడుతాయి.

కొన్నేళ్ళక్రితం ఇదే ఆశయంతో పశ్చిమగోదావరి జిల్లా, అయి భీమవరం అనే గ్రామంలో కూడా ఈ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఒక వేదపాఠశాలను తి.తి.దే ఏర్పాటు చేసింది.

వేదవిశ్వవిద్యాలయంలో ఋగ్వేదం, అథర్వణవేదం, సామవేదంలోనూ, వాటికి సంబంధించిన ఉపశాఖలలోనూ మొత్తంగా 27 విభాగాలలో శిక్షణ నిస్తారు. హిందూ ధార్మిక వ్యవస్థకు ప్రాతిపదిక యైన ఆగమశాస్త్రంతో పాటుగా పౌరోహిత్యం, అర్చకత్వం వంటి వాటిలో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చి దిద్దుతారు. అలాగే ఖగోళ, వాస్తు, మూలిక, హిందూ ధర్మపరిరక్షణ, ఆలయ నిర్మాణ శాస్త్రాలలో కూడా శిక్షణనిస్తారు. ఏదైనా ఒక్కవేదం సంపూర్ణంగా అభ్యసించాలంటే సుమారు 15 నుండి 18 సంవత్సరాల కాలం పడుతుంది. ఆ కాలంలో 10 నుండి 12 గంటల పాటు నిర్విరామ కృషి సలిపితేనే వేదవిద్యను అభ్యసించగలుగుతారు. ప్రతిరోజూ ఉదయం నాలుగు గంటలకు ప్రారంభమయ్యే విద్యార్థుల దినచర్య రాత్రి భోజనాలతోనే ముగుస్తుంది. వంటశాలలో వారే స్వయంగా వండుకుని భుజిస్తారు. మొత్తంగా వారి విద్యా విధానం ప్రాచీన కాలపు గురుకుల వ్యవస్థను స్మరణకు తెస్తుంది.

విద్య పూర్తయిన తరువాత డిగ్రీ విద్యకు సమానంగా 'శాస్త్రి' అనే పట్టాను, పోస్టు గ్రాడ్యుయేషన్ కు సమానంగా 'ఆచార్య' అనే పట్టాను ప్రదానం చేస్తారు. ఎం.ఫిల్, పిహెచ్.డి వంటి ఉన్నత కోర్సులు కూడా ఈ విశ్వవిద్యాలయంలో లభిస్తాయి. ఎక్కువమంది విద్యార్థులు విశ్వవిద్యాలయంలో చేరేటందుకు ప్రోత్సహించడానికి గాను విద్యాభ్యాసం ప్రారంభంలోనే విద్యార్థి పేరిట నిర్ణీత మొత్తాన్ని బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తారు. విద్యాభ్యాసం పూర్తవగానే, ఆ డిపాజిట్ ద్వారా ప్రతినెలా కొంతమొత్తం వడ్డీరూపంలో వచ్చే ఏర్పాటు చేసి వారి ఉదరపోషణకు కనీస భరోసా కల్పిస్తారు.

వివిధ కోర్సులలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు వేదాలపై పరిశోధనలు నిర్వహించే సంస్థలలోనూ, ఆగమశాస్త్ర బద్ధంగా నిర్వహించే ఆలయాలలోనూ, వేదాలను బోధించే విద్యాసంస్థలలోనూ, తాళపత్రాలలో నిక్షిప్తమై ఉన్న ప్రాచీన వేదసంపదను వెలికి తెచ్చే కార్యక్రమంలో నిమగ్నమై ఉన్న వారసత్వం పరిరక్షణా సంస్థలలోనూ ఉపాధి లభిస్తుంది. అంతేకాకుండా, పౌరోహిత్యం వంటి ధార్మిక వ్యాపకాలలోనూ, ఆలయ నిర్మాణ రంగంలోనూ, వాస్తుశాస్త్ర విశారదులు , జ్యోతిష్యశాస్త్ర సిద్ధాంతులుగానూ స్థిరపడ్డ వేదవిద్యార్థులు కూడా ఎందరో ఉన్నారు.

(సశేషం)

# మాధవదాసు కథ

– కృష్ణ మీనన్ రామానుజ దాసన్

భగవంతుని ఆరాధిస్తే ఒక బాంధవ్యం ఏర్పరచుకుని, ప్రేమిస్తే ఆయన ఎంతగా భక్తుల వెంటపడి తిరుగుతుంటాడో! ఆ పరమాత్మ భక్తవత్సలతను తెలపడానికి ఎందరో మహా భాగవతోత్తముల జీవితాలు నిదర్శనాలుగా ఉన్నాయి. అటువంటి ఒక మహాభక్తుని కథ ద్వారా ఆ పరమాత్మ కారుణ్యాన్ని మానసికంగా అనుభవిద్దాం.

ఒకప్పుడు పూరీ క్షేత్రానికి దగ్గరలోని ఓ గ్రామంలో మాధవదాసు అనే చిన్న వ్యాపారి ఉండేవాడు. అతడు ధర్మబద్ధమైన వ్యాపారం చేస్తూ లభించిన దానితో తృప్తిగా జీవనం చేస్తూ దైవచింతనతో ఉండేవాడు. దైవానుగ్రహం వల్ల తనకు లాభాలు వచ్చినచో ఆ ఆస్తులతో అంతే తృప్తిగా జీవించేవాడు.

కాలక్రమంలో ఆయన భార్య గతించింది. పిల్లల పెళ్ళిళ్ళు అయిపోయి స్థిరపడ్డారు. అప్పుడు ఆయన తనకున్న ఆస్తిపాస్తులను పిల్లలు అందరికీ సమంగా పంచేసి తను పూరీకి వెళ్ళాడు. అక్కడే జగన్నాథుని సన్నిధిలో ఆ స్వామి నామస్మరణంతో జీవితం వెళ్ళదీయాలని నిర్ణయంతో అక్కడికి వెళ్ళాడు.

కట్టుబట్టలతో వెళ్ళడంతో చూడడానికి బిచ్చగాడిలా కనిపించాడు గుడిలోని అర్చకులకు. అందువల్ల అక్కడివారు ఆయన్ని గుడిలోకి రానివ్వలేదు. అక్కడే దూరంగా ఉండి స్వామినే స్మరిస్తూ కూర్చున్నాడు. కానీ ఎవ్వరినీ తిట్టడం చేయలేదు. నాలుగు రోజులుగా తిండి లేకపోవడంతో ఓ రాత్రి సొమ్మసిల్లి పడిపోయాడు. నామస్మరణ మాత్రం ఆపలేదు.

అప్పుడు జగన్నాథుడికి జాలి కలిగింది. అమ్మను పిలిచి ఇలా మాట్లాడాడు.

రుక్మిణీ! నా భక్తుడు చూడు. ఆహారం లేక సొమ్మసిల్లి పడిపోయాడు. నువ్వు మనకు పెట్టిన ఈ నైవేద్యం తీసుకుని వెళ్ళి ఇవ్వు. అమ్మవు కదా నువ్వు. బిడ్డడి ఆకలి తీర్చాలి కదా అని జగన్నాథుడు అనగానే విన్న ఆ జగన్మాత చిరునవ్వు నవ్వి అలాగే స్వామీ అని రకరకాల ఆహార పదార్థాలతో అక్కడ నైవేద్యం పెట్టి ఉన్న బంగారు పళ్ళెం తీసుకుని మాధవదాసు వద్దకు వెళ్ళింది అమ్మ.

నాయనా! లేచి ఈ ఆహారం తిను కాస్త ఓపిక వస్తుంది. ఆ స్వామి నామస్మరణ చేసుకోవచ్చు అని అనగానే ఆయన లేచి ఆహారం తిన్నాడు.

అమ్మా! జగన్మాతలా వచ్చి నా ఆకలి తీర్చావు అన్నాడు మాధవదాసు కాస్త ఓపిక రాగా అమ్మకు నమస్కారం చేస్తూ.

ఇక పడుకో అని అమ్మ అనగానే పడుకున్నాడు.

అసలు ఈ ఆహారం తెచ్చింది ఎవరు? ఏమిటి అని ఆలోచనలు చేసే స్థితిలో ఆయన లేదు అప్పుడు. అమ్మ అక్కడ్నుంచి



వెళ్ళిపోయింది.

మరునాడు తలుపులు తెరిచిన అర్చకులకు నైవేద్య పాత్ర కనిపించలేదు. పాత్ర కోసం వెదుకుతూ మాధవదాసు ఉన్న చోటికి వచ్చారు. అక్కడ మాధవదాసు జగన్నాథుని నామాన్ని జపిస్తూ కూర్చుని ఉన్నాడు. ఆయన పక్కన నైవేద్య పాత్ర కనిపించింది వారికి. ఆ బంగారు పాత్రను మాధవదాసు దొంగిలించాడని వాళ్ళు అనుకున్నారు.

ఉదయానే లేచిన మాధవదాసు కాలకృత్యాలు తీర్చుకుని స్వామిని స్మరిస్తూ నామాన్ని జపిస్తూ కూర్చున్నాడు. ఆ పాత్రలో ఎవరో తల్లి ఆహారం ఇచ్చి వెళ్ళిందని గుర్తుకు వచ్చింది ఆయనకు. మళ్ళీ వాళ్ళు ఎవరైనా కనిపించి పాత్ర గురించి అడిగినప్పుడు ఇవ్వవచ్చునని భావించి నిశ్చింతగా ఉన్నాడు ఆయన.

మాధవదాసును దొంగగా భావించిన అర్చకులు కోపోద్రిక్తులు అయ్యారు. ఒక కర్ర తీసుకుని ఆయన్ని ఏమీ అడగకుండా కొట్టడం మొదలుపెట్టారు. తన మాటలు వినిపించుకోకుండా వాళ్ళు కొడుతుంటే ఆ జగన్నాథుని నామాన్నే పలుకుతూ ఉన్నాడు ఆయన.

తమ కోపం కాస్త తగ్గిన తర్వాత కొట్టడం ఆపేసి, ఆ నైవేద్య పాత్ర తీసుకుని గుడి లోనికి చరచరా వెళ్ళారు అర్చకులు. లోపలికి వెళ్ళి జగన్నాథుని వంక చూసి ఆశ్చర్యపోయారు. జగన్నాథ మూర్తి పైన దెబ్బలు కనిపించాయి. వెంటనే తమ వల్ల ఏదో అపచారం జరిగిందని, అందుకే స్వామి ఇలా కనిపిస్తున్నాడని వాళ్ళు ఏడ్చారు. ఆ జగన్నాథుడు చెప్పినట్లుగా ఒక అర్చకునికి మనసులో స్ఫురించింది.

మనం అపచారం చేశాం. బయట ఉన్న అతన్ని కొట్టాం కదా. ఆయన జగన్నాథుని భక్తుడు అయి ఉంటాడు. స్వామి యొక్క పరమ భక్తుడు అయిన వ్యక్తిని కొట్టాం. అందుకే ఆ దెబ్బలు స్వామి స్వీకరించి తన భక్తుని రక్షించుకున్నాడు. మనం వెంటనే వెళ్ళి ఆ భక్తుని పాదాలపై పడి క్షమాపణ వేడుకుందాం అని అన్నాడు తోటి అర్చకులతో.

అందరూ పరుగెత్తి మాధవదాసు కాళ్ళపై పడి క్షమించమని వేడుకున్నారు. గుడిలోకి సగౌరవంగా తీసుకుని వచ్చారు. అప్పుడు స్వామి మూర్తిపైన ఉన్న దెబ్బలు మాయం అయ్యాయి. అందరూ సంతోషించారు. అప్పట్నుంచి ఆయన నిరాటంకంగా గుడిలోనికి వెళ్ళి ప్రతిరోజూ జగన్నాథుని దర్శించుకుంటున్నాడు.

ఈ సంఘటన గురించి ప్రచారం జరిగిపోయింది. ఎంతోమంది జనాలు మాధవదాసును దర్శించుకోవడానికి రావడం మొదలుపెట్టారు. ఆయనను పొగడ్తలతో ముంచెత్తారు. తమ కోరికలు తీర్చమని కోరసాగారు. దానివల్ల ఆయనకు భగవద్ధ్యానం చేసుకునేందుకు అవకాశం దొరకకుండా పోయింది. ఈ పొగడ్తల వల్ల తనకు అహంకారం పెరిగి భక్తి నశిస్తుందేమోనని కూడా భావించాడు ఆ భాగవతోత్తముడు.

అన్నీ వదిలించుకుని జగన్నాథుని కోసం వస్తే ఇలా మళ్ళీ అన్నీ అనవసరమైనవి అంటుకుంటున్నాయని భావించిన మాధవదాసు ఎవరికీ చెప్పకుండా ఓ రాత్రి అక్కణ్ణుంచి బయలుదేరాడు. అప్పుడు జగన్నాథుడు బాలుడిగా మాధవదాసుకు కనిపించి వెళ్ళవద్దని కోరాడు.

మాధవా! నువ్వు ఇక్కడే ఉండు అన్నాడు.

నేను ఇక్కడ ఉండలేను తండ్రీ! నేను నీ ధ్యానంతో జన్మ తరింపచేసుకుని మోక్షం పొందాలని వచ్చాను. కానీ అది వీలుపడేలా లేదు. అందరూ నా చుట్టూ చేరితే నాలో అహంకారం చేరిపోయి నీ నుంచి దూరం అయిపోతాను. అందుకే వెళ్ళిపోతున్నాను అన్నాడు మాధవదాసు.

అయితే నన్ను కూడా నీ వెంట తీసుకుని వెళ్ళు అన్నాడు జగన్నాథుడు.

అయ్యో తండ్రీ! నీవు జగన్నాథుడవు. నీవు నావెంట వస్తే నీకు కావాల్సిన భోగాలు సమకూర్చలేను. కనీసం సమయానికి ఆహారం కూడా ఇవ్వలేను కదా. నా మాట విని నువ్వు ఇక్కడే ఉండు. లేదంటే నాకు బాధ కలుగుతుంది అని అనునయించాడు స్వామిని.

తర్వాత బయలుదేరి ఎన్నో ప్రదేశాలు తిరిగాడు. కొన్ని రోజులుగా తిండి లభించలేదు ఆయనకు. ఓరోజు రాత్రి సమయంలో చాలా నీరసంగా నడుస్తున్నాడు. ఒక ఇల్లు కనిపించింది మాధవదాసుకు. అక్కడికి వెళ్ళి ఆ ఇంటి ముందు నిల్చుని భిక్ష అడిగాడు.

ఆ ఇంటి ఇల్లాలు భోజనానికి పిలిచింది. కాళ్ళు చేతులు శుభ్రపరచుకుని భోజనానికి కూర్చున్నాడు ఆయన. ఆమె రెండు విస్తళ్ళలో భోజనం వడ్డించింది. ఆ ఇంటి యజమాని కోసమేమో అని ఈయన అనుకున్నాడు. ఆయన వచ్చి కూర్చున్నాక మొదలు పెడదామని చూస్తున్నాడు. స్వీకరించండి. మీరు చూస్తే ఊళ్ళు తిరిగే సన్యాసిలా ఉన్నారు. ఇంత చిన్నపిల్లవాడిని వెంటబెట్టుకుని ఎందుకు తిరుగుతున్నారు? పసిపిల్లవాడికి ఆకలి వేస్తే ఎలా పెట్టగలుగుతారు? పాపం పిల్లవాడు ఆకలితో అల్లాడిపోతున్నాడు. ఎంత ముద్దుగా ఉన్నాడో! ఈ పిల్లవాడిని ఇక్కడ వదిలి వెళ్ళండి. నేను చూసుకుంటాను. పక్కనే వేసిన విస్తరి వైపు చూపిస్తూ అంది ఆవిడ.

ఆ మాటలు విన్న మాధవదాసు ఆశ్చర్యపోయాడు. ఆ పిల్లవాడు ఎవరో కాదు. ఆ నల్లనయ్య. ఆ పరాత్పరుడు ఆ జగన్నాథుడే అని అర్థం అయిన క్షణంలో కళ్ళలో నుంచి నీళ్ళు ధారగా ఉబికాయి ఆయనకు. ఆమెకు విషయం చెప్పి ఆమె జన్మ తరించిందని చెప్పి అక్కణ్ణుంచి బయల్దేరాడు. కొంతదూరం వెళ్ళి ఓ గ్రామంలోకి వెళ్ళాక ఆయనకు విపరీతమైన జ్వరం వచ్చింది. తెలివితప్పిపోయాడు.

ఆయనకు తిరిగి స్పృహ వచ్చేసరికి ఒక చిన్న ఇంటిలో మంచంలో పడుకుని ఉన్నాడు. ఒక పిల్లవాడు మందులు ఇస్తూ సపర్యలు చేస్తూ ఉన్నాడు.

విషయం అర్థమైన మాధవదాసు స్వామీ! వద్దన్నా ఎందుకు ఇలా నా వెంట ఉండి సపర్యలు చేస్తున్నావు? నా ఈ పరిస్థితికి అసహ్యం వేస్తోంది. నీచేత నేను సేవలు చేయించుకోవడం ఏమిటి? నా స్థితిని తప్పించగలవాడివి అయి ఉండి, ఇలా ఎందుకు చేస్తున్నావు? అని ఏడ్చాడు.

నీ కర్మఫలం ఇంకా పదిహేను రోజులు అనుభవించవలసి వుంది. అది అయిపోతే నీవు మోక్షం పొందుటకు పూర్తి అర్హుడవు అవుతావు. కానీ నీ భక్తికి వశుడిని అయ్యాను. సర్వదా నన్నే స్మరిస్తూ ఏ కష్టానికీ చలించని నీవంటి భక్తులను ఎలా వదులుకుంటాను? అందుకే నీవెంటే ఉంటున్నాను.

నీవు అన్నట్లుగా నేను కర్మఫలం తీయగలను. కానీ నీవంటి మహాభక్తుడికి కొడుకుగా సేవ చేయడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. నీ కోరిక మేరకు నీవు అనుభవించాల్సిన మిగతా పదిహేను రోజుల కర్మఫలం తీసివేసి నీకు మోక్షం ప్రసాదిస్తున్నాను. అయితే నీ చరిత్ర అందరికీ తెలిసి నీ భక్తిని అందరూ స్మరించుకోవాలి. అందుకోసం నీ పదిహేను రోజుల కర్మఫలం అయిన జ్వరం నేను స్వీకరిస్తున్నాను అని చెప్పి ఆయనకు ముక్తిని ఇచ్చాడు జగన్నాథుడు.

ఇందుకు గుర్తుగా ప్రతి సంవత్సరం పూరీలో జగన్నాథుడికి జ్వరం వస్తుంది. ఇప్పటికీ డాక్టర్లని పిలిచి ఆయుర్వేదానికి సంబంధించిన ఆహారం మాత్రమే నైవేద్యంగా పెడతారు. వివిధ రకాల నైవేద్యాలు అప్పుడు ఉండవు.

ప్రతి సంవత్సరం జగన్నాథ రథయాత్రకు పదిహేను రోజుల ముందు స్వామికి పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తారు. ఆ సందర్భంగా నూట ఎనిమిది బిందెల నీళ్ళతో అభిషేకం చేస్తారట. ఆ నీటివల్ల స్వామికి, సుభద్ర, బలభద్రులకు కూడా జ్వరం వస్తుంది.

సాధారణంగా జ్వరం వచ్చినప్పుడు ఎలా అయితే స్వెట్టర్, మఫ్లర్ వేసుకుంటారో అలాగే వాళ్ళకు ధరింపచేస్తారట. దర్శనాలు నిలిపివేస్తారు. రథయాత్రకు ముందురోజు దర్శనం ఉంటుంది. తరువాత రథయాత్ర మొదలు అవుతుంది.

ఇటువంటి భక్తుల చరిత్ర చదివినా, విన్నా మనసు ఆ దేవదేవుని పాదపద్మాలకు చేరకుండా ఉంటుందా? తప్పకుండా మన మనసు ఆయనను చేరుకుంటుంది. తన భక్తుల గురించి వింటే, చదివితే ఆయన మహదానందం పొందుతాడు కదా!

**జై జగన్నాథా!**
**సర్వం శ్రీకృష్ణార్పణమస్తు**
**సమస్త సన్మంగళాని భవంతు**
**సర్వేజనా సుఖినోభవంతు**
**లోకా సమస్తా సుఖినోభవంతు**
**ఓం శాంతి శాంతి శాంతిః**

# మీ ప్రశ్న - మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. భాగవత సప్తాహాలు ఈమధ్య కాలంలో చాలా గొప్పగా జరుగుతున్నాయి. అసలు భాగవతం గొప్పదనం ఏమిటి? భాగవత సప్తాహ మహిమ గురించి కూడా తెలియజేయండి. – మరింగంటి శాంత, తాడేపల్లి.**

జవాబు – శ్రీమద్భాగవత పురాణం 'యద్వైష్ణవానాం ధనమ్' అన్నట్లుగా పరతత్త్వాన్ని సమగ్రంగా ప్రబోధించే అత్యుత్తమమైన గ్రంథం. అన్ని అవతారాల అనుభవం మనకు దీని ద్వారా కలుగుతుంది. విశేషించి శ్రీకృష్ణావతార బాల్య లీలలు ఈ గ్రంథంలోనే మనకు కనిపిస్తాయి. భాగవతం చదివితే మనం 'బాగవుతాం'. 'భా' అనగా 'భక్తి'. 'గ' అనగా 'జ్ఞానం'. 'వ' అనగా 'వైరాగ్యం'. 'త' అనగా 'తత్త్వము'. మరియు 'ము' అనగా 'ముక్తి'. క్లుప్తంగా చెప్పాలంటే జ్ఞాన వైరాగ్యాల ద్వారా తత్త్వాన్వేషణ గావించి ముక్తిని ప్రసాదించేదే భాగవతం. భగవంతుని మరియు భగవద్భక్తుల కథలను వినిపిస్తుంది భాగవతం. శుకమహర్షి వల్ల పరీక్షిన్మహారాజు ఏడు రోజులలో భాగవతాన్ని విని మరణాన్ని జయించాడు. ఏడు రోజులలో భాగవతం చెప్పడం, వినడాన్ని 'భాగవత సప్తాహం' అని అంటారు. ఇది జరిగిన చోటే కాక ఆ ఊరు ఊరంతా పవిత్రమై, ఇందులో పాల్గొని, భాగవతం విన్నవారంతా నారాయణానుగ్రహాన్ని తప్పక పొందుతారని పెద్దల కథనం.

**2. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలలో వివిధ వాహనాలపై స్వామి ఊరేగుతాడు కదా! ఆయా వాహనాల విశిష్టత క్లుప్తంగా వివరించ మనవి - సరితా సుధ, హైదరాబాద్.**

జవాబు – అలాగే. శ్రీవేంకటేశ్వరుడు బ్రహ్మోత్సవాలలో ఊరేగే వాహనాలు, చాలా క్లుప్తంగా వివరించడం జరుగుతుందిక్కడ.

1.హనుమద్వాహనం – హనుమ భగవద్భక్తులలో గొప్పవాడు కదా! దాసత్వానికి ప్రతీక. వీరిని సిరియ తిరువడి అని తమిళ సంప్రదాయంలో అంటారు.

2.గజ వాహనం – భాగవతంలోని గజేంద్ర మోక్షం మనకు తెలిసిందే. శరణాగతిలో గజేంద్రునికి ఎంతో ప్రత్యేకత ఉన్నది. లక్ష్మీ మాతతో కలిసి క్షీరసాగర మథనమప్పుడు గజం కూడా ఆవిర్భవించింది.

3.సూర్యప్రభ వాహనం – సూర్యుడు కర్మసాక్షి, ప్రత్యక్ష దైవం. ఆయన ప్రభ స్వామిని ముందుకు నడుపుతుంది.

4. చంద్రప్రభ వాహనం – గీతలో శ్రీకృష్ణుడు నక్షత్రాలలో నేనే చంద్రుడు అని అన్నాడు. ఆయన ఓషధీశుడు. మనకు ఆహ్లాదాన్ని, పోషణను అందిస్తాడు.

5. హంస వాహనం – హంస పాలు, నీరు వేరు చేసినట్టే ఆత్మానాత్మ వివేకం కలవానికి దైవానుగ్రహం కలుగుతుంది. భగవానుడు అటువంటి వారినే కరుణిస్తాడు.

6. సింహ వాహనం – శిష్టరక్షణ, దుష్టశిక్షణకై శ్రీమన్నారాయణుడే నృసింహరూపం దాల్చి ప్రహ్లాదుణ్ణి కాపాడాడు.

7. ముత్యపు పందిరి వాహనం – చక్కని ముత్యాలు చలువదనానికి ప్రతీకలు. మరి లోకాలనేలే చల్లనితండ్రి వేంకటేశునికి ముత్యాలపందిరి వాహనం అయింది.

8. కల్పవృక్ష వాహనం – కల్పవృక్షం కోరిన కోరికలు తీరుస్తుంది. అలాగే భక్తుల మనోభీష్టాలు తీర్చే స్వామికి వాహనంగా ఉత్సవాలలో కనబడుతుంది.

9. సర్వభూపాల వాహనం – రాజులందరిలో భగవంతుని అంశ ఉంటుంది. అందుకే రాజులంతా ఆ స్వామిని తమ భుజాలపై ఉంచుకుని ఊరేగిస్తారు.

10. మోహినీ అవతారం – ఈ జగత్తంతా మాయా మోహాలతో నిండి ఉన్నది. అయితే తన అనుగ్రహం పొందినవారు ఈ మాయను తేలికగా దాటగలరని ఈ అవతారానికి అర్థం.

11. గరుడ వాహనం – శ్రీమహావిష్ణువుకి అత్యంత ప్రీతిపాత్రమైన సేవకుడు గరుడుడు. ఆయనే నిత్య వాహనం. వీరిని శ్రీవైష్ణవ సంప్రదాయంలో గరుడుణ్ణి పెరియ తిరువడిగా కీర్తిస్తారు.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు.**
**– ఎడిటర్, శ్రీవేంకటేశం**



# తొలి ఏకాదశి

ప్రకృతిలో సతత హరిత శోభను, నదీనదాల్లో జలకళను, పుష్పసముదాయంలో కోమలత్వాన్ని, పుడమిలోని ఆవిష్కార లక్షణాన్ని 'విష్ణుతేజంగా' ఆగమాలు నిర్దేశించాయి. సకల సృష్టిలో కంటికి కనిపించే సౌందర్యాత్మక సిరి వైభవాన్ని విష్ణు విలాసంగా సనాతన ధర్మం ప్రతిపాదించింది. అలాంటి శ్రీమహావిష్ణువు దివ్యదేహం నుంచి వెలువడిన సత్వరూప సమున్నత శక్తి – ఏకాదశి. ఏడాదికి ఇరవైనాలుగు, అధికమాసం వచ్చిన సందర్భంలో ఇరవై ఆరు ఏకాదశులు ఉంటాయి. ఆషాఢ శుద్ధ ఏకాదశిని ప్రథమ ఏకాదశిగా, మహా ఏకాదశిగా, దివ్య ఏకాదశిగా ప్రస్తావిస్తారు. సంవత్సరాన్ని 'వర్షం'గా పేర్కొంటారు. ప్రకృతిలో ఐశ్వర్యకారక శక్తిని పెంపొందింపచేసే వర్ష పరంపరకు ఆహ్వానం పలికే ఆషాఢంలోని శుద్ధ ఏకాదశి, తొలి ఏకాదశిగా ఖ్యాతి చెందింది.

క్షీరసాగరంలో శేషతల్పంపై శ్రీహరి తొలి ఏకాదశినాడు యోగనిద్రకు సమాయత్తమవుతాడని విష్ణుపురాణం పేర్కొంది. అందుకే ఈ తిథిని హరివాసరంగా, శయనైకాదశిగా చెబుతారు. విశాల విశ్వానికి క్షీరసాగరం సంకేతం. ఆదిశేషుడు అనంత కాలగమనానికి సూచిక. ఆ నియంత్రించే కాలస్వరూపుడిగా, కాలాత్మకుడిగా శ్రీవిష్ణువు కాలయవనికపై భాసిల్లుతాడు. యోగనిద్ర ద్వారా, అంతర్వీక్షణతో సమస్త జగద్రక్షణ కోసం చింతన చేస్తూ స్థితి కారకత్వాన్ని కొనసాగిస్తాడు. తన అంతర్భాగంలో ఉన్న అఖిలాండ బ్రహ్మాండాన్ని పరిరక్షిస్తుంటాడు. శ్రీమహావిష్ణువు ధ్యానపరంపర కార్తీక శుద్ధ ఏకాదశి వరకు, అంటే తొలి ఏకాదశి నుంచి నాలుగు నెలల పాటు కొనసాగుతుంది.

అందుకే ఈ కాలంలో యతీశ్వరులు చాతుర్మాస్య దీక్షను ఆచరిస్తారు. తొలి ఏకాదశి నుంచే సనాతన సంప్రదాయంలో పండుగలు, పర్వదినాల సమాహారం ఆరంభమవుతుంది. ఉత్తరాయణ పుణ్యకాలం ఉపాసనా కాలమైతే, దక్షిణాయనం దైవారాధన తరుణం ఉత్సవ సంరంభాలు. దీక్షా విధులు, నియమ పూర్వక విధివిధానాలకు దక్షిణాయనం ఆలవాలం. అలాంటి ధర్మాచరణకు తొలి ఏకాదశి శుభ శ్రీకారం చుడుతుంది. తొలి ఏకాదశి పర్వదినం నుంచే జీవుల్లో జాగృతశక్తి అధికమవుతుందని చతుర్వర్గ చింతామణి వెల్లడించింది. ఆరోగ్య నియమాల అనుసరణకు, ఆధ్యాత్మిక విధుల ఆచరణకు తొలి ఏకాదశి ప్రాతిపదిక. చాతుర్మాస్య దీక్ష పేరిట, ఈ నాలుగు నెలలూ శాకాహారాన్ని మాత్రమే స్వీకరించాలని, కఫాన్ని దూరం చేసి శరీరానికి పుష్టినిచ్చే పదార్థాల్ని ఆహారంలో చేర్చుకోవాలని చరక సంహిత ప్రస్తావిస్తోంది.

కృతయుగంలో మురాసురుణ్ణి తన నుంచి వ్యక్తమైన యోగమాయతో విష్ణువు సంహరించాడని, ఆ యోగమాయనే "ఏకాదశి" తిథిగా విష్ణువు అనుగ్రహించాడని చెబుతారు. విష్ణుభగవానుడి ఇరవైనాలుగు రూపాలైన కేశవ నుంచి శ్రీకృష్ణ వరకు ఉన్న నామధేయాలు ఏకాదశి తిథులకు అధిష్ఠాన మూర్తులు. మార్గశిరం నుంచి కార్తీకం వరకు ఉండే ఏకాదశుల్ని హరి దీప్తులుగా పద్మపురాణం పేర్కొంది. పంచ కర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రియాల్ని కలిపి ఇంద్రియ దశకం అంటారు. వీటికి మనసును మేళవిస్తే ఏకాదశ ఇంద్రియాలవుతాయి. ఈ ఇంద్రియాలకు సంకేతమే ఏకాదశి తిథి. సమస్త ఇంద్రియాల్ని ఏకోన్ముఖం చేసి ఏకాదశి నాడు విష్ణు కృపను ఆకాంక్షించాలని ఏకాదశి మాహాత్మ్యం నిర్దేశించింది. ఎన్నో విశేషాల ఆధ్యాత్మికం ప్రక్రియల రాశి తొలి ఏకాదశి.

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలమైన రోజులు. వాహన సౌఖ్యం. ఆకస్మిక ధనాదాయము. ఎవరికి హామి ఉండరాదు. ఎప్పటి నుండో పెండింగ్‌లో ఉన్న పని నెరవేరును. నూతన పరిచయాలు సంతృప్తిని ఇవ్వగలవు. జాయింట్ వ్యాపారములు కలిసి రావు. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## వృషభరాశి

కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు చేయు వృత్తివ్యాపారములందు ఆకస్మికంగా ధరలు పెరిగి ధనాదాయం బాగుంటుంది. మీరు తొందరపాటు నిర్ణయములు చేసి నిందలు పాలు అగుదురు. చాలా జాగ్రత్తగా తక్కువగా మాట్లాడగలరు. ఎవరికి చిక్కరాదు. అమ్మవారి పూజలు చేయండి.

## మిథునరాశి

మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు బిపి అప్ అండ్ డౌన్ వలన కొంత ఆందోళన ఉంటుంది. ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకొనగలరు. కోపతాపములకు సరైన సమయం కాదు. తక్కువగా మాట్లాడి ఎక్కువ పనులు చేసుకొనగలరు. అమ్మవారి పూజలు గ్రామ దేవత ఆరాధన శాంతినిస్తుంది.

## కర్కాటకరాశి

పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు కొందరు ఎత్తులకు పైఎత్తులు వేస్తారు. మీరు చాకచక్యముగా ఉండవలసిన సమయము తొందరపాటు లేకుండా వినయ విధేయతలతో సమస్యలు పరిష్కరించుకొనవలెను. అనారోగ్య సమస్యలు కలిగి ఉన్నారు. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## సింహరాశి

మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము

ఈ రాశి స్త్రీ పురుషులకు కొన్ని సమస్యలకు పరిష్కారము ఉన్నవి. గ్రామదేవతల అనుగ్రహం కొరకు అమ్మను ఆరాధించుకొనగలరు. ఆకస్మికముగా ఆదాయ వనరులు రాగలవు. ప్రయాణములు వాయిదా వేయండి. చెడు స్నేహాలను వదిలించుకొనగలరు. ఆదివారం పూజలు చేయండి.

## కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ పురుషులకు ఇష్టాగోష్టి బంధుమిత్రుల కలయిక ప్రయత్న లాభము కార్యసాధన ద్వారా సంతృప్తి గృహాలంకరణకు పెద్ద పీట వేయగలరు. కొన్ని పనులు వాయిదా వేయుట మంచిది. తొందరపాటు మంచిది కాదు. నవగ్రహ ప్రదక్షిణలు దుర్గాదేవి స్తోత్రాలు చేయండి.

## తులారాశి

చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో అనుకూలత. ఎవరికి ఏ విధమైన హామీలు ఇవ్వరాదు. సాక్షి సంతకములు పెట్టరాదు. ఆర్థిక వనరులు కలిగి ఉన్నారు. ఆదాయం లేక ఎంత ధనం అప్పులు తెచ్చినా ఖర్చు అవుతుంది. ఏదో ఒకటి కొనుటకు మనసు ఇష్టపడుతుంది. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## వృశ్చికరాశి

విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. ప్రయాణములలో జాగ్రత్త. వ్యవహారములలో ఏమి మాట్లాడిన ఏదో తెలియని నష్టములు. వృత్తి వ్యాపారములందు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎవరికి హామి ఉండరాదు. నవగ్రహ ప్రదక్షిణలు దానాలు చేయండి.

## ధనూరాశి

మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.

ఈ రాశి స్త్రీ పురులషులకు ఏ విధమైన లోటు లేకుండా ఆర్థికముగా నిలదొక్కుకొనగలరు. సంతృప్తికరంగా కాలం గడువగలదు. అప్పుడప్పుడు కొన్ని గంటలు ఏదైన బాధ కలిగినా భయము వదలి ధైర్యంగా ముందుకు సాగండి. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## మకరరాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ఠ 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ పురుషులకు ప్రతి విషయంలో ఆటంకములు కలిగి ఉన్నారు. ఆర్భాటములకు సమయం కాదు. స్త్రీల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండగలరు. ఏ మాత్రం చనువుగా మాట్లాడినా కష్టనష్టములు రాగలవు. సుబ్రహ్మణ్యేశ్వర దుర్గాదేవి పూజలు చేయండి.

## కుంభరాశి

ధనిష్ఠ 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులు కొంతవరకు ఊరట కలిగి ఉండగలరు. ఏ విషయమునైన ఏమరపాటు లేకుండా జాగ్రత్తలు పాటించండి. నిరాశ నిస్పృహలకు అవకాశమివ్వరాదు. సంతోషంగా ఈశ్వర ఆరాధన, నవగ్రహ ప్రదక్షిణలు, శనిదేవునికి తైలాభిషేకం చేయగలరు.

## మీనరాశి

పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు అనేక చిక్కు సమస్యలు ఉండగలవు. శని బలం లేక ఇతరుల దగ్గర కొన్ని రోజులు లేక కొన్ని నెలలు ఉండవలసి వచ్చును. గ్రహాలు అనుకూలత లేదు. నవగ్రహ ప్రదక్షిణలు చేసి శనికి తైలాభిషేకం, నువ్వులు కడిగి ఎండపోసినవి కిలోంపావు, నలుపు వస్త్రం దానం చేయండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: డా.పి. లలితవాణి




శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. శ్వాస ధ్యానానికి మరో పేరు ?
2. బృహదశ్వుని కొడుకు పేరు?
3. ఆదిశంకరుల జన్మస్థలమేది?
4. సుగ్రీవుని మామ ఎవరు?
5. దుంధువు ఎవరి కొడుకు?
6. శంకరస్వామి వారి ఇల్లు ఏ నదీ ప్రాంతంలో ఉన్నది?
7. సమర్థ రామదాసు అసలు పేరేది?
8. వరాహస్వామి – పుష్కరిణికి ఏ దిశలో ఉన్నాడు?
9. ఇంద్రద్యుమ్నుని శపించిందెవరు?
10. తృణావర్తుడు ఏ గుణానికి రూపం?
11. నీళాదేవి ఎవరి కూతురు?
12. కనకధారా స్తోత్రాన్ని చెప్పిందెవరు?
13. శ్రీహరికే వరాలనిస్తానన్నది ఎవరు?
14. సమర్థ రామదాసుకు ప్రత్యేక శిష్యుడెవరు?
15. శ్రీహరి శంఖు చక్రాలను ఎవరికిచ్చాడు?

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______
11. ______
12. ______
13. ______
14. ______
15. ______

### గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. పూర్వాభాద్ర, 2. శాపం పొందిన జమదగ్ని మహర్షి, 3. భరద్వాజుని, 4. అనుహ్లాదుడు, 5. లక్నో దగ్గరున్న సీతాపూర్ జిల్లాలో, 6. శ్రీమహావిష్ణువు యొక్క శ్రీవత్స – అంశ, 7. వల్లభాచార్యులు, 8. ముని వాహనుడు, 9. సూరదాస్, 10. బేధా ఘాట్, 11. బలిచక్రవర్తి కుమార్తె, 12. కుబేరుని కుమారులు నలకూబరుడు, మణిగ్రీవుడు, 13. శంఖరాజు, 14. పిఠాపురంలో, 15. శ్రీలక్ష్మీదేవి

### సరైన సమాధానాలు రాసినవారు

1. చింతలపాటి శివశంకర శాస్త్రి, 2. టి. సాయికుమార్, 3. సూరి సౌభాగ్య లక్ష్మి, 4. పి. యశోద, 5. కె. కీర్తిపాల్, 6. టి. సంయుక్త

పేరు: ______

చిరునామా: ______

పిన్‌కోడ్: ______

ఫోన్: ______

### లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

కె. సంయుక్త



Postel Registration No: HSE/879/2022-2024

Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month

RNI No.: APTEL/2008/23122

# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక



If Un delivered please return to:

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq